తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 03.09.2026 | సంపుటి : 13 సంచిక : 45 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# ఏం చేయాలో చెప్పండి

## మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్, భట్టి భేటీ

- మంత్రి వర్గ విస్తరణ, క్రమశిక్షణా చర్యలు, నామినేటేడ్ పోస్టులు తదితర కీలక అంశాలపై చర్చ
- కాంగ్రెస్ ప్రధాని కార్యదర్శి జైరాం రమేష్ తోనూ ముఖ్యమంత్రి సమావేశం



**ఔన్యూఢిల్లీ(జనంసాక్షి):** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ వ్యవహారం, క్యాబినెట్ విస్తరణ, పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై ఖర్గేతో రేవంత్, భట్టి చర్చించినట్లు సమాచారం. భేటీ అనంతరం ఖర్గే కారులోనే వైఎస్ఆర్ అవార్డుల కార్యక్రమానికి వారిద్దరూ వెళ్లారు. కాగా దిల్లీలో ఖర్గేతో భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై ఖర్గే, భట్టి, ఉత్తమ్ చర్చించారు. కాగా దిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ సింగ్‌ను మంత్రి కలిశారు. సాగు, రైతుల సంక్షేమ అంశాలపై కేంద్రమంత్రికి విజ్ఞప్తులు చేశారు. ఆయిల్‌పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసానితో తుమ్మల భేటీ అయ్యారు. కొత్తగూడెంలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రాంతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలని, పీఎం-ఆర్‌కేవీవై కింద తెలంగాణకు కేటాయింపులు పెంచాలని కోరారు.

## చేసేదంతా చేసి..



# బీసీ కార్డు బయటకు తీసిన కొండా సురేఖ

- బీసీనైన నాకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?
- నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు
- నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు..
- కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందంతా చెప్పాను
- అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నారు
- మంత్రి కొండా సురేఖ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తన విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ తెలిపారు. దిల్లీలో మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. "ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశాను. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదు. నన్ను రాజీనామా చేయమని ఇప్పటివరకు చెప్పలేదు. బీసీనైన నాకు ఒక న్యాయం.. ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయం పాటిస్తారా? క్యాబినెట్‌లో ఉన్న ఇతర సామాజిక వర్గాల వారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. వాటన్నిటికీ ఏం సమాధానం చెబుతారు? ఏం చర్యలు తీసుకుంటారు? జరుగుతున్న అన్ని వ్యవహారాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ సహా అధిష్ఠాన ముఖ్యులందరికీ రాతపూర్వకంగా

మిగతా 2లో..



## వెయ్యిరోజుల

# పాలన భేష్

- సామాన్యుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశాం
- కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు
- వరి వేస్తే ఉరేనని ఆనాటి దొర కేసీఆర్ అన్నారు
- మా ప్రభుత్వం రాగానే ఆ పంటకు బోనస్ ఇస్తున్నాం
- వరి సాగులో దేశంలోనే ప్రథమ స్థానం సాధించాం
- అప్పుల భారం ఉన్నప్పటికీ ముందుకు వెళుతున్నాం
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల ప్రజాపాలనలో సామాన్యుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ పాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు. "రైతే రాజుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. వరి వేస్తే ఉరేనని ఆనాటి దొర అన్నారు. మా ప్రభుత్వం రాగానే ఆ పంటకు బోనస్ ఇస్తున్నాం. వరి సాగులో దేశంలోనే ప్రథమ స్థానం సాధించాం. గత ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించింది. గ్రూప్-1 ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారు. మా ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. కోర్టు ద్వారా గ్రూప్-1 నియామకాలు ఆపాలని చూశారు.

మిగతా 2లో..



## గ్లోబల్ సమ్మిట్- రక్ష ఎక్స్‌పోలో

# భాగస్వాములు కండి

- దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూములు కేటాయించండి
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి
- విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి
- హెలీ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టండి
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..



# రాష్ట్రంలో బీఆర్ఎస్ పోరుబాట

## వెయ్యిరోజుల పాలనలో ఎటు చూసినా విధ్వంసమే: కేటీఆర్

- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం
- జలద్రోహం చేస్తున్న జలగల పాలన
- అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో
- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30% కమిషన్లు వసూలు చేస్తున్నారు
- వెయ్యిరోజుల్లో రూ.4.50లక్షల కోట్ల అప్పులు
- రుణమాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు అన్నీ మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

**హైదరాబాద్,సెప్టెంబర్2(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. బుధవారం రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో ఛార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాల నలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమిషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రో మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్

మిగతా 2లో..

# కేపీహెచ్‌బీలో భూముల ధరకు రెక్కలు

## చదరపు గజానికి రూ.2.70లక్షలు

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)లో ఓపెన్ ప్లాట్లు భారీ ధర పలికాయి. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ప్లాట్లకు హౌసింగ్ బోర్డు బుధవారం బహిరంగ వేలం నిర్వహించింది. చదరపు గజానికి కనీస ధర రూ.1.60లక్షలుగా నిర్ధరించగా.. అత్యధికంగా రూ.2.70లక్షలు పలికినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతమ్ తెలిపారు. మరో ప్లాట్‌ను చదరపు గజం రూ.2.36 లక్షలకు.. మరో రెండు ప్లాట్లు రూ.2.06 లక్షలకు వేలం పాటలో అమ్ముడుపోయినట్లు చెప్పారు.





# మళ్లీ వరద గుబులు

- నేపాల్‌లో భారీగా కురుస్తున్న వర్షాలు
- ఉప్పొంగుతున్న 3 ప్రధాన నదులు
- 1130కి పెరిగిన మరణాల సంఖ్య

**ఖాట్మాండ్,సెప్టెంబర్2(జనంసాక్షి):** నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటి వరకు 1,113 మృతదేహాలకు పోస్ట్‌మార్టం.. చట్టపరమైన గుర్తింపు ప్రక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపులేని

మిగతా 2లో..

# అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా జితేంద్ర మిశ్రా

**అయోధ్య,సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఎంపికయ్యారు. ఈ మేరకు జన్మభూమి ట్రస్ట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. 5,585 దరఖాస్తులను పరిశీలించిన కమిటీ.. 39 ఏళ్ల పాటు ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందించిన జితేంద్ర మిశ్రాను ఆలయ ట్రస్ట్ సీఈఓగా నియమిస్తున్నట్టు ప్రకటించింది. భారత వైమానిక దళానికి సంబంధించిన ఎన్నో ఆపరేషన్లలో కీలకంగా పని చేసిన మిశ్రా.. గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో

మిగతా 2లో..





# తృటిలో తప్పిన పెనుప్రమాదం

కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు ప్రయాణికులతో వెళ్తున్న బస్సు సుందరగిరి శివారులోకి బస్సు చేరుకున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపుతప్పి వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లింది. బస్సు ముందు భాగంలోని టైర్ వ్యవసాయ బావిలోకి వెళ్లింది. బావి వద్ద బస్సు ఆగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారకపోవడంతో ప్రయా ణికులు చివరకు ఊపిరిపీల్చుకున్నారు.ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. హుస్నాబాద్(జనంసాక్షి):

# రష్యా గగనతలంలో ప్రయాణించొద్దు

- ఆ దేశంపై ఏ క్షణాన్నైనా భారీ డ్రోన్‌దాడులు చేస్తాం :జెలెన్‌స్కీ
- ఉక్రెయిన్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై మండిపడ్డ పుతిన్
- వారు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం
- వారితో చర్చలు జరపడానికి సిద్ధంగా లేమని వెల్లడి

**కీవ్(జనంసాక్షి):** రష్యా-ఉక్రెయిన్ మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ విమానయాన సంస్థలు, ప్రయాణికులకు హెచ్చరికలు చేశారు. రష్యాపై అతిపెద్ద డ్రోన్ దాడులు చేపట్టడానికి సిద్ధమైనట్లు ప్రకటించారు. ఏ క్షణమైనా డ్రోన్లు ప్రయోగించే అవకాశం ఉందని..

మిగతా 2లో..

# కథ మళ్లీ మొదటికీ..

## అమెరికా, ఇరాన్‌ల మధ్య పరస్పర దాడులతో మళ్లీ అనిశ్చితి

- పశ్చిమాసియాలో మళ్లీ చేలరేగిన ఉద్రిక్తతలు
- పెళ్లి వేడుకపై అమెరికా క్షిపణి దాడి
- చిన్నారితో సహా ఐదుగురు మృతి, 50 మందికి గాయాలు
- ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ సైన్యం
- ఇరాక్, జోర్డాన్, కువైత్, బహ్రెయిన్‌పై ఐఆర్‌జీసీ ప్రతికార దాడులు
- అమెరికాను విడిచిపెట్టేదిలేదని సుప్రీం లీడర్ హెచ్చరిక



**టెహ్రాన్,సెప్టెంబర్2(జనంసాక్షి):** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. అమెరికా దాడులతో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. మంగళవారం రాత్రి అమెరికా దాడులు చేయడంతో ఇరాన్ కూడా ప్రతీకార దాడులకు దిగింది. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఇరాక్, జోర్డాన్‌పై ఇరాన్ ప్రత్యేక సైనిక దళం ఐఆర్‌జీసీ దాడి చేసింది. కువైత్, బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించాయి. సిరిక్ ప్రాంతంలో అమెరికా దాడి వల్ల ఓ పెళ్లింట విషాదం సంభవించిందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఓ చిన్నారి సహా నలుగురు మృతి చెందారని, 50 మంది గాయపడ్డారని తెలిపింది. ఈ ఉదంతంపై ఇరాన్ సుప్రీం లీడర్ మండిపడ్డారు. యూఎస్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. యూఎస్‌కు తమ సైన్యం మర్చిపోలేని గుణపాఠం చెబుతుందని ఐఆర్‌జీసీ ప్రతినిధి హుస్సేన్ మొహబి పేర్కొన్నారు. ఈ దాడులు ఎందుకు చేశామా? అని చింతించేలా చేస్తామని హెచ్చరించారు. అయితే, హోర్ముజ్‌లో కమర్షియల్ నౌకలపై ఇరాన్ దాడి చేసే ప్రయత్నం చేయడంతోనే తాము దాడులు చేయాల్సి వచ్చిందని

మిగతా 2లో..

# పిల్లల పాస్‌పోర్ట్ కోసం కొత్త మెలిక

- దరఖాస్తు చేసుకోవాలంటే తల్లిదండ్రుల పౌరసత్వం వివరాలు ఇవ్వాల్సిందే..
- బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ నిరుత్సాహపరిచేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్న ట్రంప్ సర్కార్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో జన్మతః లభించే పౌరసత్వాన్ని (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) నిరుత్సాహపరిచేందుకు ట్రంప్ సర్కార్ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. తమ పిల్లలకు పాస్‌పోర్ట్ దరఖాస్తు చేసుకోవాలంటే.. అమెరికాలోని తల్లిదండ్రులు ముమ్ముందు తమ పౌరసత్వం, ఇమిగ్రేషన్ స్టేటస్‌కు సంబంధించిన రుజువులు సమర్పించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇకనుంచి యూఎస్ ప్రభుత్వం దరఖాస్తుదారులను సంబంధింత పత్రాలు అడిగే యోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః లభించే పౌరసత్వాన్ని పరిమితం చేసేలా బర్త్ టూరిజాన్ని నిషేధించేలా గతనెల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అమెరికా విదేశాంగశాఖ తాజా ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. "ఈ ప్రభుత్వం అమెరికన్ పౌరసత్వం అర్థాన్ని, విలువను కాపాడుతుందని ట్రంప్ స్పష్టంగా చెప్పారు. దానికి అనుగుణంగా పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఉంటుంది" అని అగ్రరాజ్య

మిగతా 2లో..

## బీసీ కార్డు బయటకు తీసిన కొండా సురేఖ

తెలియజేశాను. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఇవాళ ఖర్గేను కలిసిన సందర్భంగా కోరాను" అని కొండా సురేఖ అన్నారు.

నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు: మంత్రి కొండా సురేఖ

దిల్లీ: తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. నా వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదన్నారు. దిల్లీలో మీడియాతో కొండా సురేఖ మాట్లాడారు. "కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.నా బిడ్డ వ్యాఖ్యలపై నేను స్పందించను. సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. రోజూ ఎంతో మంది మాట్లాడతారు.. అందులో సుస్మిత కూడా ఒకరు. నా బిడ్డ కాబట్టి నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయను. నా వివరణను మీనాక్షి నటరాజన్‌కు చెప్పాను. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారు. పార్టీలో కొందరితో నాపై ఆరోపణలు చేయించారు. ఎవరు అలా చేయించారో తెలుసు. పేర్లు చెబితే వివాదం అవుతుంది. నాపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలి. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నా.. అందుకే ఇక్కడికి వచ్చి నా బాధ చెప్పుకొన్నా. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చా. పార్టీ తీసుకునే నిర్ణయం బట్టి నా ఆలోచన ఉంటుంది" అని కొండా సురేఖ అన్నారు.

## వెయ్యిరోజుల పాలన భేష్

ఇటీవలే 10వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తున్నాం. గత ప్రభుత్వ బకాయిలు, అప్పులను చెల్లిస్తున్నాం. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే తపనతో పనిచేస్తున్నాం. బీఆర్ఎస్ నేతల ఉద్యోగాలను ఊడగొట్టారని ప్రజలను వారు రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వం చేసిన ఏ కార్యక్రమాన్నీ ప్రతిపక్షాలు ప్రశంసించలేదు. ఉప ఎన్నికల్లో ఎన్ని పొర్లుదండాలు పెట్టినా కాంగ్రెస్ గెలిచింది. ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. ప్రజలు అసహ్యించుకుంటున్నా ఆ పార్టీ నేతలు మారలేదు. గతంలో బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు. రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆయన సంస్కారహీనంగా మాట్లాడారు. హయాంలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని మండిపడ్డారు.

# గ్లోబల్ సమ్మిట్- రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి



ఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్ఠాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. రక్షణ ఎక్స్‌పో-2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలియజేశారు. రక్షణ శాఖ కోరినట్లు మొత్తం 1500 ఎకరాలు కోరినందున, మరో 750 ఎకరాలు సేకరించే ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

తెలంగాణలో ఆదిలాబాద్, మామూనురు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబరు నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలియజేశారు. హుస్సేన్ సాగర్ లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారా ల్లో ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మళ్లీ వరద గుబులు

911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటి వరకు 6,541 మందిని రక్షించగా..4,858 మంది గల్లంతయ్యారు.

## పిల్లల పాస్‌పోర్ట్ కోసం కొత్త మెలిక

విదేశాంగశాఖ పేర్కొంది.ప్రస్తుతం పాస్‌పోర్ట్ నిబంధనల ప్రకారం.. యూఎస్‌లో జన్మించిన పిల్లల పాస్‌పోర్ట్‌ల కోసం దరఖాస్తు చేసుకునే తల్లిదండ్రులు వారి బంధాన్ని నిరూపించే పత్రాలను సమర్పించాలి. దాంతోపాటుగా ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు పత్రాన్ని ఇవ్వాలి. అలాగే సిటిజన్‌షిప్ స్టేటస్ వివరాలను దరఖాస్తు పత్రంలో పేర్కొంటే సరిపోతుంది. ఇక, ఇమిగ్రేషన్ స్టేటస్‌ను సమర్పించడం తప్పనిసరేం కాదు. కానీ, ఇక మీదట ఈ పౌరసత్వ, ఇమిగ్రేషన్ వివరాలను రుజువులతో సహా సమర్పించేలా కొత్త నిబంధనలను తీసుకొచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## అయోధ్య రామాలయ ట్రస్ట్ సీఈఓగా జితేంద్ర మిశ్రా

వెస్ట్రన్ కమాండర్‌గా సేవలందించారు. 2026 ఏప్రిల్లో ఆయన ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా రిటైరైయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో తన కృషికి గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సర్వోత్తమ యుద్ధ సేవ మెడల్‌ను కూడా అందుకున్నారు. రామాలయ ట్రస్ట్‌లో ముగ్గురు కొత్త సభ్యులను కూడా కమిటీ నియమించింది. మదన్ మోహన్ పాండే, మహేశ్ భగచంద్కా, నిర్మలా యాదవ్‌లను సభ్యులుగా ఎంపిక చేసింది. కొన్ని నెలల క్రితం అయోధ్య రామాలయ విరాళాల్లో దుర్వినియోగం జరిగిన విషయం తెలిసిందే.

## ఆర్టీసీ నైట్ సర్వీసులు ప్రారంభం


హైదరాబాద్,సెప్టెంబర్2(జనంసాక్షి):హైదరాబాద్ జంటనగరాల పరిధిలో నైట్ టైమ్ రవాణా సౌకర్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారికి తెలంగాణ స్టేట్ రోడ్డు రవాణా సంస్థ శుభవార్త చెప్పింది. నైట్ డ్యూటీలు చేసే ప్రైవేట్ ఎంప్లాయిస్, ఐటీ కంపెనీల్లో నైట్ షిఫ్ట్‌లకు వెళ్లే టెక్కీలు, సివిల్ వర్క్స్ చేసుకునే వేలాది మంది ఇకపై ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుతో కష్టాలు,డబ్బులు ఖర్చు చేసుకునే బాధను తగ్గించింది. ఇప్పటి వరకు పగటి పూట మాత్రమే ఆర్టీసీ బస్సులు నడిచేవి.. కాని ఇప్పుడు రాత్రి వేళల్లో కూడా ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. నైట్ 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు నగరంలోని ప్రధానంగా 6 రూట్లలో ఈ సౌకర్యాన్ని కొనసాగిస్తోంది.

## రష్యా గగనతలంలో ప్రయాణించొద్దు

రష్యా గగనతలం పౌర విమానయానానికి సురక్షితం కాదని పేర్కొన్నారు. ఎవరూ ఆ ప్రాంతంలో ప్రయాణించొద్దని సూచించారు. మాస్కోలోని విమానాశ్రయాలను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్నారు. పౌర విమానాలు తమ టార్గెట్ కాదని.. అందుకే ఈ బహిరంగ ప్రకటన చేశామన్నారు. విదేశీ ప్రభుత్వాలు, విమానయాన సంస్థలు ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలని జెలెన్‌స్కీ కోరారు. దాడుల నేపథ్యంలో రష్యా తమ గగనతలాన్ని మూసివేసే అవకాశం ఉందన్నారు. వారు ప్రారంభించిన యుద్ధం వల్లే ఆ దేశానికి ఈ పరిస్థితి ఎదురయ్యిందని పేర్కొన్నారు.

**ఉగ్రవాదులతో చర్చలు జరపబోం..**

జెలెన్‌స్కీ ప్రకటనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడ్డారు. వారు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చలు పునఃప్రారంభించాలని తమపై ఎంత ఒత్తిడి చేసినా.. ఉగ్రవాదులతో చర్చలు జరపడానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. కాగా మంగళవారం రాత్రి కీవ్‌పై రష్యా చేసిన దాడుల్లో 12మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు.



# కథ మళ్లీ మొదటికీ..

యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకూ దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇక తమ భూభాగం వైపు వస్తున్న 13 బాలిస్టిక్ మిసైల్స్‌ను మార్గమధ్యంలోనే ధ్వంసం చేశామని జోర్డాన్ మిలిటరీ పేర్కొంది. మరో మూడు మిసైల్స్ నిర్మానుష్య ప్రాంతంలో కూలిపోయాయని తెలిపింది. ఇరాన్ దాడుల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పింది. బుధవారం ఉదయం ఇరాన్ ప్రయోగించిన పలు మిసైల్స్‌ను అడ్డుకున్నామని మరో ప్రకటనలో కువైట్ తెలిపింది. బహ్రెయిన్‌లో కూడా పేలుళ్లు సంభవించినట్టు తెలిసింది. అమెరికా దాడుల్లో చిన్నారి మరణించినట్టు ఇరాన్ మీడియాలో వార్తలు రావడంపై యూఎస్ సెంట్‌కామ్ ప్రతినిధి స్పందించారు. ఇరాన్ దళాల లాగా తాము సామాన్య పౌరులను ఏనాడు టా÷-గ్గ్ం÷ట్ చేయలేదని స్పష్టం చేశారు. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ కౌంటీలో ఉన్న కుహెస్తక్ నగరంలో ఘోరం జరిగింది. ఒక నివాస గృహంలో జరుగుతున్న పెళ్లి వేడుకపై అమెరికా సేనలు క్షిపణితో దాడి చేశాయి. ఈ భయంకరమైన దాడిలో ఒక చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని ఇరాన్ రెడ్ క్రెసెంట్ ప్రకటించింది. ఈ దారుణ ఘటనపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇదొక అత్యంత క్రూరమైన నేరమని అభివర్ణించింది. అమెరికా చేసిన ఈ దారుణ కాండకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అమాయకులైన పౌరులపై జరుగుతున్న ఈ దాడులను చూస్తూ అంతర్జాతీయ సమాజం మౌనం వహించడం అత్యంత ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మౌనంగా ఉన్న దేశాలు రేపు తమ వంతు వచ్చినప్పుడు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని బఘాయి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ళ్లి జరుగుతున్న ఇల్లు అమెరికా క్షిపణి శకలాలు తగలడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. ఇల్లంతా శిథిలాల మయంగా మారిన ఆ వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. అయితే సిరిక్ కౌంటీలో ఏ లక్ష్యాన్ని ఛేదించేందుకు అమెరికా ఈ దాడి చేసిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. పెళ్లి వేడుకపై జరిగిన ఈ దాడికి సంబంధించి అమెరికా ప్రభుత్వం గానీ, సైన్యం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అమాయకుల ప్రాణాలు తీసిన అమెరికాపై ఇరాన్ ఇప్పటికే ప్రతీకార దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్, ఇరాక్ దేశాల్లో ఉన్న అమెరికా అనుబంధ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ బలగాలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. హోర్ముజ్ జలసంధి సమీపంలో, దక్షిణ ఇరాన్ పరిసరాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లు హోర్ముజ్ జలసంధి సమీపంలో, దక్షిణ ఇరాన్ పరిసరాల్లో భారీ పేలుళ్లు సంభవించినట్లుస్థానిక మీడియా వెల్లడించింది. కొన్ని నెలలుగా అమెరికా, ఇరాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులు పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. అమెరికా దాడులకు ఎట్టి పరిస్థితుల్లోనూ దీటుగా బదులిస్తామని ఇరాన్ పదేపదే హెచ్చరిస్తోంది. మరోవైపు ఇరాన్ గనక మరిన్ని దాడులకు పాల్పడితే తీవ్రమైన సైనిక చర్యలు తప్పవని వాషింగ్టన్ కౌంటర్ వార్నింగ్ ఇస్తోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో పెను యుద్ధానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో బీఆర్ఎస్ పోరుబాట

ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. దిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. ఎంగిలి విస్తరాకుల దగ్గర కుక్కలు కొట్టుకున్నట్లు.. రాష్ట్ర సంపాదన కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారు. ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారు. ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్వచించరు. జల ద్రోహం చేస్తున్న జలగల పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు చంచాగిరి చేస్తూ గురువుగారికి దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెప్పారు. వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారన్నారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్కు డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్ఏ నోరు తెరువదు. జీఆర్ఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోచేయి నీళ్లు తాగే అధికారి ఆదిత్య నాద్ దాస్ ను సలహాదా రుగా పెడితే తెలంగాణకు నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారు. రూ.50 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని రూ.20 కోట్లతో ముగించారని మండిపడ్డారు. నీళ్లు అడిగితే కోసి రక్తం చల్లమన్నారు. యూరియా అడిగిన రైతులపై లాఠీ చార్జి చేశారు. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష, మోటర్లుకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు బందు అయింది. రాహుల్ బంధ్ చాలయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నర కోట్ల అప్పు చేశారు. రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడున్నది అచ్చ కాంగ్రెస్ కాదు, పచ్చ కాంగ్రెస్ కాదు, లుచ్చ కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో అసలైన కాంగ్రెస్ లేదని తెలంగాణ సమాజాం అనుకుంటుందన్నారు. మొదటి నుంచి వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి అందలం ఎక్కించార న్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని విస్మరించారన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ శతాబ్దం అతి పెద్ద మోసం కాగ్రెంస్ మోనిఫెస్టో అని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం
కలెక్టరేట్: మహబూబ్‌నగర్
ఫారం - VII,
ప్రకటన
(2013 యొక్క చట్టం-30 యొక్క 19(1) సెక్షన్ మరియు నిబంధన-25 యొక్క ఉప నిబంధన(1) చూడండి)

No. Rev/0001/2026-G-Section తేది: 28.07.2026

తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ వారి మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డకల్ మండలం, షాకాపూర్ గ్రామంలోని ఎక.2.31½ గుంటలు మొత్తం విస్తీర్ణం, ప్రజా ప్రయోజనం నిమిత్తం మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం క్రింద ఘనపూర్ బ్రాంచ్ కెనాల్‌లోని మేజర్ యొక్క 13వ డిస్ట్రిబ్యూటరీ త్రవ్వకానికి ఆ భూమి అవసరమైందని భావించారు.

కాబట్టి మహబూబ్‌నగర్ జిల్లా యొక్క మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డకల్ మండలం, షాకాపూర్ గ్రామంలోని పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద ప్రామాణిక కొలత యొక్క ఎక.2.31½ గుంటలు ఎక్కువ లేదా తక్కువగా భూమి కొలతకు ప్రకటన చేయబడింది. దాని సవివర వివరణ ఈ క్రింది విధంగా:

గ్రామం : షాకాపూర్ మండలం : అడ్డకల్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర. సం. | సర్వే నెం. | మెట్ట/ ఐ.డి/ తరి | భూమి రకం | సేకరణక్రింద ప్రతిపాదిత ఏరియా (ఎ.లలో) ఎక.గుం. | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | కట్టడాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 72 | మెట్ట | పట్టా | 0.04 | మద్ద శాంతమ్మ భర్త బాలయ్య | 71 | 74 | VB | 73 | - | - |
| 2 | 72 | మెట్ట | పట్టా | 0.03 | చిన్న బాలయ్య తండ్రి వీరయ్య | 71 | 74 | VB | 73 | - | - |
| 3 | 72 | మెట్ట | పట్టా | 0.02 | నన్నే సాహెబ్ తండ్రి సంగీసాబ్ | 71 | 74 | VB | 73 | - | - |
| 4 | 72 | మెట్ట | పట్టా | 0.02 | కటల్ అహ్మద్ తండ్రి మహబూబ్ అలీ | 71 | 74 | VB | 73 | - | - |
| 5 | 72 | మెట్ట | పట్టా | 0.02 | సంగీసాబ్ తండ్రి సంగీసాబ్ | 71 | 74 | VB | 73 | - | - |
| 6 | 72 | మెట్ట | పట్టా | 0.02 | దాదా సాబ్ తండ్రి కటల్ అహ్మద్ | 71 | 74 | VB | 73 | - | - |
| 7 | 72 | మెట్ట | పట్టా | 0.03 | దండోటికర్ శ్రీనివాస్ తండ్రి బజరంగ్ | 71 | 74 | VB | 73 | - | - |
| 8 | 73 | మెట్ట | పట్టా | 0.05 | కుమ్మరి బుచ్చన్న తండ్రి గాలన్న | 71 | 74 | 73 | 76 | - | - |
| 9 | 73 | మెట్ట | పట్టా | 0.04 | బోయకావలి లక్ష్మమ్మ భర్త రాజన్న | 71 | 74 | 73 | 76 | - | - |
| 10 | 73 | మెట్ట | పట్టా | 0.04 | బోయరాజన్న తండ్రి పెద్ద కోమురయ్య | 71 | 74 | 73 | 76 | - | - |
| 11 | 74 | మెట్ట | పట్టా | 0.05 ½ | వేదంశ ఆగ్రో ప్రాడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరె కె.ఎస్.ఎస్. అన్నపూర్ణేశ్వరి భర్త: కె.శ్రవంత్ | 75 | VB | VB | 113 | - | - |
| 12 | 75 | మెట్ట | పట్టా | 0.03 | హరిజన్ చిన్న నాగన్న తండ్రి బాలయ్య | 70 | 74 | 73 | 76 | - | - |
| 13 | 73 | మెట్ట | పట్టా | 0.03 | గోదా కవిత భర్త వెంకటరాములు | 70 | 74 | 73 | 76 | - | - |
| 13 | 75 | మెట్ట | పట్టా | 0.03 | వట్టం చిన్నయ్య తండ్రి బాలయ్య | 70 | 74 | 73 | 76 | - | - |
| 14 | 75 | మెట్ట | పట్టా | 0.03 | నేలకొండి సత్యనారాయణ తండ్రి సాయిలు | 70 | 74 | 73 | 76 | - | - |
| 15 | 75 | మెట్ట | పట్టా | 0.03 | నేలకొండి సాయి కుమార్ తండ్రి రామ క్రిష్ణ రక్షకుడు: అలివేలమ్మ | 70 | 74 | 73 | 76 | - | - |
| 16 | 75 | మెట్ట | పట్టా | 0.03 | కావలి శివ కుమార్ తండ్రి కె.వెంకటయ్య | 70 | 74 | 73 | 76 | - | - |
| 17 | 75 | మెట్ట | పట్టా | 0.03 | కావలి నాగరాజు తండ్రి కె.వెంకటయ్య | 70 | 74 | 73 | 76 | - | - |
| 18 | 76 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద కొండయ్య తండ్రి కనకయ్య | 70 | 74 | 73 | 77 | - | - |
| 19 | 76 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద నారాయణ తండ్రి కనకయ్య | 70 | 74 | 75 | 77 | - | - |
| 20 | 76 | మెట్ట | పట్టా | 0.03 | మద్ద రాములు తండ్రి కనకయ్య | 70 | 74 | 75 | 77 | - | - |
| 21 | 76 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద భాస్కర్ తండ్రి వెంకటయ్య | 70 | 74 | 75 | 77 | - | - |
| 22 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద శ్రీనివాసులు తండ్రి నాగయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 23 | 113 | మెట్ట | పట్టా | 0.0 ½ | మద్ద కురుమూర్తి తండ్రి ఆంజనేయులు | 77 | VB | 74 | 114 | - | - |
| 24 | 113 | మెట్ట | పట్టా | 0.0 ½ | కుపేందర్ తండ్రి వెంకయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 25 | 113 | మెట్ట | పట్టా | 0.0 ½ | మద్ద తిరుపతయ్య తండ్రి ఆంజనేయులు | 77 | VB | 74 | 114 | - | - |
| 26 | 113 | మెట్ట | పట్టా | 0.0 ½ | మద్ద రాజు తండ్రి బాలేష్ | 77 | VB | 74 | 114 | - | - |
| 27 | 113 | మెట్ట | పట్టా | 0.0 | ఎం.ఆంజనేయులు తండ్రి బాలయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 28 | 113 | మెట్ట | పట్టా | 0.0 ½ | మద్ద అనూష భర్త మల్లయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 29 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద మల్లయ్య తండ్రి కనకయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 30 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద పల్లేష్ తండ్రి కనకయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 31 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద పుష్ప భర్త కురుమూర్తి | 77 | VB | 74 | 114 | - | - |
| 32 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద పాపన్న తండ్రి సాయన్న | 77 | VB | 74 | 114 | - | - |
| 33 | 113 | మెట్ట | పట్టా | 0.01 | గొల్ల మద్ద పార్వతమ్మ భర్త కనకయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 34 | 113 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద రామచంద్రయ్య తండ్రి సాయన్న | 77 | VB | 74 | 114 | - | - |
| 35 | 113 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద మహేష్ తండ్రి రాములు | 77 | VB | 74 | 114 | - | - |
| 36 | 113 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద శివ కుమార్ తండ్రి మద్ద రాములు | 77 | VB | 74 | 114 | - | - |
| 37 | 113 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద చెన్నయ్య తండ్రి సాయన్న | 77 | VB | 74 | 114 | - | - |
| 38 | 113 | మెట్ట | పట్టా | 0.02 | మద్ద మల్లయ్య తండ్రి రామచంద్రయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 39 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద ఆంజనేయులు తండ్రి నాగయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 40 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద పార్వతి రాజ్ తండ్రి నాగయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 41 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద మల్లయ్య తండ్రి నాగయ్య | 77 | VB | 74 | 114 | - | - |
| 42 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద శ్రీనివాసులు తండ్రి కనకన్న | 77 | VB | 74 | 114 | - | - |
| 43 | 113 | మెట్ట | పట్టా | 0.01 | బి.రామేశ్వరి భర్త: జె.సురేష్ | 77 | VB | 74 | 114 | - | - |
| 44 | 113 | మెట్ట | పట్టా | 0.01 | తిరుపతమ్మ భర్త శేఖర్ | 77 | VB | 74 | 114 | - | - |
| 45 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద బాల్‌రాజ్ తండ్రి సీతారాములు | 77 | VB | 74 | 114 | - | - |
| 46 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద రమేష్ తండ్రి సీతారాములు | 77 | VB | 74 | 114 | - | - |
| 47 | 113 | మెట్ట | పట్టా | 0.01 | మద్ద రవి తండ్రి సీతారాములు | 77 | VB | 74 | 114 | - | - |
| 48 | 114 | మెట్ట | పట్టా | 0.04 | గొడ్ద దామోదర్ గౌడ్ తండ్రి పెద్ద రాజన్న | 112 | VB | 113 | 115 | - | - |
| 49 | 114 | మెట్ట | పట్టా | 0.03 | గొడ్ద శ్రీనివాసులు తండ్రి కిష్టయ్య | 112 | VB | 113 | 115 | - | - |
| 50 | 114 | మెట్ట | పట్టా | 0.04 | గొడ్ద లక్ష్మన్న భర్త వెంకయ్య | 112 | VB | 113 | 115 | - | - |
| 51 | 114 | మెట్ట | పట్టా | 0.03 | గొడ్ద రాజు గౌడ్ తండ్రి దదన్న | 112 | VB | 113 | 115 | - | - |
| 52 | 114 | మెట్ట | పట్టా | 0.03 | గొడ్ద శ్రీనివాసులు తండ్రి దదన్న | 112 | VB | 113 | 115 | - | - |
| | మొత్తం : | | | 2.31½ | | | | | | | |

2013 నాటి చట్టం నం. 30లోని సెక్షన్ 15 ప్రకారం, సంబంధిత వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ జరిపిన తర్వాత ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలకూ పునరావాసం కల్పించాల్సిన అవసరం లేదు.

భూసేకరణ చేపట్టబడిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనియెడల స్వీకరించబడవు.

ఈ భూమికి సంబంధించిన ప్లాను మహబూబ్‌నగర్‌లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, యూనిట్-II, సీటీపురదల ప్రాజెక్ట్ కార్యాలయంలో ఏ పని దినంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R యూనిట్-II ఇరిగేషన్ ప్రాజెక్ట్స్,మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్
సం/-. కుమ్ముగుప్తా IAS జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్


DIPR RO.NO:798/LA/PP/Advt/Pub/2026-27

సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్: సైబర్‌సిటీ సర్కిల్
టెండర్ నోటీస్ నం.04/2026-27 ఆఫ్ డీఈఈ /ఓపీ/హబ్సీగూడ
హబ్సీగూడ సర్కిల్ హబ్సీగూడ డివిజన్‌లోని హబ్సీగూడ & ఉప్పల్ సబ్‌డివిజన్‌లలో అభివృద్ధి పనుల కింద 1.ఎస్‌పీ నం. 14/26-27(ఎస్‌సీ) ప్లింత్ మల్లాపూర్ సెక్షన్ 2.ఎస్‌పీ నం.15/26-27(జనరల్) నాచారం సెక్షన్‌ను మెరుగుపరుచుట. 3.ఎస్‌పీ నం. 16/26-27(ఎస్‌టీ) హబ్సీగూడ్ సెక్షన్‌లో దెబ్బతిన్న పోల్స్. 4.ఎస్‌పీ నం.17/26-27(జనరల్) ఏబీ కేబుల్ బోడుప్పల్ సెక్షన్. 5.ఎస్‌పీ నం.18/26-27(జనరల్) మాల్లాపూర్ సెక్షన్‌లో దెబ్బతిన్న పోల్స్‌ను తదితర పనులకు దిగువ సంతకం దారు గుర్తింపు పొందిన కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది.టెండర్లు జారీ చేయుటకు చివరి తేది: 15.09.2026 సా॥ 5 గం॥ల వరకు. మిగతా వివరాలు డివిజనల్ ఇంజినీర్ కార్యాలయము /ఓపీ/హబ్సీగూడ నుండి పొందగలరు. సంప్రదించండి: శ్రీ డీఈఈ/ ఓపీ/హబ్సీగూడ : 8712471566. ఈ మేయిల్: www.dehabsiguda131@gmail.com
DIPR No.9108-PP/CL/ADVT/2026-27
సం/- డీఈఈ/ఓపీ/హబ్సీగూడ

## ‘శ్రీమద్రామాయణం’కు 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం

- నేడు పురస్కారాన్ని స్వీకరించనున్న కవి, గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరణ్ కొమాండూర్








హైదరాబాద్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ సంయుక్త కార్యదర్శి, సీనియర్ గ్రూప్-1 అధికారి శ్రీ శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం ‘శ్రీమద్రామాయణం’ ప్రతిష్ఠాత్మక 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ పురస్కార ప్రదానోత్సవం సెప్టెంబర్ 3, 2026న మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. ఎన్.టి.ఆర్. కళాభవన్‌లో జరగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డా. నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన చేతుల మీదుగా శ్రీ శశికిరణ్ కొమాండూర్ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. రామాయణ ఇతివృత్తాన్ని పద్య మహాకావ్యంగా మలిచిన ‘శ్రీమద్రామాయణం’కు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం తెలుగు సాహిత్య రంగంలో విశేష గుర్తింపుగా నిలిచింది. ప్రభుత్వ పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిస్తూనే సాహిత్య రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్న శ్రీ శశికిరణ్ కొమాండూర్‌కు ఈ పురస్కారం లభించడం పట్ల సాహితీవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# అంగన్వాడీ చరిత్రలో సరికొత్త అధ్యాయం

- 50 ఏళ్లలో తొలిసారి మొదటి తేదీనే సిబ్బంది ఖాతాల్లో జీతాలు
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన అంగన్వాడీ టీచర్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : తెలంగాణ అంగన్వాడి చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. సుమారు 50 సంవత్సరాల అంగన్వాడి వ్యవస్థ చరిత్రలో తొలిసారిగా నెల మొదటి తేదీనే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు అందాయి. సెప్టెంబర్ నెల మొదటి తేదీన సిబ్బంది ఖాతాల్లో వేతనాలు జమ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం నెలలు గడిచినా జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రతి నెల మొదటి తేదీనే జీతాలు అందుతుండటం తమ జీవితాల్లో గొప్ప మార్పు తీసుకొచ్చిందని అంగన్వాడీ టీచర్లు పేర్కొన్నారు. కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఇంటి ఖర్చుల కోసం జీతాలపై ఆధారపడే తమలాంటి ఉద్యోగులకు నిర్ణీత తేదీన వేతనం అందడం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అంగన్వాడీ సిబ్బంది కొనియాడారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో అంగన్వాడీ సిబ్బందికి మొదటి తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకున్నారని వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు ప్రజా ప్రభుత్వం పరిష్కారం చూపిందని, అంగన్వాడీ వ్యవస్థపై ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది కేవలం ఉద్యోగులు మాత్రమే కాదని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషకాహారం నుంచి బాలల ఆరోగ్యం వరకు గ్రామీణ సమాజానికి కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. అలాంటి సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి జీతాల విషయంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. “మొదటి తేదీ జీతం.. అంగన్వాడీ సిబ్బంది ఆత్మగౌరవానికి ప్రభుత్వం ఇచ్చిన భరోసా” అని అంగన్వాడీ టీచర్లు అభివర్ణించారు. తమ కష్టాలను గుర్తించి, నిర్ణీత సమయంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కతో పాటు ప్రజా ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బంది హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ
# వార్తలు పూర్తిగా అవాస్తవం

- భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటీకరించేందుకు ప్రస్తుతం సంస్థ వద్ద ఎటువంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా, మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ గనులు, 17 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రతకు, పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతున్నట్లు వెల్లడించింది. సింగరేణిలోని భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో ఉపాధి కల్పన, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గిస్తూ వాటిని కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. భూగర్భ గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న శాంతిఖని భూగర్భ గనిలో ఉత్పత్తి కార్యకలాపాలను ఎండీఓ (మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్) విధానంలో నిర్వహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించగలమా, నష్టాలను నివారించగలమా అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ఒక ప్రతిపాదనను రూపొందించినట్లు యాజమాన్యం వివరించింది.

ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2వ తేదీన ఈఓఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) ప్రకటన జారీ చేసి, ఆసక్తిగల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడం జరిగింది. తొలుత జనవరి 15వ తేదీ వరకు గడువు ఇవ్వగా ఏ సంస్థ కూడా ఆసక్తి వ్యక్తం చేయలేదు. అనంతరం గడువును జనవరి 22వ తేదీ వరకు పొడిగించగా ఒక సంస్థ మాత్రమే ముందుకొచ్చింది. అయితే తదుపరి దశలో ఆ సంస్థ కూడా ఈ ప్రక్రియలో కొనసాగేందుకు సంసిద్ధత వ్యక్తం చేయలేదు. ఈ ప్రతిపాదనకు తగిన స్పందన లభించకపోవడంతో దానిని విరమించుకున్నట్లు సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.

శాంతిఖని గనికి సంబంధించి జారీ చేసిన ఈఓఐని ఆధారంగా చేసుకుని సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటుపరం చేస్తోందని ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని యాజమాన్యం పేర్కొంది. శాంతిఖని గనికి సంబంధించిన ఈఓఐ ప్రక్రియను కూడా ఇప్పటికే విరమించుకున్నామని తెలిపింది. భూగర్భ గనులను మరింత సమర్థ వంతంగా నిర్వహించడం, నష్టాలను తగ్గించడం, సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉపాధి కల్పించడమే సింగరేణి యాజమాన్యం ప్రధాన లక్ష్యమని బపేర్కొంది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇటువంటి వార్తలను ప్రచురించడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

## ఉక్రెయిన్‌పై దాడిలో జగిత్యాల వాసి మృతి

జగిత్యాల, సెప్టెంబర్2 (జనంసాక్షి) : ఉక్రెయిన్‌పై రష్యా చేసిన భారీ దాడిలో జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్‌గౌడ్(42) మృతి చెందాడు. మంగళవారం ఉదయం తాను నివాసం ఉంటున్న గది నుంచి బయటకు వచ్చిన సమయంలోనే ఈ దాడి జరగడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు విడి చాడు. స్వగ్రామంలో సెంట్రింగ్ పని చేసిన సుదర్శన్ గౌడ్ నాలుగు నెలల క్రితమే ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్ వెళ్లాడు. మంగళవారం తెల్లవారు జామున కీవ్ సహా పలు ప్రాంతాలపై క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకు పడింది. ఈ దాడుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.. కాగా సుదర్శన్‌గౌడ్‌తో పాటు ఉక్రెయిన్‌లో ఉంటున్న తాటిపెల్లి గ్రామానికి చెందిన వేణు ద్వారా ఈ ఘటన గురించి మృతుడి కుటుంబసభ్యులకు తెలిసింది.

## బిఆర్ఎస్ నిరసనలో మల్లారెడ్డి స్టెప్పులు



హైదరాబాద్, సెప్టెంబర్2 (జనంసాక్షి) : మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడుంటే అక్కడ హంగామా ఉంటుంది. కార్యక్రమం ఏదైనా తనదైన ఆట పాటలతో అందరిని హుషారెత్తిస్తుంటారు. మరోసారి తనదైన స్టెప్పులతో అందరిని అలరించారు. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో వెయ్యి రోజులు పూర్తి చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడిక్కడ నిరసనలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొని హంగామా చేశారు. యువకులతో కలిసి కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ యువత సమానంగా డ్యాన్సులు వేసి కార్యకర్తల్లో సరికొత్త జోష్ నింపారు. మళ్లీ బీఆర్ఎస్‌ని గెలువాల్సిన అవసరాన్ని ఊర మాస్ స్టెప్పులతో ప్రజలకు అర్థం చేయించారు.

## అబద్ధాల పునాదులపై అధికారంలోకి కాంగ్రెస్

- ఎంపీ వద్దిరాజు



కొత్తగూడెం (జనంసాక్షి) : అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, నోటికొచ్చినట్టు 432 హామీలిచ్చి కనబడ్డ ప్రతి దేవునిపై ఒట్టేసి ప్రజల్ని మోసపుచ్చి ఓట్లు దండుకున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మండిపడ్డారు.ఏ విధంగానైనా అధికారంలోకి రావాలనే కుట్రపూరిత వైఖరితో కాంగ్రెస్ నాయకులు 6 గ్యారంటీ కార్డులు పంచి, 432 హామీలిచ్చి,13 డిక్లరేషన్లతో ప్రజలను దగా చేశారన్నారు.కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ఎండగడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బుధవారం ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యాన భారీ నిరసన ప్రదర్శన జరిగింది. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో అన్ని వైఫల్యాలే తప్ప అభివృద్ధి జరిగిందేమీ లేదని,వచ్చే రెండేళ్లలో ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. .కాంగ్రెస్ 1000 రోజుల పాలనతో విసిగి వేసారిన ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ వైపు చూస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపాన ఎంపీ రవిచంద్ర వేలాది మందితో మానవహారం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను వివరిస్తూ 420 మీటర్ల భారీ బ్యానర్ తో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు గులాబీ కండువా ధరించి,జెండాలు చేతబట్టి ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించను

- కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం కాదు
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున ‘సీఎం.. సీఎం’ అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ‘నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు’ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి ‘రాజన్న రాజ్యం’ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# రేషన్ బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

- మరో 5 రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయం



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది. తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు. మరోవైపు.. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లారు. దీంతో రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకునే అవకాశం చాలామందికి లేకుండా పోయింది. చివరి రోజుల్లో రేషన్ షాపుల వద్ద రద్దీ కూడా పెరగడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ.. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మూడు నెలల బియ్యం కోటాను కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించింది. తాజాగా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో 3 నెలల బియ్యం కోటాను తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు తీసుకోని అర్హులైన కార్డుదారులు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత బియ్యం పంపిణీపై మరింత అవకాశం ఉండకపోవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల ఇంకా కోటా తీసుకోని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా సమీప రేషన్ దుకాణానికి వెళ్లి తమకు కేటాయించిన బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. 3 నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయడం వల్ల ఏర్పడిన రద్దీ, పండుగ కారణంగా లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం గడువు పొడిగించడం రేషన్ కార్డుదారులకు ప్రయోజనకరంగా మారింది. దీంతో రేషన్ బియ్యం తీసుకోలేని వారికి మరో అవకాశం లభించింది.

## మోదీ అనుకుంటే ప్రపంచపటం నుంచి పాక్‌ను తుడిచేయగలరు

- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే




మహారాష్ట్ర, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు గ్రూప్ ఫొటో నుంచి భారత ప్రధాని మోదీ చిత్రాన్ని పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం ఎడిట్ చేసి తొలగించడంపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం చేసిన ఈ చిల్లర చేష్టలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఏక్ నాథ్ షిండే... పాకిస్థాన్ చేసిన పని అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. వారు ఫొటో నుంచి మాత్రమే మోదీ చిత్రాన్ని తొలగించగలరని... కానీ మోదీ అనుకుంటే ప్రపంచపటం నుంచి పాకిస్థాన్‌ను లేకుండా చేయగలరనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. గతంలో పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఘోరానికి ఒడిగట్టినప్పుడు, మోదీ నాయకత్వంలో మన భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను, 11 ఎయిర్‌బేస్ క్యాంపులను ధ్వంసం చేసి వారిని మోకాళ్లపై నిలబెట్టాయని గుర్తుచేశారు. ఇటువంటి చవకబారు ట్రిక్కులతో భారత్‌తో కానీ, ప్రధాని మోదీతో కానీ ఆడుకోవాలని చూడవద్దని పాకిస్థాన్‌కు ఆయన హితవు పలికారు. కేవలం ఫొటో నుంచి మోదీని కట్ చేసినంత మాత్రాన దేశంలోనూ, అంతర్జాతీయ వేదికలపైనా ఆయనకు ఉన్న గుర్తింపు, స్థాయి ఎంతమాత్రం తగ్గబోవని ఏక్ నాథ్ షిండే స్పష్టం చేశారు.

# తెలంగాణ చరిత్రను తుడిచేస్తున్నారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్‌పై బీజేపీ ఫైర్..!
- సెప్టెంబర్ 17ను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



హైదరాబాద్,సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ మూడు పార్టీలు కలిసి హైదరాబాద్, తెలంగాణ అస్తిత్వాన్ని, నిజాం వ్యతిరేక పోరాట చరిత్రను తుడిచివేసే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా పరకాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఉన్నంతకాలం తెలంగాణ ప్రజలకు పోరాట చరిత్రను వివరిస్తూనే ఉంటామని.. తాము అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 గొప్పతనాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని ప్రకటించారు. హనుమకొండ జిల్లా పరకాలలో తెలంగాణ విమోచన దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరకాలలోని అమరధామం వద్ద రామచందర్ రావు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల ప్రారంభంలో పరకాల అమరధామం వద్ద నివాళులర్పించే అవకాశం రావడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. 1947లో ఇదే రోజున ఇదే ప్రాంతంలో దక్షిణాది జలియన్ వాలా బాగ్ గా చెప్పుకునే ఘటన చోటుచేసుకుందని రామచందర్ రావు పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణలోని ప్రతి గ్రామంలో విద్యార్థులు, యువత, ప్రజలు వందేమాతరం గీతాన్ని ఆలపించాలని పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదని రామచందర్ రావు ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీకి భయపడే కారణంగానే ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇది కేవలం ఒక రాజకీయ అంశం కాదని.. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో పాటు, తెలంగాణ పోరాట చరిత్రకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చుతామని స్పష్టం చేశారు.

## రాష్ట్రపతితో నితిన్ నబిన్ భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్ మర్యాద పూర్వకంగా రాష్ట్రపతిని కలిసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను నితిన్ నబిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈరోజు నేను గౌరవనీయ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని మర్యాదపూర్వకంగా కలిశాను. యన సౌమ్య స్వభావం, దేశానికి చేసిన అచంచలమైన సేవ మనకు ఎంతో నేర్పుతాయి. ఆయన మార్గదర్శనం మన దేశం, సమాజం యొక్క ఉన్నతి కోసం అవిశ్రాంతంగా పనిచేయడానికి మనకు నూతన శక్తిని, స్ఫూర్తిని ఇస్తుంది.‘ అని నితిన్ నబిన్ రాసుకొచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
3 సెప్టెంబర్ 2026

సంపాదకీయం

# "మెజారిటీ" మదమెక్కిన ఏనుగుల గుంపు కారాదు

పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో దాదాపు వందేళ్ల పురాతన దేవాలయాన్ని కూల్చివేసిన ఘటన కేవలం ఒక కట్టడం కూలిన వార్త కాదు. అది మెజారిటీ మనస్తత్వం మైనారిటీలపై ఎంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించగలదో చెప్పే హెచ్చరిక. ప్రపంచంలో ఏ దేశంలోనైనా, ఏ మూలనైనా మెజారిటీ వర్గం మైనారిటీలపై దాడులకు దిగినప్పుడు దాన్ని తీవ్రంగా ఖండించాల్సిందే. మతం, భాష, జాతి పరంగా మెజారిటీగా ఉన్నామన్న భావన ఏ దేశాన్నీ మదమెక్కిన ఏనుగుల గుంపుగా మార్చకూడదు. సంఖ్యాబలం అధికారం కాదు, అది బాధ్యత. ఎక్కువ మంది ఉన్నామన్న కారణంతో తక్కువ మంది హక్కులను కాలరాయడం ఏ నాగరిక సమాజానికీ తగదు.

పురాతన దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు వంటి మతపరమైన కట్టడాలు కేవలం ఒక మతస్థుల ఆస్తులు కావు. అవి ఆ ప్రాంతపు చరిత్రకు, సంస్కృతికి, తరతరాల వారసత్వానికి సాక్ష్యాలు. శతాబ్దాల క్రితం నిర్మించిన ఒక ఆలయాన్ని కూల్చడం అంటే ఆ మతానికి చెందిన ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడమే కాదు, యావత్తు మానవాళికి చెందిన పురావస్తు వారసత్వాన్ని నాశనం చేయడం కూడా. అందుకే ఏ మతానికి చెందిన ప్రార్థనా స్థలమైనా, ఏ చారిత్రక చిహ్నమైనా జాతీయ వారసత్వ సంపదగా చూడాలి తప్ప, ఏదో ఒక వర్గపు ఆస్తిగా కాదు. ప్రభుత్వాలు తమ దేశంలోని మైనారిటీలకు చెందిన ఆరాధనా స్థలాలను, సాంస్కృతిక చిహ్నాలను పరిరక్షించే బాధ్యతను విస్మరిస్తే, అది కేవలం పాలనా వైఫల్యం కాదు, నాగరికతకే అపచారం.

ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు సంబంధిత ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పారదర్శకంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన కట్టడాలను కావాలని కూల్చినా, మతోన్మాద గుంపులు విధ్వంసానికి పాల్పడినా, తప్పు ఎవరిదైనా దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయకూడదు. ధ్వంసమైన ఆలయాలను, ప్రార్థనా స్థలాలను పునరుద్ధరించి, మైనారిటీలకు భద్రతా భరోసా కల్పించడం ప్రతి ప్రభుత్వ కనీస ధర్మం. మత స్వేచ్ఛ, ఆరాధనా హక్కు అనేవి ఏ రాజ్యాంగంలోనైనా ప్రాథమిక హక్కులు. వాటిని కాపాడలేని పాలన మెజారిటీవాదానికి తలొగ్గిన పాలనగానే మిగిలిపోతుంది.

చరిత్ర ఎప్పుడూ ఒక్క వర్గానికో, ఒక్క మతానికో సొంతం కాదు. అది ఆ నేలపై జీవించిన ప్రతి తరానికీ చెందిన ఉమ్మడి ఆస్తి. ఈ సత్యాన్ని విస్మరించి, బలం ఉందన్న అహంకారంతో బలహీనుల ఆరాధనా స్థలాలను, గుర్తులను తుడిచిపెట్టాలని చూసే ఏ ప్రయత్నమైనా ఖచ్చితంగా ఖండించదగినదే. మెజారిటీ, మైనారిటీ అనే విభజన రేఖలు చెరిగిపోయి, అందరూ సమాన గౌరవంతో జీవించే సమాజమే నిజమైన నాగరిక సమాజం. ఆ దిశగా ప్రతి దేశం అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అడవుల విధ్వంసం ఎవరి కోసం?
# ప్రజల కోసమా.. కార్పొరేటర్ల కోసమా?



ఒక చెట్టు పడిపోతే, మనకు కనిపించేది ఒక్క చెట్టు మాత్రమే. కానీ, అడవికి అది ఒక చెట్టు మాత్రమే కాదు. అది నీరు. అది నేల. అది పక్షి గూడు. అది గిరిజనుడి ఆహారం. అది ఏనుగు నడిచే దారి. అది మనందరి భవిష్యత్తు. అయితే ఆ అడవి ఎవరిది? దాన్ని ఎవరు అమ్ముతున్నారు? ఎవరికి ఇస్తున్నారు? లాభం ఎవరికీ? నష్టం ఎవరికీ? 'అదానీ గ్రూప్' ప్రాజెక్టుల కోసం అటవీ భూములను ఇతర వినియోగానికి మళ్లించేందుకు ప్రభుత్వం అనుమతించడం ఈ మధ్య మళ్ళీ వార్తల్లోకెక్కింది. మహారాష్ట్ర ప్రభుత్వం రాయ్‌గఢ్‌లో సిమెంట్ టెర్మినల్ కోసం, అమరావతిలో గ్యాస్ నెట్‌వర్క్ కోసం కలిపి దాదాపు 83,700 చదరపు అడుగుల అటవీ, మడ అడవుల భూమిని అదానీకి కేటాయించింది. నాగపూర్ దగ్గర 'అదానీ పవర్' చేపట్టే గోండ్‌ఖైరి బొగ్గు గని కోసం 87 హెక్టార్ల "జుడ్పి" అడవిని ఇతర వినియోగానికి మళ్లించారు. ఛత్తీస్‌గఢ్, రాయ్‌గఢ్‌లలో రెండు బొగ్గు గనుల కోసం దాదాపు 1,000 హెక్టార్ల అడవి కేటాయింపుకి పర్యావరణ శాఖ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. మధ్యప్రదేశ్ సింగ్రౌలిలో ధీరౌలి బొగ్గు గని కోసం 1,397.54 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు (ఎఅజవతీంఅశీఅ)కు కేంద్రం తుది అనుమతి ఇచ్చింది. ఆ అనుమతులను సవాలు చేసిన పిటిషన్‌ను 2026లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. వీటన్నింటికన్నా పెద్ద వివాదం హస్దేవ్ అరణ్యంలో నడుస్తోంది. అంటే, ఛత్తీస్‌గఢ్‌లో 1,742 హెక్టార్ల రక్షిత అడవినీ, 6 లక్షల చెట్లనూ బొగ్గు తవ్వకాల కోసం నరికేసే అవకాశం వున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. గిరిజన గ్రామసభల అనుమతి లేకుండా, సంతకాలు ఫోర్జరీ చేసి ఈ అనుమతులు తీసుకున్నారని కూడా ఆరోపణలు వచ్చాయి. ప్రజల ఉమ్మడి వనరులను ప్రైవేట్ లాభాల కోసం ఎవరి నిర్ణయంతో మళ్లిస్తున్నారు?

ఇది ఒక్క సంఘటన కాదు, చాలా కాలంగా జరుగుతున్న క్రమంలో ఒక భాగం మాత్రమే. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఇచ్చిన లెక్కల ప్రకారం, 1980 అటవీ పరిరక్షణ చట్టం వచ్చాక, 2021 వరకు మొత్తం 9.9 లక్షల హెక్టార్ల అటవీ భూమిని అభివృద్ధి పేరుతో మళ్లించారు. 2014-15 నుంచి 2025-26 వరకు చూస్తే, ఈ పన్నెండేళ్లలోనే 2,15,943 హెక్టార్ల అడవిని ఇతర వినియోగానికి మళ్లించేందుకు అనుమతించారు. ఇందులో దాదాపు 62 శాతం భూమి గనుల తవ్వకం, జల విద్యుత్, నీటిపారుదల ప్రాజెక్టుల కోసం పోయింది. ఈ నాశనం వేగం కూడా ప్రతీ ఏడాది పెరుగుతోంది. 2014-19 మధ్య రోజుకి సగటున 41 హెక్టార్ల అడవి పోతే, 2019-24 మధ్య అది రోజుకి 53 హెక్టార్లకి చేరుకుంది. 2024-25, 2025-26 సంవత్సరాల్లో అది రోజుకి 61 హెక్టార్లకి చేరింది. అభివృద్ధి వేగం పెరిగేకొద్దీ, అడవిని నరికే వేగం కూడా అంతే వేగంగా పెరుగుతోంది. ఇది భవిష్యత్ అడవి నష్టానికి దారి తీసే ప్రక్రియ.

2023లో మోదీ ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టాన్నే సవరించింది. ఈ సవరణ "అడవి" అనే పదానికి వున్న నిర్వచనాన్ని కుదించేసింది. ముఖ్యంగా రికార్డుల్లో అడవులుగా నమోదుకాని అడవుల విషయంలో రక్షణ తగ్గే ప్రమాదంపై పర్యావరణవేత్తలూ, న్యాయ నిపుణులూ తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వాన్ని పాత 'అడవుల' నిర్వచనంపై తన ఆదేశాలు కొనసాగించాలని ఆదేశించింది. ఇకపై సరిహద్దు ప్రాజెక్టులకూ, "వ్యూహాత్మక" ప్రాజెక్టులకూ అటవీ అనుమతులు లేకుండానే భూమిని ఇచ్చే వెసులుబాటు కూడా కల్పించవచ్చు. పరిరక్షణ చట్టాన్నే బలహీనం చేసి, కార్పొరేట్ పెట్టుబడికి అడవుల్ని తెరిచి ఇచ్చే పని బాహాటంగా జరగవచ్చు.

దీని పర్యావరణ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. జీవవైవిధ్యం దెబ్బతింటుంది. హస్దేవ్ లాంటి దట్టమైన అడవులు ఏనుగుల సంచార మార్గాలు, అరుదైన జంతు, వృక్ష జాతులకు నిలయాలు. అవి పోతే, ఆ జాతులు కూడా అంతరించిపోతాయి. గిరిజన జీవనోపాధి కూలిపోతుంది. వేలాది ఏళ్లుగా అడవి మీద ఆధారపడి బతికే గిరిజన సమూహాలు నిర్వాసితులవుతున్నారు. వారి హక్కులు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాతావరణ మార్పు తీవ్రమవుతుంది. అడవులు కార్బన్‌ని పీల్చుకుని వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయి. వాటిని నరికితే, నిల్వ ఉన్న కార్బన్ తిరిగి గాల్లోకి విడుదలవుతుంది, వేడి పెరుగుతుంది. బావిలో నీరు తగ్గుతుంది. వాగు ఎండుతుంది. పంట మారుతుంది. మడ అడవులూ, రిజర్వ్ ఫారెస్టులూ వర్షపాతాన్ని నియంత్రిస్తాయి, వరదలను ఆపుతాయి. వాటిని తీసేస్తే, తీర ప్రాంతాల్లో వరదలూ, కోతలూ పెరుగుతాయి. గనుల తవ్వకం వల్ల నేలా, నీరూ కలుషితమవుతాయి. చుట్టుపక్కల గ్రామాల ఆరోగ్యం మీద కూడా ప్రభావం పడుతుంది.

ఇలాంటి దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా కూడా కనిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం, ప్రస్తుతం భూమి మీద 414 కోట్ల హెక్టార్ల అడవి మాత్రమే మిగిలివుంది. అంటే, భూభాగంలో మూడో వంతు. కానీ, 1990 నుంచి ఇప్పటి వరకు చూస్తే, మొత్తం 48.9 కోట్ల హెక్టార్ల అడవిని కొట్టేశారు. ఇందులో అధికశాతం ఉష్ణమండల ప్రాంతాల్లోనే జరిగింది. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని అడవులే ఎక్కువగా బలైపోయాయి. వేగం సంగతికి వస్తే, 1990ల్లో ఏటా 1.76 కోట్ల హెక్టార్ల అడవి నరికేసేవారు. 2015-25 మధ్య ఈ వేగం ఏటా 1.09 కోట్ల హెక్టార్లకి తగ్గింది. కానీ, కొత్తగా పెరిగే అడవి కూడా అంతకన్నా ఎక్కువ వేగంగా తగ్గుతోంది. దీని వల్ల ఏటా నికరంగా 41.2 లక్షల హెక్టార్ల మేర అడవి విస్తీర్ణం తగ్గుతోంది. దక్షిణ అమెరికాలోనే అత్యధిక నష్టం జరుగుతోంది. బ్రెజిల్‌లో అమెజాన్ అడవులు వ్యవసాయ భూముల విస్తరణకి బలైపోతున్నాయి. ఇండోనేషియా, మలేషియాల్లో పామాయిల్ తోటల విస్తరణ వల్ల నాశనమవుతున్నాయి.


ఒక్క ఆశాజనకమైన విషయం ఏంటంటే, 2025లో ఉష్ణమండల అడవుల నష్టం కిందటి ఏడాదితో పోలిస్తే 36 శాతం తగ్గింది. బ్రెజిల్‌లో లూలా ప్రభుత్వం తీసుకున్న అమెజాన్ రక్షణ, అమలు చర్యలు ఈ తగ్గుదలలో కీలక పాత్ర పోషించాయి. దీని అర్థం ఏంటంటే, రాజకీయ సంకల్పం ఉంటే అడవుల నరికివేతని ఆపగలరని. ప్రజా ఉద్యమాలు ఒత్తిడి తెచ్చినప్పుడు ప్రభుత్వాలు వెనక్కి తగ్గుతాయి అని కూడా ఇది చూపిస్తుంది.

ఇంతకీ, ఈ "అభివృద్ధి" ఎవరి కోసం? భారతదేశంలో ప్రభుత్వమే భూమిని సేకరించి, చట్టాలని సవరించి, కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అప్పగిస్తున్న తీరు చూస్తే, రాజ్యం ఎవరి పక్షాన నిలబడుతుందో స్పష్టంగా కనిపిస్తుంది. అడవి పోతే గిరిజనుడు నష్టపోతాడు, రైతు నష్టపోతాడు, భవిష్యత్ తరాలు నష్టపోతాయి. కానీ, లాభం మాత్రం గనుల యజమానులకే దక్కుతుంది. ప్రపంచవ్యాప్తంగా చూసినా, ఇదే నమూనా పునరావృతమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో లాభం కోసం ప్రకృతి వనరులను నిరంతరం దోచుకోవాల్సిన అవసరం ఉంటుంది. ప్రకృతి ప్రజల జీవనాధారం. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రకృతి కూడా సరుకుగా మారుతుంది. అభివృద్ధి చెందిన దేశాలు, తమ అడవులను ఇప్పటికే నరికేసి పారిశ్రామికంగా ఎదిగాయి. ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలు, అదే బాటలో నడుస్తుంటే, వాతావరణ మార్పుని ఆపమని ఆ దేశాలు ఒత్తిడి తెస్తున్నాయి.

హస్దేవ్ అరణ్యంలో గిరిజనులూ, పర్యావరణ కార్యకర్తలూ చేస్తున్న పోరాటం సరైన దిశలో సాగుతోంది. అడవులను కాపాడుకోవాలంటే కేవలం చట్టాల మీద ఆధారపడితే సరిపోదు. ఎందుకంటే, ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాల కోసం చట్టాలనే మార్చేస్తున్నాయి. ప్రజా చైతన్యం పెరిగినప్పుడే, స్థానిక సమూహాలూ, గిరిజనులూ, రైతులూ కలిసి గొంతెత్తినప్పుడే, ఈ విధ్వంసానికి బ్రేక్ పడుతుంది. అడవిని నరికితే, కేవలం చెట్లు మాత్రమే నాశనం కావు. ఒక సమాజం జీవితం కూలుతుంది. ఒక నది బలహీనపడుతుంది. ఒక గ్రామం తన భూమిని కోల్పోతుంది. లాభం కొద్దిమందికి చేరుతుంది. నష్టం మాత్రం కోట్ల మంది పరమవుతుంది. ఈ లెక్క మారనంత వరకు దాన్ని అభివృద్ధి అనలేం. కొద్దిమంది లాభాల కోసం అడవుల్ని విచక్షణారహితంగా నాశనం చేయడం అభివృద్ధి కాదు, అది విధ్వంసం మాత్రమే.

ఆర్కే వెంకట్
(సోషల్ బ్లాగ్ రైటర్)
(బ్లాగ్ : https://unitedworld2025.blogspot.com/)
8096480227, హైదరాబాద్

# రాజకీయ వత్తిడి మూలంగానే వెనకడుగు!




కాంగ్రెస్ అగ్రనాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకాన్ని పెంగ్విన్ రాండమ్ హౌస్ యొక్క అనుబంధ సంస్థ అయిన అమెరికన్ ప్రచురణ సంస్థ ఆల్ఫ్రెడ్ ఎ. నాఫ్ నవంబర్ 10 నాడు విడుదల చేయనున్నట్లు ప్రకటించిన కొద్ది రోజులకే 'తాము ఆ పుస్తకానికి ప్రచురణకర్త కాదు, ఆ పుస్తకాన్ని ప్రచురించడం లేదు' అని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా (పి.ఆర్.హెచ్.ఐ) ఈ ఆగస్టు 28 నాడు ప్రకటించింది. పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఇలా వివాద వార్తల్లో నిలవడం ఇదే మొదటిసారి కాదు. 2013 నాటి ముజఫర్‌నగర్ అల్లర్ల ఆధారంగా గ్రాఫిక్ నవలా రచయిత జో సాకో రాసిన 'ది దేస్ అండ్ ఫ్యూచర్ రాయట్' పుస్తకాన్ని కూడా పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా వెనక్కి తీసుకుంది. అయితే 'ఆ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడానికి ప్రచురణ సంస్థ సాకులు చెప్పింది' అని రచయిత సాకో వ్యాఖ్యానించడం గమనార్హం. అలాగే మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' అనే ఆత్మకథను తాము ప్రచురించలేదు' అని పి.ఆర్.హెచ్.ఐ పేర్కొన్ననూ ఆ పుస్తకం యొక్క హార్డ్ కాపీని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రదర్శించడం గమనార్హం. ఆ రకంగా ఆ పుస్తకం యొక్క హార్డ్ కాపీలు మరియు రాతప్రతి యొక్క డిజిటల్ కాపీలు బయటకు రావడంతో వివాదం మరింతగా చెలరేగింది.

తాజాగా 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తక మాన్యుస్క్రిప్ట్లో గల ఒక భాగంలో పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా కోరిన కొన్ని మార్పులు మరియు తొలగింపులను రచయిత్రి సోనియా గాంధీ తిరస్కరించడంతో ఈ వివాదం నెలకొంది. అధికారిక సమావేశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సోనియా గాంధీ వ్యక్తీకరించిన అభిప్రాయాలు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మరియు దాని కార్యకలాపాలకు సంబంధించిన విషయాలు మరియు భారత్ - చైనా సంబంధాలు మొదలైన అంశాలు ప్రస్తుత వివాదానికి దారితీశాయి. ప్రచురణకర్తకు, రచయిత్రి సోనియా గాంధీకి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడం మూలంగా అంతిమంగా మార్పులు, తొలగింపులను ఆమె తిరస్కరించడంతో పెంగ్విన్ ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే ఆత్మకథను ప్రచురించడానికి నిరాకరించిన విషయం వెలుగులోకి వచ్చింది. 'తాము సూచించిన మార్పులను రచయిత్రి తిరస్కరించినందువలన మేము ఆ పుస్తకాన్ని ప్రచురించకూడదు అని నిర్ణయించుకున్నట్లుగా వచ్చిన వార్తలు వాస్తవ పరిణామాలకు భిన్నంగా ఉన్నాయి. అయితే ఒక ప్రచురణకర్తగా, వాస్తవాలను సరిచూడటం మరియు రచయితల పుస్తకాల ఉత్తమ ప్రయోజనాలకు అనుగుణంగా సిఫార్సులను అందించడం మా ప్రత్యేక హక్కు మరియు బాధ్యత మాత్రమే కాకుండా ఇది ప్రచురణ ప్రక్రియలో ఒక సాధారణ భాగం. మేము చర్చలు జరిపిన సమయంలో ప్రచురణకు ఆసక్తిగా ఉన్నప్పటికీ కొన్ని కారణాల వల్ల ఆ బాధ్యతలను తీసుకోలేదు' అని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా తనను తాను సమర్థించుకుంది. ఏది ఏమైననూ 'అధికార బి.జె.పి పార్టీ నుండి రాజకీయ వత్తిడి ఉండడం మూలంగానే పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఆ పుస్తకాన్ని ప్రచురించడానికి నిరాకరించింది' అని బాహాటంగానే విమర్శలు వెలువెత్తాయి.

కేవలం రాజకీయ ఒత్తిడి మూలంగా ఇటలీ నుండి భారతదేశానికి శ్రీమతి సోనియా గాంధీ రాజకీయ గమనాన్ని వివరించే 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తక ప్రచురణ నుండి మార్పులు - చేర్పులు అంటూ ఉపసంహరించుకోవడం అనేది ఊహించని మలుపు కావడమే కాకుండా అంతిమంగా భావాస్వేచ్ఛను నిరాకరించడమే అవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావాలను వ్యక్తీకరించడం, పుస్తకాలను రాయడం అనే స్వేచ్ఛ అందరికీ ఉంది. పుస్తకం జనబాహుళ్యంలోకి వచ్చాక అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్ద్వంద్వంగా ప్రశ్నించవచ్చు. కాని పుస్తకం విడుదలకు ముందే రాజకీయ ఒత్తిడికి తలొగ్గి మార్పులు, చేర్పులు కోరడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. అంతిమంగా శ్రీమతి సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకాన్ని విడుదలకు ముందే ఎప్పుడెప్పుడు చదవాలి అనే ఆసక్తిని మరియు ఉత్సుకతను రేకెత్తిస్తూ ఉంది.




జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# పిట్ట కొంచెం - కూత ఘనం



బీహార్ రాజధాని పాట్నా వీధుల్లో ఇటీవల కనిపించిన ఒక దృశ్యం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. సాధారణంగా పాఠశాల బ్యాగ్ వేసుకుని తరగతి గదిలో అక్షరాలు నేర్చుకోవాల్సిన ఆరేళ్ల బాలుడు ఆదిత్య కుమార్ చేతిలో త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ఆందోళనలో కనిపించాడు. మైక్ ముందు నిలబడి నిరుద్యోగం, పరీక్షల అవకతవకలు, విద్యా వ్యవస్థలో లోపాలు, ప్రభుత్వ బాధ్యత వంటి అంశాలపై అతను మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది.

ఆదిత్య పాట్నాలోని పునాయిచక్ ప్రాంతంలో కుటుంబంతో నివసిస్తున్నాడని, మొదటి తరగతి చదువుతున్నాడని పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. అతని కుటుంబం ఆర్థికంగా బలహీనమైనదని, తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని కథనాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా అతని స్కూల్ బ్యాగ్‌లో రాజ్యాంగ పుస్తకం ఉంటుందని, అందులోని సుమారు 80 పేజీలు చదివినట్లు బాలుడు చెప్పిన విషయాన్ని అనేక మీడియా సంస్థలు ప్రస్తావించాయి.



ఇక్కడ అసలు ఆసక్తికరమైన విషయం అతని వయసు కాదు. ఆ వయసులోనే అతను అడుగుతున్న ప్రశ్నలు. బీహార్‌లో ఉపాధ్యాయ నియామకాలు, పోటీ పరీక్షలు, పరీక్షా విధానంలోని మార్పులు, నియామకాల ఆలస్యం వంటి అంశాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు ఆందోళన చేస్తున్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయ నియామక పరీక్ష అయిన బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీఆర్‌ఈ-4 విషయంలో పరీక్షను రెండు దశల్లో నిర్వహించడం, నెగెటివ్ మార్కింగ్ కొనసాగించడం వంటి ప్రతిపాదనలపై అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. అభ్యర్థులు ఒకే దశలో పరీక్ష, నియామక ప్రక్రియలో పారదర్శకత, ఖాళీల పెంపు, పరీక్షా క్యాలెండర్, పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు వంటి పలు డిమాండ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 25న పాట్నాలో జరిగిన నిరసనలో ఆదిత్య కూడా కనిపించాడు. త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని నిరసనకారులతో కలిసి నినాదాలు చేశాడు. మీడియా కెమెరాల ముందు బెరుకు లేకుండా మాట్లాడాడు. ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందని, విద్యా వ్యవస్థలో మార్పులు రావాలని, పరీక్షల నిర్వహణలో లోపాలు తొలగించాలని తనదైన భాషలో చెప్పాడు. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి, విద్యాశాఖ మంత్రి మిథిలేష్ తివారీ రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేసినట్లు పలు కథనాలు వెల్లడించాయి.



అయితే ఈ ఘటనలో అత్యంత సున్నితమైన అంశం పోలీసుల వ్యవహారం. ఆందోళన సమయంలో ఆదిత్యను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కొన్ని కథనాల ప్రకారం అతను తన తల్లిదండ్రులతో కలిసి కొన్ని గంటలు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులపై దుర్వ్యవహారం, బెదిరింపులు, దాడి వంటి ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు స్వతంత్ర ధృవీకరణ లేదని కొన్ని మీడియా కథనాలు స్పష్టంగా పేర్కొన్నాయి. మరోవైపు, పోలీసులు బాలుడి భద్రత దృష్ట్యా అతన్ని అక్కడి నుంచి తీసుకెళ్లామని, అనంతరం తల్లికి అప్పగించామని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అందువల్ల ఈ అంశంపై తుది నిర్ణయానికి రావడం కంటే వాస్తవ నిర్ధారణ కోసం అధికారిక విచారణను ఎదురుచూడటం సముచితం.

ఆదిత్య కథలో మరో ముఖ్యమైన కోణం ఉంది. ఒక ఆరేళ్ల బాలుడు నిరుద్యోగం గురించి ఎందుకు మాట్లాడాల్సి వస్తోంది? ఉద్యోగం కోసం పెద్దవాళ్లు రోడ్లపైకి రావడం సాధారణ రాజకీయ, సామాజిక పరిణామం కావచ్చు. కానీ ఆ సమస్యను ఒక మొదటి తరగతి బాలుడు తన భవిష్యత్తుతో అనుసంధానించుకోవడం మాత్రం సమాజానికి ఒక గంభీరమైన అద్దం పట్టినట్టే. "ఇది నా భవిష్యత్తుకు సంబంధించిన విషయం" అనే భావనతో అతను మాట్లాడినట్లు ఆంగ్ల మీడియా కూడా పేర్కొంది.

అయితే ఇక్కడ మరో జాగ్రత్త అవసరం. ఒక చిన్నారి మాట్లాడిన మాటలను చూసి అతన్ని వెంటనే "భవిష్యత్ నాయకుడు"గా ప్రకటించడం ఎంత తొందరపాటో, అతని మాటలను కేవలం రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం కూడా అంతే ప్రమాదకరం. ఆరేళ్ల బాలుడికి స్వతంత్ర రాజకీయ అవగాహన ఎంతవరకు ఉంది? కుటుంబం, పరిసరాలు, సోషల్ మీడియా, అతను చూసే వార్తలు అతని ఆలోచనలను ఎంతవరకు ప్రభావి తం చేస్తున్నాయి? ఇవన్నీ పరిశీలించాల్సిన ప్రశ్నలు. అదే సమయంలో పిల్లలు సమాజంలోని సమస్యలను అర్థం చేసుకోలేరని తక్కువ అంచనా వేయడం కూడా సరైంది కాదు.

ప్రపంచవ్యాప్తంగా బాలల హక్కులు, విద్య, ఉపాధి, పర్యావరణం వంటి అంశాలపై చిన్నారులే గొంతెత్తిన సందర్భాలు ఉన్నాయి. స్వీడన్‌కు చెందిన గ్రెటా థన్‌బర్గ్ పర్యావరణ సంక్షోభంపై ప్రపంచవ్యాప్తంగా చర్చను రేకెత్తించినప్పుడు ఆమె వయసు కూడా పెద్దది కాదు. అయితే బాలల స్వరం ప్రజాస్వామ్యంలో విలువైనదిగా ఉండాలంటే అది వారిపై రాజకీయ భారాన్ని మోపకుండా, వారి భద్రతను కాపాడుతూ, వారి విద్యను దెబ్బతీయకుండా ఉండాలి. ఆదిత్య వైరల్ కావడం వెనుక సోషల్ మీడియా పాత్ర కూడా విస్మరించలేనిది. సాధారణంగా గంటల తరబడి జరిగే విద్యార్థి ఆందోళనలోని సంక్లిష్టమైన సమస్యలు ప్రజల దృష్టికి రావడానికి రోజులు పట్టవచ్చు. కానీ ఆరేళ్ల బాలుడు మైక్ పట్టుకుని మాట్లాడిన కొన్ని నిమిషాల వీడియో దేశవ్యాప్తంగా చర్చకు రావడం ద్వారా మొత్తం ఉద్యమంపై ప్రజల దృష్టి పడింది. అదే సమయంలో వైరల్ సంస్కృతి ఒక తీవ్రమైన సమస్యను "వైరల్ కంటెంట్"గా మార్చే ప్రమాదం కూడా ఉంది.

అందుకే ఆదిత్యను చూసి ఆశ్చర్యపోవడం కంటే అతను ప్రస్తావించిన సమస్యలను చూసి ఆలోచించడం ముఖ్యం. ఒక ఆరేళ్ల బాలుడి నోట "ఉద్యోగం", "విద్య", "పరీక్షలు", "అవినీతి" వంటి పదాలు వినిపించడం నిజంగా ఒక సామాజిక హెచ్చరిక. పిల్లలు తమ బాల్యాన్ని ఆస్వాదించాల్సిన వయసులో పెద్దల భవిష్యత్తు గురించి ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడితే, ఆ సమాజం తన విద్యా విధానాన్ని, ఉపాధి విధానాన్ని, పాలనా వ్యవస్థను తిరిగి పరిశీలించుకోవాలి.

అందుకే ఆదిత్య కథను ఒక బాలుడి వైరల్ వీడియోగా మాత్రమే చూడకూడదు. అది బీహార్‌లోని ఉద్యోగార్థుల ఆందోళనకు సంబంధించిన కథ మాత్రమే కాదు; భారతదేశంలో విద్య పూర్తిచేసిన తర్వాత ఉపాధి కోసం ఎదురుచూస్తున్న కోట్లాది యువత ఆందోళనకు కూడా ప్రతిధ్వని. ఆరేళ్ల చిన్నారి చేతిలోని త్రివర్ణ పతాకం కంటే అతని నోట వినిపించిన ప్రశ్నలే పెద్దవి. "పిట్ట కొంచెం - కూత ఘనం" అన్న సామెత ఈ సందర్భంలో అచ్చంగా సరిపోతుంది. పిట్ట చిన్నదే. కానీ దాని కూత మాత్రం పెద్ద చర్చకు దారితీసింది. ఆ కూతను కేవలం వినోదంగా వినకుండా, దాని వెనుక ఉన్న సమాజపు సమస్యలను వినగలిగితేనే ఆదిత్య వైరల్ కథకు నిజమైన అర్థం లభిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## ఆ వొచ్చు లోకాన..

గుర్రాలమీద స్వారీ చేసే వాళ్ళతో
గతుకుల కాలిబాటన నడిసేటోళ్ల
వ్యవహారాల్ కుదరనే కుదరవంట
కుదిరినా ఎంతోకాలం నిలవవంట..
దుత్తెడు పాలిచ్చి ఉండొచ్చునుగాక
మేత దండుగ కుంటి గొడ్లన్నీ కోతకే
గిట్టెలు పగిలి నెత్తుర్లు కారుతున్నా
కాకుల్ పైమీది పుండ్లు కెల్కుతున్నా..
కనికరమ్మెట్లుండు ఎంతోటికాపుకైనా
దున్ననీకె వచ్చె వరకే పై మీద చెయ్యి
రాముడు భీముడని మొక్కార్తి తానం
పెంచుకున్న ప్రేమ కుదెమెవరికి పట్టీడ..
మారాలి లోకమంటూ మారుమోగును
నింగి నేల ఒక్కటయ్యే నినాదమ్ములు
ఆ వొచ్చు లోకానన్నా నీతి ఉండునా
యాపారమవ్వని మమతలే పండునా..

-డా. ఇక్బాల్ పాషా
9440775732

## వీళ్ళే మార్చేది !

నేర్వకపోతే
మాటలు రావు!
మార్చకపోతే
సమాజంమారదు!
అమ్మానాన్న
ఇంటి గురువులు!
బడికి వెళ్ళావు!
బడి గురువులు!
నీచుట్టూ జనం
లోక గురువులు!
ఆ పై నీవిచక్షణే
నీకు గురువు!
నీ బుద్ధి వికాసం
నీ హృదయం
నీమస్సాక్షి నీకు
మహాగురువులు!
నీ తెలివితో
మంచి చెడు
'వడ'బోస్తావ్!
'మంచి'స్వీకరిస్తావ్!
ఇంతవరకు
అందరూ ఒక్కటే!
ఇక్కడినుండే సమస్య!
ఏదిమంచి?ఏదిచెడు?
నీమంచి నాకు చెడు!
నామంచి నీకు చెడు!
నీది 'మను' మార్గం!
నాది 'జన' మార్గం!
నేను'జనం'అంటాను!
నువ్వు'మను'వంటావు
కులమతాలంటావు!
అవసరం లేదంటాను!
సూద్రు లెవ్వరికీ
చదువులొద్దంటావు!
అందరికీ చదువు
కావాలంటాను!
జనంలో విజ్ఞానం
ఎంతపెరిగితే
సమాజం అంతగా
వికసిస్తుందని నేను!
విజ్ఞానం పెరిగితే
వెర్రితలలేస్తుంది!
నిర్వహణకుదరదు
అంటావు నువ్వు!
నీ సిద్ధాంతం -
జనాన్ని కొన్నాళ్లే
అణచి పెట్టగలదు
అంటాను నేను!
శాశ్వతంగా
అణచిపెట్టి
ఉంచుతాను
అంటావు నువ్వు!
జనం తిరుగుబాటు
తప్పదంటాను!
నిన్నదింపటం
ఖాయమంటాను!
ఈ లోగానేమతం
గొడవలుపెట్టి
ముసలంపుట్టిస్తా
అంటావు నువ్వు!
నిన్నకాకమొన్న
బీహార్ ఆదిత్య
ఆరేళ్ళబాలుడికి
భయపడ్డారుమీరు!
ఢిల్లీలో నెలక్రితం
జెన్ జీ ల దెబ్బకు
ముఖంచాటేసి
తిరిగారు మీరు!
అరచేతిని
అడ్డుపెట్టి
సూర్యకాంతిని
ఆపలేరుమీరు!
అదు గదుగో
అరుణోదయం
బాలసూరీడు
జెన్జీజెనాల్వాలు!
'వీళ్ళే మార్చేది'
వీళ్ళ ప్రశ్నలతో
భవిష్యత్తు
బంగారుబాట!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## బోడుప్పల్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేతకు అడ్డగింత

- అధికారుల విధులకు ఆటంకం.. ఇద్దరిపై కేసు నమోదు

**బోడుప్పల్ (జనంసాక్షి) :** ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం తొలగించేందుకు వెల్లిన అధికారులను అడ్డుకుని, దుర్భాషలాడుతూ జేసీబీ డ్రైవర్‌ను బెదిరించిన ఘటనపై మేడిపల్లి పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 31 న మేడిపల్లి తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఎస్.చంద్రకళ తన సిబ్బందితో బోడుప్పల్‌లోని గౌతమ్ నగర్ కాలనీ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తున్నారనే సమాచారం రావడంతో అక్కడికి వెళ్ళి నిర్మాణాన్ని జెసిబీతో కూల్చివేస్తుండగా నర్సింగోజు నరసింహ,విజయ అధికారుల విధులకు ఆటంకం కలిగించి,జేసీబీ డ్రైవర్, సిబ్బందిని బెదిరించినట్లు ఫిర్యాదు అందింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

## చంపకండి కనిపిస్తే మాకు కాల్ చేయండి



**షేక్ పేట (జనంసాక్షి) :** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి మలకం చెరువు ప్రాంతంలో అరుదైన జాతికి చెందిన 5 అడుగుల పొడవైన కొండచిలువను గుర్తు తెలియని వ్యక్తులు చంపి రోడ్డు పక్కన పడేశారు. చిత్రపురి హిల్స్ ప్రాంతంలో గతంలో కొండచిలువలు తిరగడం చూసామని ఇవి మల్కంచరువు ప్రాంతంలో ఆహారం కోసం ఎక్కువగా తిరుగుతుంటాయని స్థానికులు చెప్తున్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా రాళ్లు గుట్టలతో ఉండటం వల్ల వన్యప్రాణులు, నెమళ్లు ,పాములు అధికంగా ఉండేవని కాలక్రమేనా హై రైస్ అపార్ట్మెంట్ ల నిర్మాణాలు, చెట్ల నరికివేత, గుట్టలు రాళ్ళను యంత్రాలతో పగులగొట్టి వేరే ప్రాంతాలకు తొలగిస్తుండటంతో వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి అని బయోడైవర్సిటీ దెబ్బతింటుందని ప్రకృతి ధ్వంసం ఎక్కువగా జరుగుతుండటంతో వాటి సంఖ్య అంతరించిపోతుందని, అరుదైన జాతికి చెందిన కొండచిలువలు బయోడైవ ర్సిటీలో భాగంగా వాటిని కాపాడుకోవాలని కొండచిలువలకి విషపు కోరలు ఉండవని ఇవి ఆహారాన్ని సంపాదించుకునే క్రమంలో జంతువులను మింగి వాటి సహజ పద్ధతిలో అరిగించుకుంటాయని ఇలాంటి అరుదైన జాతి సర్పాలు కనిపిస్తే వాటిని చంపకుండా స్నేక్ క్యాచర్ కు కాల్ చేస్తే వాటిని తీసుకెళ్లి అడవుల్లో వదిలేస్తారని, గ్రేటర్ హైదరాబాద్ లో పాములు ఎక్కడ కనిపించినా టోల్ ఫ్రీ నెంబర్ 837 42 333 66 కి కాల్ చేయాలని స్నేక్ క్యాచర్ శ్రీకాంత్ తెలియజేశారు.

## 2వేల కోట్లతో పాలమూరులో అభివృద్ధి పనులు

- మూడేళ్లలో మహబూబ్‌నగర్‌లోని ప్రతి కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తి
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థతతో పారిశుద్ధ్య సమస్యలకు చెక్
- అందరి సహకారంతో అభివృద్ధి
- ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో (జనంసాక్షి) :** 2వేల కోట్లతో మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని.. ఇప్పుడు విడతల వారిగా పనులు ప్రారంభించుకుంటున్నామని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ కార్పోరేషన్ పరిధిలో 603 కోట్ల నిధులతో ఏర్పాటు చేయనున్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్త పనులకు బుధవారం నాడు భూమి పూజ చేశారు. మొదటి విడతలో 146.29 కోట్లతో 9 డివిజన్‌లలో మంజూరైన పనులను ఆయన ప్రారంభించారు. 6వ డివిజన్ ఏనుగొండలో రూ. 39.4 కోట్లు, 2వ డివిజన్ ఏనుగొండలో రూ24.48 కోట్లతో, 7వ డివిజన్ శ్రీనివాస కాలనీలో రూ 12.13 కోట్లు, 21వ డివిజన్ శ్రీనివాస కాలనీలో 10.32 కోట్లతో, 22వ డివిజన్ పద్మావతి కాలనీలో రూ 9.32 కోట్లతో, 44వ డివిజన్ పద్మావతి కాలనీలో రూ. 6.66 కోట్లతో, 20వ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలో రూ 15.17కోట్లతో, 19వ డివిజన్‌లో రూ. 11.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉండడానికి ఇళ్లు లేకపోయినా కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తూ ముఖ్యమంత్రి అయ్యి పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే జిల్లాకు నిధుల వరద వస్తోందని.. తాము హామిలు ఇచ్చినట్టుగా అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. రూ.200 కోట్లతో మహబూబ్‌నగర్ పట్టణంలో 18 మిలియన్ లీటర్ల సామర్థ్యాన్ని పెంచుతూ 14హెడ్ రిజర్వాయిర్‌లను నిర్మించుకుంటున్నామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామి మేరకు మహబూబ్‌నగర్ నగరం అంతా అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రేంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాల కోసం మాయమాటలు చెప్పడం, తాత్కాలిక మెరుగులు దిద్ది అదే అభివృద్ధి అని చెప్పడం తనకు రాదని, తనను గెలిపించిన పాలమూరు ప్రజల కోసం అహర్నిశలు కష్టపడుతూ మహబూబ్ నగర్ నియోజక వర్గానికి కావాల్సిన అన్ని సౌకర్యాలను అందించాలనే దృఢ సంకల్పంతో పాలమూరు రూపురేఖలను మారుస్తానన్నారు.

## ఉబర్‌లో 3,300 మంది ఉద్యోగుల తొలగింపు

- కంపెనీ పునర్వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో
- 30 వేలకు పడిపోనున్న ఉద్యోగుల సంఖ్య




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం ‘ఉబర్ టెక్నాలజీస్’ తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.

# సీఎం ఇలాఖాలో గిరిజనుల ఇల్లు కూల్చివేత

- గిరిజనులు అడ్డువస్తే ఒక ఇంట్లో బంధించి ఇంటికి తాళం వేసిన అధికారులు
- తండాలో భారీగా మోహరించిన పోలీసులు
- అధికారుల చర్యలతో ఆందోళన చెందుతున్న గిరిజనులు
- ముందస్తు సమాచారం లేకుండ ఇల్లు కూల్చివేత
- మరో గుడిసె కూల్చి వేసే ప్రయత్నంలో వృద్ధురాలికి తప్పిన ముప్పు





**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్2 (జనం సాక్షి):** రెక్కాడితే కానీ డొక్కనిండని అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు తమ ప్రతాపం చూపించారు. దశాబ్దాల నుంచి నివాసం ఉంటున్న గుడిసెలను కూల్చి వేసి నేలమట్టం చేశారు. గుడిసె స్థానంలో పొలం తాకట్టు పెట్టి ఇంటిని నిర్మాణం చేసుకుంటున్న దానిని ఫారెస్ట్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడంతో అమాయక గిరిజనులు వీధిన పడ్డారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బొమ్రా స్ పేట్ మండలంలోని ఊరేంటి తాండలో జరిగింది. గిరిజన బాధితులు సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎనిమి తాండ గ్రామపంచాయతీ అనుబంధ తాండ అయిన ఊరంటి తాండ కు చెందిన రవి నాయక్ రాములు నాయక్ ఇంటిని ఫారెస్ట్ అధికారులు జెసిపి తో కూల్చి నేలమట్టం చేశారు. వీరు ఇద్దరు అన్నదమ్ములు ఎకరం పొలం తాకట్టు పెట్టి దశాబ్దాల క్రితం వేసుకున్న గుడిసె స్థానంలో నూతన ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 200 గజాల స్థలంలో 16 పిల్లలు వేసి ఇల్లు నిర్మాణం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు స్థానిక సివిల్ పోలీసుల సహకారంతో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రిపూట రవి నాయక్ రాములు నాయక్ ఇంటిని నేలమట్టం చేశారు. దాని పక్కనే మరో గుడిసెను నేలమట్టం చేసే ప్రయత్నం చేస్తే గుడిసెలో నుంచి వయోవృద్ధురాలు కేకలు వేయడంతో ప్రమాదం తప్పింది. కొన్ని శతాబ్దాలుగా ఈ తాండాకు చెందిన గిరిజనులు ఇక్కడ నివాసము ఏర్పరచుకొని జీవనోపాధి గడుపుతున్నారు. ఆర్థిక పరిస్థితి దృశ్య కొందరు ఇప్పటికీ గుడిసెల్లో నివాసం ఉంటే మరికొందరు గుడిసె స్థానంలో పక్క ఇండ్లను నిర్మించుకున్నారు. అదే క్రమంలో రవి నాయక్ రాముల నాయక్ ఇంటినిర్మానం చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కొత్త ఇంటిని నేలమట్టం చేశారు. ఇంటిని నేలమట్టం చేస్తున్న అధికారులను అడ్డుకోవడానికి గిరిజన తాండవాసులు విశ్వ ప్రయత్నం చేశారు. అప్పటికే తాండలో ఫారెస్ట్ అధికారులు భారీగా పోలీసులను మోహరించారు. వారిని అడ్డు తొలగించుకొని కూల్చివేతను ఆపడానికి ప్రయత్నించిన గిరిజనులను వారి ఇండ్లలో బంధించి తాళాలు వేశారు. తండాలో భారీగా పోలీసులను మోహరించిన కారణంగా గిరిజనులు కూల్చివేతను అడ్డుకోలేక పోయారు. ఇంటిని నేలమట్టం చేసిన అనంతరం తండా నుంచి పోలీసులను తరలించారు. దీంతో గ్రామంలో రాత్రిపూట ఉద్రిక్త వాతవరణం నెలకొంది. ఫారెస్ట్ అధికారుల చర్యల వల్ల గిరిజనులు భయాందోళనకు గురి అయ్యారు. ఫారెస్ట్ అధికారులు ఎప్పుడు ఏం చేస్తారో నని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఊరేంటి తాండ కు చెందిన హరి చందర్ కు నలుగురు కొడుకులు వారు దశాబ్దాల క్రితం నుంచి తాత ముత్తాతలు వేసుకున్న గుడిసెల స్థానంలో పక్క ఇంటి నిర్మాణం చేపట్టారు. ఫారెస్ట్ అధికారుల చర్యల వల్ల బాధిత రవి రాములు నాయక్ లకు 20 లక్షల నష్టం జరిగింది. రెక్కాడితే డొక్కా నిండా ని వీరు ఉన్న ఎకరం పొలం షావుకారుల దగ్గర తాకట్టు పెట్టి ఇంటి నిర్మాణం కోసం డబ్బులు పోగు చేసుకున్నారు. ఇప్పుడు ఆ ఇంటి నిర్మాణాన్ని ఫారెస్ట్ అధికారులు నేలమట్టం చేయడంతో వారంతా వీధిన పడ్డారు.

### కొడంగల్ సీఎం రాకను అడ్డుకుంటాం : సిపిఎం

ఈనెల నాలుగో తేదీన సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటనను అడ్డుకుంటామని వికారాబాద్ జిల్లా సిపిఎం కార్యదర్శి మైపాల్ మల్కయ్య బుస చంద్రయ్యలు తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గిరిజనుల ఇంటిని కూల్చివేశారని ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. గిరిజనుల ఇంటిని కూల్చివేసినందుకు నిరసనగా ఈ నెల 4న కొడంగల్ సీఎం రాకను అడ్డుకుంటామని గిరిజనులపై జరిగిన దాడిని సీఎం దృష్టికి తీసుకు వెళ్తామని హెచ్చరించారు. ఎకరం పొలం తాకట్టుపెట్టి ఇంటిని నిర్మించుకుంటున్న ఇల్లును ఫారెస్ట్ అధికారులు కూల్చివేస్తారని వారికి నష్టపరిహారం కింద 50 లక్షలు రూపాయలు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజనులకు తాము అండగా ఉంటామని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఫారెస్ట్ అధికారులు కూల్చిన ఇంటిని పరిశీలించి గిరిజనులను సిపిఎం నాయకులు పరామర్శించారు. ఈ సంఘటనపై వారు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సత్యనారాయణ సుశీల బాయ్ రేవంత్ రోహిత్ మన్యా నాయక్ శంకర్ భీమ్లా నాయక్ రమేష్ నాయక్ నిత్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు!?

- డాక్యుమెంట్ రైటర్ల ద్వారా రిజిస్ట్రేషన్‌కు రూ.2వేల నుంచి రూ.5 వేలు అదనం
- రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వసూళ్లు
- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఆరోపణ






**ఉప్పల్, సెప్టెంబర్ 1 (జనం సాక్షి) :** ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల పేరుతో అదనపు వసూళ్లు జరుగుతున్నాయంటూ తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లంచాల రూపంలో వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు.

సొంతింటి కల కోసం ఏళ్ల తరబడి పొదుపు చేసుకుని స్థలం కొనుగోలు చేసే పేద, మధ్యతరగతి కుటుంబాలు రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వ రుసుములతో పాటు అదనపు మొత్తాలు చెల్లించాల్సి రావడం ఆర్థిక భారంగా మారుతోందని ప్రవీణ్‌కుమార్ అన్నారు. డాక్యుమెంట్ రైటర్లకు ప్రజలు చెల్లిస్తున్న మొత్తాలు, వాటి వివరాలు, ఆ డబ్బు ఎక్కడికి వెళ్తుందనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. పీర్జాదిగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సర్వే నంబర్లు 39, 43, 44లోని ఓ ప్లాట్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉన్నప్పటికీ రూ.2 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆయన ఆరోపించారు. అదే అపార్ట్‌మెంట్‌లో మరో ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వెళ్లగా, గతంలో పొరపాటున రిజిస్ట్రేషన్ చేశామని, ప్రస్తుతం చేయలేమని అధికారులు చెప్పారని పేర్కొన్నారు. ఈ రెండు వ్యవహారాల రికార్డులను పరిశీలించి వాస్తవాల ను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు.

### సమగ్ర విచారణకు డిమాండ్

ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అదనపు వసూళ్లపై జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు--రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రవీణ్‌కుమార్ కోరారు. అధికారులు, ఉన్నతస్థాయి వ్యక్తులకు నెలనెలా వాటాలు వెళ్తున్నాయంటూ వస్తున్న ఆరోపణలపైనా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ రికార్డులు, లావాదేవీలు, డాక్యుమెంట్ రైటర్ల కార్యకలాపాలను పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని అన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయాల ఎదుట ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల కష్టార్జితాన్ని గౌరవించి రిజిస్ట్రేషన్ వ్యవస్థను పారదర్శ కంగా నిర్వహిం చాలని కోరారు. ఈ ఆరోపణలపై సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికా రులు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల అధికారిక వివరణ రావాల్సి ఉంది.



## తల్లీకొడుకుల అదృశ్యం..

**నర్సాపూర్ సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** తల్లి కొడుకు అదృశ్యమైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పల్ తుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిప్పల్ తుర్తి గ్రామానికి చెందిన గూగులోత్ రాజేందర్ ప్రైవేట్ టీచర్ గా జాబ్ చేస్తున్నాడు. 12 సంవత్సరాల క్రితం శివంపేట్ మండలం చండీ గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్సింగ్ తాండకు చెందిన అనితను వివాహం చేసుకున్నారు. వీరికి వివాహ జీవితంలో ఇద్దరు కుమారులు వర్షిత్ (11) వరుణ్ తేజ్ (10) లుగా ఉన్నారు. మంగళవారం నాడు రోజు మాదిరిగానే సూరారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలకు రాజేందర్ వెళ్లాడు. తిరిగి అదే రోజు సాయంత్రం ఏడు గంటలకు ఇంటికి రాగానే తన భార్య అనిత పెద్ద కొడుకు వర్షిత్ కనపడకుండా పోయారు. చుట్టుపక్కల బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తన భార్య కొడుకు ఆచూకీ తెలుసుకోవాలని రాజేందర్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు.

# ఎంఆర్‌సీలలో బూట్ల మూటల గుట్టలు

- పాఠాలు చెప్పాల్సిన చేతుల్లో బూట్ల మూటలు
- మాస్టార్లను కూలీలుగా మార్చిన ఎంఆర్‌సీ వ్యవస్థ
- హెచ్‌ఎంలు, టీచర్ల ఆవేదన

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 02(జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ) ప్రాంగణంలో ఎక్కడ చూసినా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మూటలే కనిపిస్తున్నాయి. అయితే ఆ మూటల్లో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన బూట్లు, చెప్పులు, టై, బెల్టు, ఇతర విద్యా సామగ్రి ఉన్నాయి.**



వివిధ పాఠశాలలకు సరఫరా చేయాల్సిన విద్యార్థుల బూట్లు, చెప్పులు, ఇతర సామగ్రిని ఎంఆర్‌సీ నుంచి ఉపాధ్యాయులే మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, తదితర సామగ్రి కోసం నెలలో రెండు, మూడు సార్లు ఎంఆర్‌సీకి రావాల్సి వస్తోందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. మంగళవారం మునిపల్లి ఎంఆర్‌సీ కార్యాలయం ముందు విచ్చలవిడిగా బూట్లు, టై , బెల్టు మూటలు కనిపించాయి.

### మూటలు మోసేదెందుకు?

పుస్తకాలు, విద్యా సామగ్రి తీసుకెళ్లడం వరకు కొంతవరకు అర్థం చేసుకోవచ్చని, కానీ విద్యార్థుల బూట్లు, చెప్పులు కూడా భారీ మూటల రూపంలో ఉపాధ్యాయులే మోసుకెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా ఉందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోధనకు కేటాయించాల్సిన సమయం సామగ్రి తరలింపులోనే వృథా అవుతోందని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్కూల్ పాయింట్‌కే పంపించాలి

విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన బూట్లు, పుస్తకాలు, ఇతర సామగ్రిని ఎంఆర్‌సీ వద్దకు తీసుకురావడం కాకుండా ప్రతి పాఠశాల స్కూల్ పాయింట్‌కే నేరుగా సరఫరా చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా చేస్తే ఉపాధ్యాయులపై అదనపు భారం తగ్గడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు సమయం కేటాయించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### ప్రధానోపాధ్యాయులే కూలీలుగా మారాల్సిన దుస్థితి

ఎంఆర్‌సీలో పుస్తకాలు, ఇతర సామగ్రి తీసుకెళ్లే సమయంలో ప్రధానోపాధ్యాయులే మూటలు మోసుకోవాల్సి వస్తోందని పలువురు హెచ్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వయసు పైబడిన ప్రధానోపాధ్యాయులు సైతం బరువైన పుస్తకాల మూటలు మోసుకెళ్లడం ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు.

ఉపాధ్యాయులకు సహకరించాల్సిన సీఆర్‌పీలు కూడా ఈ విషయంలో తగిన సహకారం అందించడం లేదని కొందరు ప్రధానోపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. సీఆర్‌పీలకు అవసరమైన విధంగా పంపిణీ బాధ్యతలు అప్పగించి, పుస్తకాలు, ఇతర సామగ్రి తరలింపులో సహకరించేలా చూడాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మూటలు మోసే పరిస్థితిని నివారించేందుకు సీఆర్‌పీల సేవలను వినియోగించాలని, అవసరమైతే ఎంఆర్‌సీ నిధుల నుంచి కూలీలను ఏర్పాటు చేసి పుస్తకాలు, బూట్లు తదితర సామగ్రిని ఉపాధ్యాయులు తెచ్చుకున్న ఆటోల్లో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
03 సెప్టెంబర్ 2026

# శిశువు మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబం ఆరోపణ
- వారం రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని సూపరింటెండెంట్ హామీ



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో ప్రసవ సమయంలో శిశువు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జి. స్వాతి తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకున్నారని, ఎలాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ప్రసవం కోసం ఆగస్టు 30న ఆమెను వనపర్తి ఎంసీహెచ్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో చేరిన అనంతరం స్వాతికి తీవ్ర ప్రసవ నొప్పులు వచ్చినప్పటికీ సంబంధిత వైద్యులు సకాలంలో తగిన వైద్య నిర్ణయం తీసుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఉమ్మనీరు పోయిన పరిస్థితిలోనూ సరైన చికిత్స అందించలేదని, పరిస్థితి తీవ్రంగా ఉందని భావించి సిజేరియన్ చేయాలని కుటుంబ సభ్యులు కోరినా స్పందించలేదని తెలిపారు. ఆగస్టు 31న రాత్రి సుమారు 11.30 గంటలకు ప్రసవం జరిగిందని, అనంతరం శిశువు మృతిచెందినట్లు తమకు సమాచారం ఇచ్చి మృత శిశువును అప్పగించారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శిశువు మృతికి గల కారణాలను ఆస్పత్రి సిబ్బంది స్పష్టంగా వివరించలేదని వారు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రమోహన్, ఆర్ఎంఓ డాక్టర్ శివప్రసాద్‌లను కలిసి బాధిత కుటుంబ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, వైద్యులు లేదా సిబ్బంది తప్పిదం ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబం ఫిర్యాదుపై సూపరింటెండెంట్ స్పందిస్తూ వారం రోజుల్లో పూర్తి స్థాయి విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. వైద్య నిర్లక్ష్యం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణలో జాప్యం జరిగితే ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జగన్నాథం శివకుమార్, చెన్నా రాయుడు, పద్మ, కేతూరి బుడ్డన్న, అన్వేష్, గజరాజుల తిరుమలేష్, రమేష్, గంధం ప్రవీణ్, రాజేష్, సత్యనారాయణ, చంద్రశేఖర్ గౌడ్, ప్రవీణ్, భాస్కర్ కుమార్ తదితరులు ఉన్నారు.

## గంజాయి పట్టివేత

- ఇద్దరిపై కేసు నమోదు



**తూప్రాన్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** తూప్రాన్ పట్టణం జాతీయ రహదారిపై నర్సాపూర్ బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను తూప్రాన్ పోలీసులు తనిఖీ చేయగా, వారి వద్ద సుమారు 100 గ్రాముల గంజాయి లభించినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అలావుద్దీన్ లవకుష్. వీరు శభాష్‌పల్లి ప్రాంతంలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపారని ఉత్తరప్రదేశ్ నుండి కంపెనీకి తిరిగి వస్తున్న సమయంలో తమ వెంట గంజాయిని తీసుకువచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై ఎన్ డి పి ఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరి వద్ద నుంచి పొందారు, ఎవరికి సరఫరా చేయడానికి తీసుకువచ్చారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగు ఉందన్నారు. తూప్రాన్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.


## విద్యార్థినులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన




**రాజోళి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** రాజోళి మండల కేంద్రంలోని బుధవారం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్ పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మవద్దని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని విద్యార్థినులకు సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# ఫ్లెమింగ్ రసాయన జలాలతో విష జ్వరాలు

- చెరువు నీరు కలుషితం



**శివ్వంపేట, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం నవాబు పేట గ్రామ శివారు సర్వే నంబర్ 270 లో ఉన్న ఫ్లెమింగ్ లేబోరేటరీస్ పరిశ్రమల విడుదల చేసే విష రసాయనాలు, అలాగే వ్యర్థ జాలలతో భూగర్భ జలాలు, సాంబయ్య చెరువు నీరు కూడా కలుషితం కావడం జరుగుతుందని దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ, ఉప సర్పంచ్ రవి, గ్రామస్తులు బుధవారం శివ్వంపేట లోని తహసీల్దార్ కార్యాలయం లో ఉప తహసీల్దార్ బషీర్ ను గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నావబుపేట గ్రామంలోని ఫ్లెమింగ్ కంపెనీ ప్రమాదకరమైన రసాయన వాయువులు, వ్యర్థ జలాలు విడుదల చేయడం వల్ల వాయు, భూ, నీరు కలుషితం అవుతూ మా గ్రామానికి సంబందించిన సాంబయ్య చెరువు నీటిని పూర్తిగా కలుషితం చేస్తున్నారన్నారు. దీంతో గ్రామ ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు వస్తున్నాయని వారు తెలిపారు. ఇందులో చర్మ, శ్వాస కోశ అలాగే తీవ్రమైన జ్వరాలు ప్రబలుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా భూగర్భ జలాలు రంగు మారుతున్నాయని, చుట్టుపక్కల తో పాటుగా కంపెనీ లోపల ఉన్నటువంటి పచ్చని చెట్లు ఎండిపోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ విషయం జూన్ 23 న కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామస్తులు గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపనీ పై తనిఖీలు చేసి పంచనామా నిర్వహించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కు, అలాగే జిల్లా కలెక్టర్ కు నివేదికలు సమర్పించాలని గ్రామస్థులు కోరారు.

# గోంగ్లూర్ తాండా శివారులో అక్రమ తవ్వకాలు

- రాత్రివేళ టిప్పర్లలో ప్రైవేట్ కంపెనీకి తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



**పుల్కల్/చౌటకూరు, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్,చౌటకూరు మండలాల సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ మట్టి దందా జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోంగ్లూర్ తాండా శివారు అక్రమార్కులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా ఓ ప్రైవేట్ కంపెనీ చౌటకూర్ సమీపంలోని ఎంపీ డిస్టలరీ కి మట్టిని తూకం వేసి మరి తరలిస్తున్నట్లు సమాచారం. భారీ వాహనాలు వరుసగా మట్టి తరలిస్తున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అనుమతులు ఉన్నాయా? లేక అక్రమంగా తవ్వకాలు సాగుతున్నాయా? అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, సహజ వనరులను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించబోమని అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 18 గంటల కరెంట్ ఇవ్వాలని రైతుల ధర్నా

- రంగంలోకి దిగిన ఎమ్మెల్యే బండ్ల



**కేటీదొడ్డి, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** మండలంలోని నందిన్నె సబ్‌స్టేషన్ వద్ద గద్వాల – రాయచూర్ రహదారిపై మండల రైతులు బుధవారం భారీ ధర్నా చేపట్టారు. ప్రస్తుతం కేవలం 12 గంటల విద్యుత్ మాత్రమే వస్తోందని, పంటలను కాపాడుకోవడానికి కనీసం 18 గంటల కరెంట్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కరెంట్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్నాయని, తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో గద్వాల – రాయచూర్ ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వెంటనే ధర్నా స్థలానికి చేరుకున్నారు. రైతుల సమస్యలను ఓపికగా విన్న ఆయన, అక్కడి నుంచే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. రైతులకు అన్యాయం జరగనివ్వబోమని, 18 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మరియు విద్యుత్ అధికారుల సానుకూల హామీతో రైతులు తమ ధర్నాను తాత్కాలికంగా విరమించారు. అయితే, ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ సరఫరా మెరుగుపడకుంటే భవిష్యత్తులో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# 1000 రోజుల అభివృద్ధిపై చర్చకు రండి

- నిరంజన్‌రెడ్డికి మేఘారెడ్డి సవాల్



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** వనపర్తి రాజకీయాల్లో మాటల యుద్ధం ముదురుతోంది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేసిన విమర్శలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. బుధవారం నాడు వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, తెలంగాణ ఉద్యమం, భూవివాదాలు తదితర అంశాలపై బీఆర్ఎస్ నేతలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. ప్రజా ప్రభుత్వం 1000 రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేసి ప్రజల ముందు ఉంచుతామని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు పదేళ్ల పాలనలో ఏం చేసిందో చెప్పాలి. మా ప్రభుత్వం 1000 రోజుల్లో ఏం చేసిందో లెక్కలతో చెబుతున్నాం. దీనిపై బహిరంగ చర్చకు మీరు సిద్ధమా?" అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి సవాల్ విసిరారు.

### రూ.2,389 కోట్లతో అభివృద్ధి పనులు

వనపర్తి నియోజకవర్గంలో రూ.2,389 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని మేఘారెడ్డి తెలిపారు. ఆరు గ్యారంటీల అమలుకు సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. "మా ప్రభుత్వం చేసిన అభివృద్ధికి లెక్కలు చెబుతున్నాం. మీ పదేళ్ల పాలనకు కూడా లెక్కలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారా?" అని ప్రశ్నించారు.

### "ఆరోపణలు నిజమైతే ఆలయానికి రండి"

తనపై వచ్చిన భూ ఆరోపణలపై ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను భూమి కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనని, ఆ లావాదేవీకి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సాక్షిగా ఉన్నారని తెలిపారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం, బి కృష్ణ, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, సుక్కరాజు, పార్టీ అధికార ప్రతినిధులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వలలో చిక్కుకుని యువకుడు మృతి

- చిన్నఘనపూర్ మంజీరా నదిలో విషాద ఘటన




**కొల్చారం, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బోలా సాయికిరణ్ (24) మంజీరా నదిలో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో చేపలు పట్టేందుకు చిన్న ఘనపూర్ శివారులోని మంజీరా నదికి వెళ్లిన సాయికిరణ్ చేపలు పడుతుండగా మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. చేపలు పట్టే వల రెండు కాళ్లకు చుట్టుకోవడంతో దానిని విడిపించుకోలేక నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి తండ్రి బోలా కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ తెలిపారు.

## జోగులాంబ గద్వాల వాసికి అరుదైన గౌరవం



**ఇటిక్యాల, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం మునగాల గ్రామానికి చెందిన డాక్టర్ వడ్ల వీరేంద్ర బ్రహ్మాచారికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ సంస్థ, న్యూరిక్స్ లో వైస్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీ హెచ్డి పూర్తి చేసిన ఆయన దశాబ్దాలుగా అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల్లో పనిచేస్తూ శాస్త్రవేత్తగా అంచెలంచెలుగా ఎదిగారు. క్యాన్సర్ వాపు సంబంధిత వ్యాధులకు వినూత్న ఔషధాలు అభివృద్ధిపై న్యూరిక్స్ దృష్టి సారిస్తోంది. సంస్థల్లో సుమారు 20 మంది శాస్త్రవేత్తలతో కలిసి 1,2,3 క్లినికల్ అధ్యయనాలకు వీరేంద్ర మద్దతు అందించారు. ఇటీవల భారత్ పర్యటనకు వచ్చిన సందర్భంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తన శాస్త్రీయ ప్రయాణంతో పాటు ట్రాన్స్లేషన్ మెడిసిన్ పై తన దృక్పథాన్ని అధ్యాపకులు పంచుకున్నారు. తన శాస్త్రీయ ప్రయాణంలో సహకరించిన సంస్థలు, గురువులు, సహచరులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు వీరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించడం పట్ల ఉత్సాహంగా ఉందని భవిష్యత్తులో రోగులకు మెరుగైన చికిత్స అందించే ఔషధాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పథకాల అమలు సక్సెస్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు బుధవారం . గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్యసాయం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై చర్చకు బీఆర్ఎస్, బీజేపీ సిద్ధంగా ఉన్నాయా అని జగ్గారెడ్డి సవాల్ విసిరారు. సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల్లో ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లపై చర్చకు తాము సిద్ధమన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం కంటే ముందుగా తమ పార్టీలోని సమస్యలను చక్కదిద్దుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సోనియాగాంధీ, కాంగ్రెస్ చేసిన కృషిని మరిచిపోవద్దన్నారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల త్యాగాలను గుర్తించాలని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని ఆరోపించిన జగ్గారెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఇక ప్రతిపక్షంలోనే ఉండాల్సి వస్తుందని విమర్శించారు.

## పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు



**హవేలి ఘనపూర్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** మెదక్ హవేలీ ఘన్పూర్ మండలం కేంద్ర రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సిఎంర్ఫ్ ) చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ద్వారా నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సింధు రేణుక కాంగ్రెస్ పార్టీ నాయకులు శేరి మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండారం కిరణ్ గౌడ్ హవేలి ఘన్పూర్ మాజీ సర్పంచ్ నోముల శ్రీకాంత్ వివిధ గ్రామాల సర్పంచులు ,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 22-ఏ భూముల సమస్యపై మహా ధర్నా



**కొల్చారం, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు 22-ఏ నిషేధిత జాబితాలో నమోదైన భూముల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మహా ధర్నాను ఉద్దేశించి కొల్చారం మండల బీజేపీ అధ్యక్షులు పంతులు హరీష్ మాట్లాడుతూ.. 22-ఏ సెక్షన్ కారణంగా అనేక మంది పేదలు, రైతులు తమ భూముల హక్కులు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు యాదగిరి, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కేతావత్ పూల్ సింగ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఎలాకుర్తి దుర్గయ్య, గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు శివలాల్, పోతంశెట్టిపల్లి సర్పంచ్ దయాకర్ గౌడ్, కిష్టాపూర్ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య, మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఖలీల్, మండల ప్రధాన కార్యదర్శులు పల్లె రవికాంత్, గుండు నాని, మండల ఉపాధ్యక్షుడు వెంకట్, బూత్ అధ్యక్షులు మంద మహేష్, ఆకుల కృష్ణ, ఎంబారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు చెల్లని కళ్యాణలక్ష్మి చెక్కులు

- గడువు ముగిసిన చెక్కులు ఇచ్చి 30 రోజులైనా కొత్త చెక్కులు రాక..
- లబ్ధిదారుల అవస్థలు

**కెరమెరి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** కెరమెరి మండలంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెల్లని చెక్కులు అందజేసి 30 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆర్డీవో కార్యాలయం నుండి కొత్త చెక్కులు రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొంటూ బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్ కార్యకర్తలతో కలిసి కెరమెరి తహశీల్దార్ నాగార్జున గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. గత నెలలో పంపిణీ చేసిన చెక్కులు బ్యాంకులో చెల్లకపోవడంతో పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే చెల్లని చెక్కుల స్థానంలో కొత్త చెక్కులను మంజూరు చేయాలని వినతిలో కోరారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల ఫైళ్లను త్వరితగతిన విచారణ జరిపి ఉన్నతాధికారులకు పంపించి, లబ్ధిదారులకు న్యాయం చేయాలని తహశీల్దార్ ను కోరారు. తక్షణమే స్పందించిన తహసిల్దార్ ఆర్డీవో గారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# రాహుల్‌పై ఎఫ్ఐఆర్ ఉపసంహరించాలి

**నిర్మల్‌లో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ**




**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ ఇచ్చిన పిలుపుతో నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు నాయకత్వంలో బుధవారం నిర్మల్‌లో కాంగ్రెస్ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించాయి. గాంధీ పార్క్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 8న ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో నిర్వహించిన సభ అనంతరం కొందరు వ్యక్తులు సభా ప్రాంగణాన్ని గంగాజలంతో సంప్రోక్షణ చేసి శుద్ధి చేయడాన్ని రాహుల్‌గాంధీ తప్పుబట్టారని నాయకులు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే చర్యగా అభివర్ణించారు. తక్షణమే ఎఫ్ఐఆర్‌ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏంబడి రాజేశ్వర్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, పట్టన అధ్యక్షుడు ఆకుల హరీష్ కుమార్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకు ఎదుట సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ధర్నా



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఎదుట బుధవారం సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ధర్నా చేపట్టారు. యూనియన్ బ్యాంకు ఎదుట నల్ల బ్యాడ్జిలు ధరించి సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద భీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యంతో యూనియన్ బ్యాంక్ చేసుకున్న ఒప్పందం మేరకు 2024 ఫిబ్రవరి 26 నుండి యూనియన్ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్న కోల్ మైన్స్ పెన్షన్ దారులకు 30 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాల్సిన యూనియన్ బ్యాంకు అధికారులు పెన్షన్ దారుల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నారని, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ దారుల వ్యతిరేక విధానాలను యూనియన్ బ్యాంక్ అధికారులు విడనాడాలని అన్నారు. 2024 లో చేసుకున్న ఒప్పందం మేరకు 70 సంవత్సరాల లోపల పెన్షన్ దారులకు వెంటనే 30 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల విశ్రాంత సింగరేణి ఉద్యోగులతో పాటు పెన్షన్ దారుల కుటుంబాలతో యూనియన్ బ్యాంక్ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం బెల్లంపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సదాశివ్, నాయకులు పేరాల రాయమల్లు, బింగి పోషం, బొట్ల కృష్ణస్వామి, భాషవోయిన పోతరాజు, దాసి సదానందం, అక్కల దుర్గయ్య, కె తిరుపతి, జే నాగేశ్వర్ రావు, కె గురుస్వామి, డి రవీందర్, ఎం కృష్ణమూర్తి, ఎం వెంకటి, పెద్దపల్లి లక్ష్మయ్య, అచ్చ వెంకటేశం, బి రాజనర్సు, దాసు సదానందం, ఎస్ సత్యనారాయణ, ఆర్ ఎం సింగడే, డి దేవయ్య, ఎం లక్ష్మయ్య, మెరుగు నర్సింహస్వామి, గట్టు రాజయ్య, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల రక్తచరిత్రపై ఓటు బ్యాంకు ముసుగు!



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రావు రామచంద్రరావు

**పరకాల, సెప్టెంబర్02 (జనంసాక్షి) :** తెలంగాణ విమోచన చరిత్రను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మరుగునపరచే ప్రయత్నాలను ప్రజలు సహించరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రావు రామచంద్రరావు అన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం రాజకీయాలకు అతీతమైన విషయమని, వారి చరిత్రను విస్మరించడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించడమేనన్నారు. 'వందేమాతరం' గీతం నాటి విమోచన పోరాటానికి స్ఫూర్తినిచ్చిందని, అలాంటి దేశభక్తి గీతంపై కాంగ్రెస్ వైఖరి ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం విమోచన చరిత్ర విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే స్థాయిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించడంతో పాటు ప్రతి గ్రామంలో అమరవీరుల త్యాగాలను స్మరించే కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి పగడాల కాళీప్రసాదరావు మాట్లాడుతూ మరో రెండేళ్లలో బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా ఘనంగా నిర్వహించి అమరవీరులకు అసలైన నివాళులు అర్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్తినేని ధర్మారావు, రావు పద్మ, ఎడ్ల అశోక్‌రెడ్డి, పెసరు విజయచందర్‌రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, రుద్రమదేవి, ఎర్రం రామన్న, గురుప్రసాద్, ప్రసాదరావు, జయంత్‌లాల్, మండల అధ్యక్షుడు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# విమర్శలకు కుంగేది లేదు.. పొగడ్తలకు పొంగేది లేదు

- మంత్రి సీతక్క




**గోవిందరావుపేట, సెప్టెంబర్ 02(జనం సాక్షి):** మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి విస్తృత సమావేశం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ముఖ్య అతిథులుగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గోవిందరావుపేట మండల అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువతకు అందుతున్న ప్రయోజనాలు, ములుగు జిల్లా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, పార్టీ గ్రామ కమిటీల బలోపేతం వంటి అనేక అంశాలపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్న ప్రజా ప్రభుత్వంగా నిలిచిందని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. గోవిందరావుపేట మండల రైతులకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. లక్నవరం జలాశయంలోకి అవసరమైన నీటిని విడుదల చేయడంతో పాటు, గోదావరి జలాలను లక్నవరం జలాశయంలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. పంటల సాగుకు అవసరమైన నీరు అందుబాటులో ఉండేలా చేసి, గోవిందరావుపేట మండలాన్ని కరువు రహిత మండలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సీతక్క పేర్కొన్నారు.

మండలంలోని గ్రామాల్లో ఇప్పటికే చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆలయాల అభివృద్ధి, కమ్యూనిటీ హాళ్లు, రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులను సమావేశంలో ప్రస్తావించారు. ప్రజలకు తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ అవసరాలు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా గ్రామాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను రాజకీయ విమర్శలకు సమాధానం చెప్పడంలో కాకుండా అభివృద్ధి పనులతో, సంక్షేమ కార్యక్రమాలతో, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనతో నిరూపిస్తామని ఆమె పేర్కొన్నారు.

**వైఎస్సార్ సేవలకు ఘన నివాళి..**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షులు అశోక్, మండల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల కోసం వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను నాయకులు స్మరించుకున్నారు. ప్రజల సంక్షేమాన్ని రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్లిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

**గ్రామ కాంగ్రెస్ కమిటీలకు నూతన సారథులు..**

సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులను ప్రకటించారు. నూతనంగా నియమితులైన అధ్యక్షుల పేర్లను ప్రకటించి, వారికి పార్టీ కండువాలు కప్పి బాధ్యతలు అప్పగించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి ఇంటికీ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని, ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోసం కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్,భగవాన్ రెడ్డి,రాజేందర్ గౌడ్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి,మద్దాలి నాగమణి,ఎండి.ఇస్సార్ ఖాన్,మామిడిశెట్టి కోటి,మారం సుమన్ రెడ్డి,రసపుత్ సీతారామ్ నాయక్, జెట్టి సోమయ్య,తేళ్ల హరిప్రసాద్,ఉమాదేవి,జనార్ధన్ రెడ్డి,చంద్రశేఖర్,చింత క్రాంతి,అభిలాష్,నూతన గ్రామ కమిటి అధ్యక్షులు, మహిళలు, యువజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్ఆర్పీ-1 బొగ్గు గని స్వర్ణోత్సవ వేడుకలు



**శ్రీరాంపూర్ (జనంసాక్షి) :** శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఎస్ఆర్పీ1 బొగ్గు గని 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలు ఏజెంట్ రవికుమార్ అధ్యక్షతన,మేనేజర్ ఆత్మారాం సహాని పర్యవేక్షణలో సింగరేణి డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు విశిష్ట అతిథిగా,శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్యాతిథులుగా విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగులు, అధికారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. 50 సంవత్సరాల పూర్తి సందర్భంగా గని ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోల్డెన్ జూబ్లీ పైలాన్ ను అతిథులు ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి స్వర్ణోత్సవ జ్ఞాపికను ఆవిష్కరించారు. ఏరియా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ 50 ఏళ్ల పండుగ నిర్వహించుకుంటున్న ఎస్ఆర్పీ1 గని శ్రీరాంపూర్ ఏరియాకు గర్వకారణం అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోనే అత్యంత చైతన్యవంతమైన గ్రూప్ అని అందులో ఎస్ఆర్పీ1 గని 2018 లోనే ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి తరువాత ఆర్కే 7,ఆర్కే న్యూటెక్ గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ రావటంలో ఆధ్యులుగా నిలిచిందన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలోనే అత్యంత నష్టాల్లో ఉండి మూసివేయాలని నిర్ణయించిన దశలో ఉద్యోగులు, కార్మిక సంఘాలు అందరూ కలిసి కట్టుగా కృషిచేసి లాభాల్లోకి వచ్చిన చరిత్ర గల గని ఎస్ఆర్పీ1 అని కొనియాడారు. డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన 35 ఏళ్ల సింగరేణి అనుభవంలో తనకు తీరని కోరిక ఏదైనా ఉంది అంటే అది శ్రీరాంపూర్ ఏరియాలో ఒక్కసారికూడా పనిచేసే అవకాశం రాకపోవటం అన్నారు. ఒక భూగర్భ గని 50 ఏళ్లు పూర్తిచేసుకొని స్వర్ణోత్సవ వేడుక జరుపుకోవటం హర్షణీయం అన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకొని,నాణ్యమైన బొగ్గు అందిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలలో రాణిస్తేనే సంస్థ మనుగడ సాధ్యమని గుర్తెరిగి ప్రతీ ఉద్యోగి తమ తమ విధులు సక్రమంగా నిర్వహిస్తూ సంస్థ అభ్యున్నతి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్ర రావు,జీఎం క్వాలిటీ ఆర్జీ రీజియన్ వెంకట్ రమణ,విశ్రాంత సీజీఎం సుగుణాకర్ రెడ్డి,గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా,ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు,సీఎంఓఏఐ అపెక్స్ కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏవీ రెడ్డి,గని ఏజెంట్ రవికుమార్,మేనేజర్ ఆత్మారాం సహానీ, ఇతర అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు నోటీసులపై విచారణకు ప్రత్యేక కేంద్రాలు

- అక్టోబర్ 18 వరకు కొనసాగనున్న విచారణ ప్రక్రియ
- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విచారణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కానీ, అనామలీస్ జాబితాలో ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలు, నోటీసులపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఏఈఆర్ఓ విచారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ సందర్శించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 50 విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల లోనే ఐదు, ఆరు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన విచారణలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లను విచారణకు హాజరుకావాలని సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడం, అర్హులైన వారు తమ ధ్రువపత్రాలతో విచారణకు హాజరయ్యేలా సహకరించడం ద్వారా తుది ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా రూపొందించేందుకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఈఆర్వో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ ఏఈఆర్ఓ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలను తిట్టడం ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

- 420 హామీల్లో ఏ ఒక్కటి పూర్తిస్థాయి అమలేది ?
- అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న సర్కార్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- పాలకుర్తిలో వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా



**పాలకుర్తి, సెప్టెంబర్ 02 (జనంసాక్షి)** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలన పక్కకు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను తిట్టడమే ధ్యేయంగా పెట్టుకు న్నాడని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఘాటుగా విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీలో 120 మీటర్ల బ్యానర్ ను పట్టుకొని బీఆర్ఎస్ కార్యకర్త లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దయాకర్ రావు మాట్లాడుతూ వెయ్యి రోజుల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేకుండా ధ్వంసం చేశారని విమర్శించారు. దేవుళ్లను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రజలను సైతం మోసం చేశారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు భవిష్యత్తు తో ప్రభుత్వం చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు చదువుకు దూరంమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన వస్తే అన్ని వర్గాలు ప్రజలు సంతోషపడ్డారని, వెయ్యి రోజుల పాలన పూర్తికావ స్తున్నప్పటికి కళ్యాణ లక్ష్మి, షాదిము బారక్ పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, విద్యార్థులకు స్కూటర్ లాంటి పథకాలు ఇవ్వలే దని విమర్శించారు. అయితే రైతు భరోసా పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో ఇవ్వలేని పరిస్థితుల్లో కాం గ్రెస్ ప్రభుత్వం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు భీమా పథకం పూర్తిగా రద్దు చేశారేమోనని అన్నారు. వృద్దురాలకు, దివ్యాంగులకు పించన్ పెంచుతా నని నమ్మించి ఇంతవరకు పెంచిన పించన్ ఇవ్వలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగిస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాయాంలో రెండు పంటలకు సాగునీరును విడుదల చేశామని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీరు విడుదల చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తోందని విమర్శించారు. దీంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతులు ఏ పంట వేసిన బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, పాలకుర్తి నియోజకవర్గంలో పాలన విఫలమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీను గెలుచుకొని తీరుతామని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు, పల్లా సుందర్ రామ్ రెడ్డి. బబ్బూరి శ్రీకాంత్ గౌడ్. తీగల దయాకర్, పసునూరి నవీన్, నాగిరెడ్డి, సిందె రామోజీ, అశోక్ రెడ్డి. గాంధీ నాయక్. మాచర్ల ఎల్లయ్య. కొల్లూరు సోమయ్య. బసవ మల్లేశం. పాము శ్రీనివాస్. సర్పంచులు కమ్మగాని విజయ, చింతకింది రజిత. గణపురం రేణుక. పసులాది యాకస్వామి, బానోత్ మహేందర్ నాయక్. వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కి వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బాకీపడ్డ బాకీకార్డులు ప్రజలకు పంచి, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శించి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలసి నిరసన తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త నిరసనల పిలుపు మేరకు అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమలుకాని 6 గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజులలోనే అమలుచేస్తామని నమ్మించి మోసపూరితంగా గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినప్పటికీ నేటివరకూ వాటిని పూర్తిస్థాయిలో అమలుచేయకుండా వంచించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బాకీ పడిన 6 గ్యారెంటీలు, 420 హామీలు ప్రజలకు చేరేవరకూ ప్రజల తరపున బిఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సాగుదారుడి అరెస్ట్

**బోథ్, సెప్టెంబర్ 2(జనంసాక్షి) :** బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అట్రం లచ్చు (35) తన పత్తి పంట మధ్యలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. మొత్తం ఐదు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోగా, వాటి విలువ సుమారు రూ.50 వేలుగా పోలీసులు అంచనా వేశారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి సాగు చేసి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బోథ్ సీఐ డి. గురుస్వామి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. మాదకద్రవ్యాల సాగుకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 03 సెప్టెంబర్ 2026

# భద్రాద్రి వైద్యుల సేవలకు మంత్రి ప్రశంసల జల్లు

**ప్రాణాలు కాపాడిన భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులకు అభినందనలు**

**ఎక్స్ వేదికగా వైద్య సిబ్బందిని ప్రశంసించిన మంత్రి దామోదర రాజనర్సింహ**



**భద్రాచలం సెప్టెంబరు 02 (జనంసాక్షి) :** మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోనూ అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలను కాపాడుతున్న భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బందిపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసల వర్షం కురిపించారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా నుంచి అస్వస్థతకు గురై వచ్చిన చిన్నారులకు భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడటం పట్ల మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి చికిత్స అందించిన వైద్యులు, వైద్య సిబ్బంది సేవలను కొనియాడారు. మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలోనూ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్న వైద్యులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రి సేవలకు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు దక్కడం పట్ల స్థానికులు, వైద్య వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# దర్శనం కోసం వచ్చిన భక్తుల కారు అద్దాలు పగలగొట్టి చోరీ



**యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కొండక్రింద వాహన పూజల సమీపంలో పార్కింగ్ చేసిన భక్తుల కారు అద్దం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు గుర్తుతెలియని దుండగులు. స్వామి వారి దర్శనానికి వచ్చిన హైదరాబాద్ లోని ముసాపేట కి చెందిన భక్తులు, కారును కొండక్రింద వాహనాల పూజల సమీపంలో పార్కింగ్ చేసి సత్యనారాయణ స్వామి వ్రతం చేయించుకోవడానికి వెళ్లిన సమయంలో ఘటన చోటుచేసుకుంది. కారు అద్దం పగలగొట్టి అందులోని 5000 వేల రూపాయల నగదు, అర్ధ తులం బంగారం చోరీ చేసినట్టు బాధితులు తెలిపారు. అయితే గత మూడు రోజుల క్రితం కొండపైన ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.




# శిరీష అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరపాలి

**జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన**

**భద్రాచలం సెప్టెంబర్ 02 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, నర్సు ఊకే శిరీష అనుమానాస్పద మృతిపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం భద్రాచలం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కాంప్లెక్స్ ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు సున్నం రమేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొని శిరీష కుటుంబానికి సంఘీభావం తెలిపారు. శిరీష మృతి వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు ఎలాంటి రాజకీయ, వ్యక్తిగత ఒత్తిళ్లకు తలొగ్గకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని కోరారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న శిరీష అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం పట్ల న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె చివరి రోజుల్లో ఎక్కడ ఉన్నారు, ఎవరితో ఉన్నారు, మృతికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే అంశాలతో పాటు అందుబాటులో ఉన్న ఆధారాలు, సాక్ష్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఘటనపై దర్యాప్తును ఒకే కోణానికి పరిమితం చేయకుండా అన్ని కోణాల్లో పారదర్శకంగా కొనసాగించాలని న్యాయవాదులు స్పష్టం చేశారు. నిజమైన దోషులు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ, శిరీష మృతిపై కుటుంబ సభ్యులు, ప్రజల్లో వ్యక్తమవుతున్న అనుమానాలకు సమాధానం లభించేలా సమగ్ర దర్యాప్తు జరగాలని కోరారు. కేసు విచారణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. ఉపాధ్యక్షుడు సున్నం రమేష్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయడం ప్రభుత్వ, అధికార యంత్రాంగ బాధ్యత అని పేర్కొన్నారు. ఘటనను అత్యంత సున్నితంగా పరిగణించి ప్రతి అంశాన్ని పరిశీలించి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలవాలని, కేసు విచారణను పారదర్శకంగా కొనసాగిస్తూ వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని న్యాయవాదులు కోరారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

# క్లోరోక్విన్ మాత్రల అనంతరం విద్యార్థులకు అస్వస్థత

**52 మంది భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేరిక.. ఓ విద్యార్థిని మృతి**

**ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యాధికారులు**



**భద్రాచలం సెప్టెంబర్ 02 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏటపాక మండలం గొన్నగుప్ప గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహంలో జ్వర కేసులు నమోదైన నేపథ్యంలో క్లోరోక్విన్ మాత్రలు తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మొత్తం 52 మంది విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో తొమ్మిది మందికి మాత్రలు తీసుకున్న అనంతరం దుష్ప్రభావాలు, ఆందోళన లక్షణాలు కనిపించినట్లు వైద్యాధికారులు తెలిపారు. జమున అనే విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకురాగానే మృతిచెందిన స్థితిలో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ బుధవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మిగిలిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స అందిస్తోందని తెలిపారు. అనంతరం ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఎం పి హెచ్ డబ్ల్యు లు, ఎంటి లు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లతో డి ఎం హెచ్ ఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ, మలేరియా కేసుల గుర్తింపు, నిర్వహణపై చర్చించారు. ఆర్ డి టి పరీక్షల్లో మలేరియా పాజిటివ్‌గా తేలిన ప్రతి కేసుకు తప్పనిసరిగా రక్తపు స్మియర్ నమూనాలు సేకరించి, నిబంధనల ప్రకారం జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రయోగశాలలకు క్రాస్ వెరిఫికేషన్ కోసం పంపాలని సిబ్బందిని ఆదేశించారు.

**పోషకాహారం, నేత్రదానంపై అవగాహన**

పోషకాహార వారోత్సవాల రెండో రోజు సందర్భంగా సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను డాక్టర్ తుకారామ్ రాథోడ్ వివరించారు. ప్రజలకు అవసరమైన పోషకాలను తగిన మోతాదులో తీసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాలపై కూడా సమీక్షించారు. నేత్రదానం ప్రాముఖ్యత, దాని ద్వారా చూపును పునరుద్ధరించుకునే అవకాశం తదితర అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (గిరిజన) డాక్టర్ సైదులు, భద్రాచలం ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీధర్‌తో పాటు జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్ యూనిట్ అధికారులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ రావడం పక్కా.. రామరాజ్యం కావడం ఖాయం

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి ) :** కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసం అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఖమ్మం నగరంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు చేపట్టి, రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అరకొరగా అమలు చేస్తోందని, రైతు రుణమాఫీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థులు కూడా అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆరుగ్యారంటీలు, 420 హామీలు అంటూ తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. మహిళలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు అన్ని వర్గాలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను వంచించారని .బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారిని మోసం చేస్తోందని అన్నారు. పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ తిరిగి రావడం పక్కా. రామరాజ్యం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు భూ కబ్జాలు, భూ దోపిడీలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. గతంలో ఖమ్మం జిల్లాలో ఒక్క మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ చేయలేని దుస్థితి నెలకొందని, సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను నష్టపరుస్తోందని ఆరోపించారు.



# లబ్ధిదారులకు రూ.1.12 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ డయాలసిస్ కేంద్రం 5 పడకల నుంచి 10 పడకలకు విస్తరణ : ఎమ్మెల్యే బాలు నాయక్**

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ వైఎస్సార్ పేరు చెబితే పేద ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సామాజిక న్యాయం గుర్తుకు వస్తాయని అన్నారు. అనంతరం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన 242 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1 కోటి 12 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బాలు నాయక్ అందజేశారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 5 పడకల సామర్థ్యంతో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు పెంచినట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేసి, అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తాం అని బాలు నాయక్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మారుపాక సురేష్ గౌడ్, చింతపల్లి మండల అధ్యక్షుడు జటావత్ హరినాయక్, చందంపేట మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఎరుకల వెంకటయ్య గౌడ్, ఊట్కూరి వేమన్ రెడ్డి పాల్గొన్నారు.

# సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచండి

**కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి**




**టేకులపల్లి, సెప్టెంబర్ 2(జనంసాక్షి):** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను గత 9 సంవత్సరాల నుండి పెంచడం లేదని, ఇకపై వారి వేతనాలు పెంచుకుంటే కఠిన ఆందోళనలు చేపడతామని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి హెచ్చరించారు. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం, టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపూల సుందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ యాకుబ్ షావలి, జిల్లా సహాయ కార్యదర్శి రామ్ సింగ్ పాల్గొని మాట్లాడారు. కోయగూడెం ఓబీ కంపెనీ ఎల్ ఎస్ ఎన్ టెండర్ అయిపోయిందని, పనిచేసిన కార్మికుల బకాయిలను కాంట్రాక్టర్ చెల్లించాలని కోరారు. ఈనెల 6న ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో టి యు సి ఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయాలని కాంటాక్ట్ కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ దోపిడి జరుగుతుందని 9 సంవత్సరాల నుండి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచడం లేదని అన్నారు. కనీసం ఆ కార్మికులకు పండగ సెలవులు చట్టబద్ధ హక్కులు కూడా వర్తించడం లేదని అన్నారు.ఒక కిలో పంచదార 60 రూపాయలకు పెరిగిందని,ఒక నూనె ప్యాకెట్ ధర రెండు వందల రూపాయలకి పెరిగిందన్నారు. నిత్య వసర వస్తువుల ధరలు ఆకాశాన్నిఅంటుతున్నాయి. కానీ ఈ కార్మికుల వేతనాలు మాత్రం పెంచటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సోయి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్నాయని, కోల్ బెల్ట్ లో ఉన్న ఎమ్మెల్యేలు ఈ కాంట్రాక్టు కార్మికుల వేతనాల సమస్యపై చర్చించి వేతనాలు పెరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శివయ్య, ప్రసాద్, ఎర్రమ్మ, రవి,బాలు, పుల్లయ్యా, కౌసల్య ,జ్యోతి,నాగమణి,ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



# గుర్రంపోడుకు ఎస్ఎల్‌బీసీ నీళ్లు విడుదల చేయాలి

**4న రైతులతో కలిసి కాలువలు తెరుస్తాం**

**బీఆర్ఎస్ హెచ్చరిక**


**గుర్రంపోడు: సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** గుర్రంపోడు మండలంలోని చెరువులు, కుంటలను నింపేందుకు ఎస్ఎల్‌బీసీ ప్రధాన కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు బుధవారం నీటిపారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలోని అన్ని కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని కోరారు. చెరువులు, కుంటలు నిండితే రైతులకు సాగునీటితో పాటు ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. 4న రైతులతో కలిసి కాలువల వద్దకు రెండు రోజుల్లో ఎస్ఎల్‌బీసీ ద్వారా నీటిని విడుదల చేయకపోతే నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యుడు భగత్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన పెద్ద ఎత్తున రైతులతో కలిసి అన్ని కాలువల వద్దకు వెళ్లి నీటిని విడుదల చేస్తామని నాగులవంచ తిరుపతిరావు హెచ్చరించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి ఎస్ఎల్‌బీసీ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మధిరలో మైనార్టీల ముఖచిత్రం మార్చేలా రూ. 5.81 కోట్లు



**మధిర, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధతో మధిర పట్టణంలోని ముస్లిం మైనార్టీల దశాబ్దాల కల నెరవేరబోతోంది. మైనార్టీల సంక్షేమం, సంస్కృతి పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఏకంగా రూ. 5.81 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్,తలుపుల వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన జీవో ప్రతులను నాయకులు పత్రికలకు విడుదల చేశారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం రూ. 5.81 కోట్లలో ప్రధాన భాగమైన రూ. 4.30 కోట్లను ఉర్దూ ఘర్, షాదీఖానాల నిర్మాణాలకే కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా యాదవ బజార్‌లో నిర్మించే కొత్త ఉర్దూ ఘర్, షాదీఖానా కోసం రూ. 2.30 కోట్లు, ముస్లిం కాలనీలో ఉర్దూ ఘర్, షాదీఖానా నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మిగిలిన రూ. 1.51 కోట్ల నిధులతో మడుపల్లి పీరీల సవ్వడి దర్గా అభివృద్ధి పనులకు రూ. 50 లక్షలు, ఈద్గా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 35 లక్షలు, కబరస్తాన్ రక్షణ గోడతో పాటు గ్రావెల్ ఫిల్లింగ్ పనులకు రూ. 30 లక్షలు, ముస్లిం కాలనీ మసీదు కాంపౌండ్ వాల్‌కు రూ. 21 లక్షలు, యాదవ బజార్ మసీదు కాంపౌండ్ వాల్‌కు రూ. 15 లక్షలు ఖర్చు చేయనున్నట్లు నేతలు తెలిపారు. ఈ నిర్మాణాలు పూర్తయితే పట్టణంలోని ముస్లిం సోదరులు శుభకార్యాలు, సామాజిక సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. మధిర మైనార్టీల సంక్షేమానికి నిధులు విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చావా వేణు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కర్నాటి రామారావు, సూరంశెట్టి కిషోర్,రంగా హనుమంతరావు,మిర్యాల వెంకటరమణ గుప్తా, మైనార్టీ నాయకులు షేక్ రషీద్, సయ్యద్ సాదిక్ అలీ, జైలావుద్దీన్, మొహమ్మద్ మౌలానా, సయ్యద్ రసీదు,తూమాటి నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

# 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ నిరసనలు



**గరిడేపల్లి సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, ఇప్పుడు ప్రజలే స్వచ్ఛందంగా నిరసనలు తెలుపుతున్నారని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు అన్నారు. గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని, 1000 రోజులైనా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి 1000 రోజులు కావస్తున్నా ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని, ఇది దగా పాలనని రఘు విమర్శించారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని, ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బిఆర్ఎస్ సమరభేరి కరపత్రం ఆవిష్కరించారు. నేడు మిర్యాలగూడలో జరగబోయే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ సభకు హుజూర్ నగర్ నియోజకవర్గం నుండి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిల్లుట్ల రఘు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

**దేవాలయ ప్రాంగణంలో నూతన బోరు ఏర్పాటు**

**దేవాలయాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా**

**బిఆర్ఎస్ నాయకులు : పిల్లుట్ల రఘు**

**గరిడేపల్లి (జనంసాక్షి):** మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం హుజూర్ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు పూజలు నిర్వహించారు. అనంతరం నూతన మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని దేవాలయాలకు నేను న్నాను, అనే సంకల్పంతో దేవాలయాల ప్రతిష్ఠ కార్యక్రమాలు, ధ్వజస్తంభ ప్రతిష్టాపనలు, పునర్నిర్మాణ, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తున్నానని తెలియజేశారు. దేవాలయాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు ను ఘనంగా శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో కల్మలచెరువు మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణా నాయక్, అయ్యప్ప స్వామి దేవాలయ అర్చకులు మంగీపురం వినయ్ ఆచార్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు, పాల్గొన్నారు.

# జానపద కళాకారులకు గుర్తింపు కార్డులు



**గరిడేపల్లి (జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ జానపద కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తుందని అప్పన్నపేటకు చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అమరవరపు సతీష్ తెలిపారు.సూర్యాపేట జిల్లాలో అర్హులైన జానపద కళాకారులందరూ వెబ్‌సైట్ ద్వారా సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కళాకారుడికి గుర్తింపు కార్డు ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




## యాపిల్ కొత్త సీఈఓ వేతనం ఎంతంటే..?



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** యాపిల్ నూతన సీఈఓగా బాధ్యతలు చేపట్టిన జాన్ టెర్నస్‌కు సంస్థ భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. వార్షిక వేతనం, షేర్ల రూపంలో లభించే ప్రోత్సాహకాలతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరానికి ఆయన మొత్తం 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.551 కోట్లు) అందుకోనున్నారు. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్న టిమ్ కుక్‌కు సుమారు 47 మిలియన్ డాలర్లు (సుమారు రూ.446 కోట్లు) అందనున్నాయి. ఈ వివరాలను అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కి సమర్పించిన నివేదికలో యాపిల్ వెల్లడించింది.టెర్నస్‌కు 3 మిలియన్ డాలర్లు వార్షిక మూల వేతనం కాగా.. మరో 55 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ అవార్డులు అందనున్నాయి. ఆ స్టాక్‌లో 75 శాతం యాపిల్ షేరు పనితీరుతో ముడిపడి ఉంటుంది. మిగతా 25 శాతం కాలానుగుణంగా ఆయనకు దక్కుతుంది. మరోవైపు కుక్‌కు 2 మిలియన్ డాలర్ల వార్షిక వేతనం.. 2027 ఆర్థిక సంవత్సరానికి 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు అందనున్నాయి.సెప్టెంబరు 1న జాన్ టెర్నస్ యాపిల్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2001లో యాపిల్ సంస్థలో చేరిన టెర్నస్.. ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్, ఎయిర్‌పాడ్స్ తదితర ఉత్పత్తుల హార్డ్‌వేర్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

### పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# నష్టాల్లో ముగిసిన సూచీలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చడం, చమురు ధరలు పెరగడం, భవిష్యత్తులో అమెరికా వడ్డీ రేట్ల పెంపు తప్పదనే ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించాయి. ఐటీ, రియాల్టీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఈ కారణంగా వరుసగా మూడో రోజు సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఉదయం 76,471.32 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,944.28) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఓ దశలో 700 పాయింట్లకు పైగా పతనమైంది. ఇంట్రాడేలో 76,135.72 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయి.. చివరికి 373.93 పాయింట్లు కోల్పోయి 76,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.35 పాయింట్లు పతనమై 23,914.45 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30లో ప్రధానంగా ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్, బీఈఎల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, టైటాన్, రిలయన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 95.09 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,303.19 వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్‌లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి.



**దాడులు, చమురు మంటలు..**

దేశీయ మార్కెట్లు బుధవారం భారీ నష్టాలను చవిచూస్తున్నాయి మరోసారి పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చడం, చమురు ధరలు భగ్గుమనడంతో సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. ఉదయం 9.31 గంటల సమయంలో సెన్సెక్స్ 703 పాయింట్లు నష్టపోయి.. 76,262 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 232 పాయింట్లు కోల్పోయి.. 23,823 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో కోల్ ఇండియా, సన్‌ఫార్మా, ఓఎన్‌జీసీ, లార్సెన్ షేర్లు లాభాల్లో ఉండగా.. ఇన్ఫోసిస్, ఐషర్ మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, విప్రో, ఎంఅండ్ఎం స్టాక్స్ నష్టపోతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.97గా ఉంది.

చమురు మంటలు..

నెలరోజుల గ్యాప్ తర్వాత పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి. హర్మూజ్‌పై పట్టుకోసం ఇరాన్, అమెరికా ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు 95.52 డాలర్లుగా ఉండగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఫ్యూచర్స్ 91 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### వాట్సప్‌లో ముద్రా లోన్ అప్రూవ్ సందేశం వచ్చిందా?

## తస్మాత్ జాగ్రత్త!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 'మీ ముద్రా లోన్ దరఖాస్తు మంజూరు అయ్యింది. రుణం కోసం ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ వివరాలు పంపండి' అని మీకు వాట్సప్‌లో మెసేజ్‌లు వచ్చాయా? అయితే జాగ్రత్త! సామాజిక మాధ్యమాల్లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న ముద్రా లోన్‌కు సంబంధించిన ఈ తరహా ప్రచారాన్ని కేంద్రం కొట్టిపారేసింది. ఇలాంటి అవాస్తవాలను నమ్మొద్దని సూచించింది.




కొందరు ఆకతాయిలు ప్రజలను బురిడి కొట్టించేందుకు తప్పుడు సందేశాలను పంపుతున్నారని హెచ్చరించింది. ఈ మేరకు ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. ముద్రా రుణాల మంజూరుకు సంబంధించి సందేశాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంపడంలేదని కేంద్రం స్పష్టం చేసింది. ముద్రా అనేది ఒక రీఫైనాన్సింగ్ సంస్థ అని.. ఇది నేరుగా వ్యక్తులకు లేదా వ్యాపారులకు రుణాలను మంజూరు చేయదని పేర్కొంది. అదే విధంగా రుణాల మంజూరుకు ఏజెంట్లు లేదా మధ్యవర్తులు ఉండరని కూడా తెలిపింది. ముద్రా రుణాల కోసం సమీపంలోని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఎంఎఫ్‌ఐలను సంప్రదించాలని లేదంటే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రభుత్వం లేదా పథకాలకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద మెసేజ్‌లు వస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగానికి ఫిర్యాదు చేయాలని కోరింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,60,754 (22 క్యారెట్లు) | ₹ 1,75,370 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000

## ఉబర్‌లో లేఆఫ్‌లు..

### 3,300 మందికి ఉద్వాసన

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాకు చెందిన ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ టెక్నాలజీస్ లేఆఫ్‌లు ప్రకటించింది. ప్రపంచవ్యాప్తగా 3,300 మందిని తప్పిస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా మొత్తం ఉద్యోగుల్లో 10శాతం మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు తెలిపింది. మేనేజ్‌మెంట్‌లో లేయర్లు తొలగించడంతో పాటు రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వ్యాపారాలపై పెట్టుబడులను సమీక్షించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ మేరకు కంపెనీ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఇ-మెయిల్ పంపారు. స్థానిక నిబంధనలు అనుసరించాల్సిన దేశాలు మినహా లేఆఫ్‌ల సమాచారం ఆయా ఉద్యోగులకు చేరవేసినట్లు పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో ఉబర్ వృద్ధి పథంలో పయనించే క్రమంలో సమన్వయం కోసం మరిన్ని అంచెలు ఏర్పాడ్డాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అవి ఉపయోగపడడం లేదని ఉబర్ సీఈవో తన లేఖలో పేర్కొన్నారు. ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో 20 శాతం మేనేజర్లను తగ్గించకోనున్నట్లు ఉబర్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇందులో కొందరిని వ్యక్తిగత రోల్స్‌కు పరిమితం చేయనున్నారు. అయితే, వారిలో ఎంతమందిని లేఆఫ్ చేసేదీ మాత్రం ఉబర్ వెల్లడించలేదు. మేనేజర్ బాధ్యతల్లో లేనివారిపైనా వేటు వేయనుంది.రిమోట్ వర్క్ విధానాన్ని దాదాపు ముగించింది. భవిష్యత్తులో కేవలం 1% మందికి మాత్రమే రిమోట్ పని అనుమతి ఉంటుందని, మిగిలిన ఉద్యోగులు ఆఫీసుకు రావాల్సిందేనని ఉబర్ స్పష్టంచేసింది. సీఈవో స్థాయి నుంచి 7 కంటే ఎక్కువ లేయర్ల దిగువన ఉన్న ఉద్యోగుల సంఖ్యను 20 శాతం, ఒకరిద్దరు మాత్రమే ఉండే మైక్రోటీమ్‌ల సంఖ్యను దాదాపు 50 శాతం తగ్గిస్తున్నట్లు ఉబర్ సీఈవో తెలిపారు. తాజా నిర్ణయంతో ఉబర్ ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. 2021లోనూ దాదాపు ఇదే సంఖ్య ఉంది. లేఆఫ్‌ల విషయంలో ఏఐ ప్రస్తావన తీసుకురానప్పటికీ.. కార్యకలాపాల్లో ఏఐ వినియోగాన్ని పెంచాలన్న ఉబర్ లక్ష్యం కనిపిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### టెక్ లేఆఫ్‌లు

**ఇంకా 4 నెలలు ఉండగానే.. 1.23 లక్షల ఉద్యోగాలు ఉఫ్..!**

కృత్రిమ మేధ కారణంగా కంపెనీల్లో శ్రామికశక్తి స్వరూపమే మారిపోతోంది. ఈ కొత్త సాంకేతికతపై భారీగా పెట్టుబడులు పెడుతోన్న టెక్ సంస్థలు సహా పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటిస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా గతేడాది మొత్తంగా 1,22,606 మంది సిబ్బందిని కంపెనీలు తగ్గించుకోగా.. ఈ ఏడాది 8 నెలల్లోనే 1,23,300 మందికి లేఆఫ్‌లు ఇచ్చాయి. 289 సంస్థలు వీరిని తొలగించాయని ఒజీఎనీటటబ.టఎతి (లేఆఫ్స్ ట్రాకర్) పేర్కొంది. ఇంకా నాలుగునెలలు ఉండగానే.. గత ఏడాది కంటే కోతలు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.ఖర్చులు తగ్గించుకోవడం, వ్యవస్థలను టెక్నాలజీతో సరళీకరిస్తుండటం, మూలధనాన్ని కృత్రిమ మేధ, అధికవృద్ధి రంగాలవైపు మళ్లిస్తుండటం వంటి కారణాలతో కంపెనీలు సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటున్నాయి. ఒజీఎనీటటబ.టఎతి జాబితాలో ఒరాకిల్ (21,000) ముందువరుసలో ఉంది. అమెజాన్ (17,267), డెల్ (11,000), మెటా (10,400), మైక్రోసాఫ్ట్ (4,800) వంటివి తర్వాత స్థానంలో ఉన్నాయి. ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో 250 మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. ఈ తొలగింపులు (ఒజీఎనీటటబ) ఇంకా కొనసాగనున్నాయని ఇప్పటికే పలు కంపెనీలు చేసిన ప్రకటనలను బట్టి తెలుస్తోంది.

# మళ్లీ దద్దరిల్లుతోన్న పశ్చిమాసియా..

### దిగొస్తున్న బంగారం, వెండి ధరలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చా యి. దాంతో మార్కెట్లకు చమురు సెగ తగులుతోంది. ఒకవైపు ముడిచమురు ధరలు పెరుగుతుంటే.. లోహాలకు మాత్రం డిమాండ్ తగ్గుతోంది. దీంతో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారం రూ.1.55 లక్షలు పలుకుతోంది. నిన్న ఆ ధర రూ.1.57 లక్షలుగా ఉంది. దీని ధర రూ.రెండు వేల వరకు దిగొచ్చింది. మరోవైపు, కేజీ వెండి రూ.2,37,4



86 నుంచి రూ. 2,34,478కు పడిపోయింది. ఒక కేజీకి రూ.మూడువేల మేర ధర తగ్గింది. గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,143గా ఉంది. వెండి ఫ్యూచర్స్ కేజీకి రూ.2,32,625గా ట్రేడవుతోంది. స్పాట్ గోల్డ్ 4307డాలర్లుగా ఉండగా.. స్పాట్ సిల్వర్ 63.79 డాలర్లు పలుకుతోంది.మామూలుగా పెళ్లిళ్లు, శుభకార్యా ల సమయంలో బంగారం ధర పెరుగుతుంటుంది. అలాగే పెట్టుబడికి సాధనం. మార్కెట్లు అస్థిరతలకు గురైన సమయంలో మదుపర్లు పుత్తడిలో పెట్టుబడులనే సురక్షితమని భావిస్తుంటారు. కానీ పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. బంగారం, వెండి ధరల విషయంలో రివర్స్ ట్రెండ్ కనిపిస్తోంది. బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగా మారుతుంటాయి.

## జీఎస్‌టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లు

### ఆగస్టులో 14.8% పెరిగాయ్

దిల్లీ: దేశవ్యాప్తంగా ఆగస్టులో జీఎస్‌టీ వసూళ్లు రూ.1,99,853 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇవి 14.8% అధికం. దేశీయ లావాదేవీల ద్వారా రూ.1,37,249 కోట్లు (9.3% వృద్ధి), దిగుమతుల ద్వారా రూ.62,604 కోట్ల (29% వృద్ధి) జీఎస్‌టీ ఆదాయం వచ్చింది. మొత్తం వసూళ్లలో కేంద్ర జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) రూ.38,413 కోట్లు, రాష్ట్రాల జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) రూ.46,316 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.1,15,124 కోట్లుగా ఉన్నాయి. రీఫండ్‌ల కింద రూ.31,795 కోట్లు (67.9% వృద్ధి) చెల్లించారు. దీంతో నికర జీఎస్‌టీ వసూళ్లు రూ.1,68,057 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలోని



నికర జీఎస్‌టీ వసూళ్లతో పోలిస్తే ఇది 8.3% ఎక్కువ.తెలుగు రాష్ట్రాలకు: ఎస్‌జీఎస్‌టీ సెటిల్‌మెంట్ తర్వాత ఈ ఆర్థిక సంవత్సరం ఆగస్టు వరకు తెలంగాణకు రూ.21,885 కోట్లు (19% వృద్ధి), ఆంధ్రప్రదేశ్‌కు రూ.16,415 కోట్ల (18% వృద్ధి) జీఎస్‌టీ ఆదాయం వచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సగటు జీఎస్‌టీ ఆదాయం 16% మేర పెరిగింది. ఆగస్టులో చూస్తే తెలంగాణలో రూ.5,343 కోట్లు, ఏపీలో రూ.3,438 కోట్లు చొప్పున జీఎస్‌టీ వసూలైంది.

## చక్కెర నిల్వల గరిష్ఠ పరిమితి 2,000 క్వింటాళ్లకు తగ్గింపు

దిల్లీ: దేశంలో చక్కెర ధరలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిల్వల గరిష్ఠ పరిమితి 4 వేల క్వింటాళ్ల నుంచి 2 వేల క్వింటాళ్లకు తగ్గించింది. సెప్టెంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంగళవారం జారీచేసిన ప్రకటనలో పేర్కొంది. అక్రమ నిల్వలు, స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను తగ్గించి దేశంలో చక్కెర నిల్వలు తగినంత అందుబాటులో ఉంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. డీలర్లు తమ వద్దకు వచ్చిన నిల్వలను 30 రోజులకు మించి ఉంచుకోవడానికి



వీల్లేదు. ఎక్కడా, ఏ సమయంలోనూ చక్కెర నిల్వలు 2 వేల క్వింటాళ్లకు మించకూడదు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల నుంచి చక్కెరను సేకరించి దేశంలోని తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు కోల్‌కతా నుంచే సరఫరా అవుతున్నందున అక్కడ మాత్రం 4 వేల క్వింటాళ్లవరకు నిల్వలు ఉంచుకోవడానికి అనుమతిస్తున్నట్లు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జోక్యంచేసుకొని చర్యలు తీసుకోవడంవల్ల మార్కెట్‌లో చక్కెర లభ్యత పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## ఎయిర్ ట్యాక్సీ 'శూన్య' అభివృద్ధి

బెంగళూరు:బెంగళూరుకు చెందిన అంకురం సర్లా ఏవియేషన్ రూపొందిస్తున్న ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ 'శూన్య' ప్లాట్‌ఫామ్ అభివృద్ధి కోసం డిజైన్, సాంకేతిక సేవల సంస్థ టాటా ఎలెక్సీ చేతులు కలిపింది. ఈ ఎయిర్ ట్యాక్సీ రూపకల్పన, తయారీలో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు సంస్థలూ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా టాటా ఎలెక్సీ ఏవియానిక్స్, ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, వెరిఫికేషన్, వాలిడేషన్ సర్టిఫికేషన్ అంశాల్లో సమగ్ర ఇంజినీరింగ్ మద్దతు అందిస్తుంది. దీంతోపాటు సెన్సర్ ఫ్యూజన్ ఆధారిత నేవిగేషన్ సాంకేతికత, పరీక్షల సేవలనూ అందించనుంది. మరోవైపు శూన్య ప్లాట్‌ఫామ్ డిజైన్,




అభివృద్ధి, టైప్ సర్టిఫికేషన్ ప్రక్రియలకు సర్లా ఏవియేషన్ నేతృత్వం వహిస్తుంది.

**ఇవీ ప్రత్యేకతలు..**

శూన్య ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీని పైలట్‌తో కలిపి మొత్తం 7 సీట్ల సామర్థ్యంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇది ఒకేసారి 300 కిలోమీటర్లకు పైగా ప్రయాణించే వీలుంటుంది. ఈ విమానానికి వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (వీటీఓఎల్) సామర్థ్యం ఉంటుంది. కాబట్టి, ప్రత్యేక రన్‌వేలు అవసరం లేదు.

## మన మార్కెట్లోకి భారీగా అమెరికా డబ్బులు

### 2025 నాటికి రూ.37 లక్షల కోట్లు

### పదేళ్ల వ్యవధిలో 3 రెట్లు పెరిగిన వైనం

వాషింగ్టన్: భారత సెక్యూరిటీలలో (ఈక్విటీలు, బాండ్లు) అమెరికా పెట్టుబడులు పదేళ్ల వ్యవధిలో మూడు రెట్లు పెరిగాయి. 2015లో భారత సెక్యూరిటీలలో అమెరికా పెట్టుబడుల విలువ 130 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12.35 లక్షల కోట్లు) ఉండగా... 2025 నాటికి 390 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.37 లక్షల కోట్లు) చేరాయని అమెరికా ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు అధికంగా ఉన్న 30 దేశాల జాబితాలో భారత్ 12వ స్థానంలో నిలిచింది. అమెరికా పెట్టుబడులు అత్యధికంగా కేమాన్ దీవుల స్టాక్ మార్కెట్లో ఉన్నాయి. 2025 సంవత్సరానికి విదేశీ సెక్యూరిటీలలో అమెరికా పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై నిర్వహించిన వార్షిక సర్వేకు సంబంధించిన ప్రాథమిక గణాంకాలు సోమవారం విడుదల అయ్యాయి. ఈ వార్షిక సర్వేను అమెరికా ఆర్థిక శాఖ, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్, ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సంయుక్తంగా నిర్వహించాయి. దీని ప్రకారం...2025 నాటికి ఆయా దేశాల సెక్యూరిటీల్లో అమెరికా పెట్టుబడుల విలువను 19.3 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఇందులో ఈక్విటీల్లో 15.3 ట్రిలియన్ డాలర్లు, విదేశీ దీర్ఘకాలిక డెట్ సెక్యూరిటీల్లో (ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలపరిమితి కలిగినవి) 3.6 ట్రిలియన్ డాలర్లు, విదేశీ స్వల్పకాలిక డెట్ సెక్యూరిటీల్లో 0.4 ట్రిలియన్ డాలర్లు చొప్పున ఉన్నాయి. 2024 సంవత్సరానికి నిర్వహించిన గత సర్వేలో అమెరికా పెట్టుబడుల విలువ 15.8 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో ఈక్విటీల్లో 12.1 ట్రిలియన్ డాలర్లు, విదేశీ దీర్ఘకాలిక డెట్ సెక్యూరిటీల్లో 3.4 ట్రిలియన్ డాలర్లు, విదేశీ స్వల్పకాలిక డెట్ సెక్యూరిటీల్లో 0.4 ట్రిలియన్ డాలర్లు చొప్పున ఉన్నాయి.భారత ఈక్విటీల్లో అమెరికా పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల విలువ 2025 చివరినాటికి 380 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇది 373 బిలియన్ డాలర్లుగా నమోదైంది. భారత దీర్ఘకాలిక డెట్ సెక్యూరిటీలలో అమెరికా పెట్టుబడులు 10 బిలియన్ డాలర్ల నుంచి 11 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఈ గణాంకాలు అమెరికా పెట్టుబడిదార్లు కలిగి ఉన్న భారత సెక్యూరిటీల మార్కెట్ విలువను సూచిస్తాయి. వీటిల్లో తయారీ కేంద్రాలు, మౌలిక సదుపాయాలు, ఇతర భౌతిక ఆస్తుల్లోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను చేర్చలేదు. చైనాలో అమెరికా పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల విలువ 318 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో 300 బిలియన్ డాలర్లు చైనా ఈక్విటీలలోను, 17 బిలియన్ డాలర్లు దీర్ఘకాలిక చైనా డెట్ పత్రాల్లోనూ ఉన్నాయి.

## 'బీమా'లో డిజిటల్ రిజిస్ట్రీ

### పీఐఆర్‌ను తీసుకురానున్న ఐఆర్‌డీఏఐ

**హైదరాబాద్:** దేశ ప్రజలందరికీ బీమా రక్షణ కల్పించే లక్ష్యంతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) సరికొత్త అడుగు వేసింది. యూపీఐ, ఆధార్, డిజిలాకర్ తదితరాల తరహాలోనే బీమా రంగంలోనూ పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీ (పీఐఆర్) పేరిట ఒక డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయం (పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్- డీపీఐ) ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే, పౌరులు తమకున్న అన్ని బీమా పాలసీల వివరాలను ఒకే వేదికపై చూసుకోవచ్చు. క్లెయిముల దాఖలు, నామినీ మార్పులు, చిరునామా మార్పు వంటి సాధారణ సేవలను వేర్వేరు కంపెనీల చుట్టూ తిరగకుండా ఒక వేదిక నుంచే పూర్తి చేయొచ్చు. కొత్త పాలసీ కొనేటప్పుడు ఏజెంట్లపై ఆధారపడకుండా, నేరుగా ప్రీమియాలు పోల్చి చూసుకునే అవకాశం లభిస్తుంది. ఆరోగ్య బీమాను ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మార్చుకునే (పోర్టబిలిటీ) సమయంలో లభించే ప్రయోజనాలు ఏవీ కోల్పోకుండా సులభంగా ప్రక్రియ పూర్తవుతుంది. పాలసీదారు మరణించినప్పుడు ఆ సమాచారాన్ని మిగిలిన బీమా సంస్థలకు పంపి, నామినీలకు వేగంగా పరిహారం అందేలా ఈ పీఐఆర్ తోడ్పాటునిస్తుంది. బీమా భరోసా ద్వారా 24 గంటలూ ఫిర్యాదులు నమోదు చేసే సౌకర్యం లభిస్తుంది.జీవిత బీమా సంస్థల నుంచి సమాచారాన్ని తీసుకొని, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ వేదిక ద్వారా వివరాలను సరిచూసుకొని, రుణాలను మంజూరు నిర్ణయాన్ని తీసుకోవచ్చు. రిజర్వ్ బ్యాంక్ తెచ్చిన యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్ఐ) రుణాలకు బీమా రక్షణ కల్పించడం సులభమవుతుంది.

## బెంచ్ ఏర్పాటుకు వారికి అధికారం ఎక్కడిది?

### ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర

దిల్లీ: వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియపై ఐదుగురు సభ్యుల బెంచ్‌ను జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయడాన్ని ఎస్సెల్ గ్రూప్ ఛైర్మన్ సుభాష్ చంద్ర వ్యతిరేకించారు. విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేసే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై జాతీయ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్‌లో బుధవారం వాదనలు జరగ్గా.. సుభాష్ చంద్ర తరఫున సీనియర్ న్యాయవాది సస్మిత్ పాత్రా వాదనలు వినిపించారు.సుభాష్ చంద్ర తన ఆస్తులను బదిలీ చేయకుండా ఎన్‌సీఎల్‌టీ ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. గ్రూపు రుణాలపై వ్యక్తిగత హామీకి సంబంధించి రుణదాతలు పేర్కొన్న రూ.22,000 కోట్లకు పైగా క్లెయిమ్‌లకు గాను రూ.6.5 కోట్ల చెల్లింపుతో దివాలా పరిష్కారానికి అనుమతిస్తూ డివిజన్ బెంచ్‌లోని మూడో సభ్యుడు నీలేశ్ శర్మ జారీ చేసిన ఉత్తర్వుపైనా స్టే విధించింది. దీనిపై ఎన్‌సీఎల్‌ఏటీ ముందు సస్మిత పాత్రా వాదనలు



వినిపిస్తూ.. "ఏ అధికారంతో దీనిపై స్టే విధించారు? ఈ ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఎప్పుడు సమావేశమైంది? ఈ ధర్మాసనం కేవలం ఒకేఒక్క ఉత్తర్వును జారీ చేయడానికి దారితీసిన పరిస్థితులు ఏంటి?" అని వాదించారు.ఇదే కేసులో అసమ్మతి క్రెడిటర్ల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. ఈ కేసులో పరస్పర భిన్నమైన తీర్పులు ఉన్నాయని, మూడు భిన్న దృక్పథాలు ఉన్నందున దీన్ని పరిశీలించడానికి విస్తృత ధర్మాసనం ఏర్పాటు సరైనదేనని అభిప్రాయపడ్డారు. సుభాష్ చంద్ర తరఫు న్యాయవాది జోక్యం చేసుకుని డివిజన్ బెంచ్‌లోని తొలి సభ్యుడు, మూడో సభ్యుడు నీలేశ్ శర్మ ఇద్దరూ ఒకే రకమైన రీపేమెంట్ ప్రణాళికను ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఒకవేళ భిన్నాభిప్రాయం ఉంటే మరో సభ్యుడికో, ఇతర సభ్యులకో కేటాయించాలే తప్ప.. ఐబీసీ, లేదా కంపెనీ చట్టం కింద ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేసే అధికారం మాత్రం ఎన్‌సీఎల్‌టీకి లేదని వాదించారు. రుణ ప్రణాళిక ఆమోదం పొందక ముందే రూ.6.5 కోట్ల ప్రణాళికపై సుభాష్ చంద్ర ప్రతిష్టను దెబ్బతీసేలా బయట ప్రచారం జరుగుతోందని ఎన్‌సీఎల్‌టీ దృష్టికి తీసుకొచ్చారు.ఐదుగురు సభ్యుల బెంచ్ ఏర్పాటు సరైనదా, కాదా అనేది చర్చించదగ్గ అంశం కాదని జస్టిస్ యోగేష్ ఖన్నా నేతృత్వంలోని అప్పీలేట్ బెంచ్ స్పష్టం చేసింది. ఏవైనా అభ్యంతరాలుంటే ఈ అంశం ఎన్‌సీఎల్‌టీ వద్ద పెండింగ్‌లో ఉన్నందున అక్కడే లేవనెత్తాలని సూచించింది. తదుపరి విచారణను అక్టోబర్ 7కి వాయిదా వేసింది. మరోవైపు రుణ పరిష్కార ప్రణాళికపై ఎన్‌సీఎల్‌టీ ఐదుగురు సభ్యుల ధర్మాసనం సెప్టెంబర్ 23న విచారణ జరపనుంది.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 03 సెప్టెంబర్ 2026

# పదేళ్లు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్




- కాంగ్రెస్ ప్రజాపాలనపై ధర్నాలు చేయడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు కాంగ్రెస్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించాలి
- ఆ ఫ్లెక్సీ తొలగించకపోతే బీఆర్ఎస్ మోసాల పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తాం
- బీఆర్ఎస్‌పై సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి ఫైర్

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల ప్రజలను మోసం చేసింది చాలక కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పై ధర్నాలు చేయడమేంటని సుడా మాజీ ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక ముకరంపుర లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన పై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీకి ఇక భవిష్యత్తు కనిపించడంలేదని రోడ్డు మీదికొచ్చి ధర్నాలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే గంగుల అధికారిక క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ పై ఫ్లెక్సీ ఏర్పాటు చేయడమేంటని దాన్ని వెంటనే తొలగించాలని, ఇది మంచి పద్ధతి కాదని తొలగించకపోతే పదేళ్ల బీఆర్ఎస్ దోపిడీపై కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ కుటుంబ దోపిడీని కేసీఆర్ కూతురు కవిత దృవీకరిస్తుందని ఆదోపిడి పైసలు ఇంకా లెక్కపెట్టుకుంటున్నారని స్వయంగా ఆమెనే చెబుతుందని ఏముఖం పెట్టుకుని ధర్నాలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. మీ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఎందుకు ఇవ్వలేదో, దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని ఎందుకు మోసం చేశారో, ఇలా అనేక హామీలు ఇచ్చి ఎందుకు ఒక్కటైనా నెరవేర్చలేదో మొదట ప్రజలకు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం పై మాట్లాడాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలలో పాల్గొంటున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తానే స్వయంగా లబ్ధిదారులకు వివిధ రకాల పథకాలు అందిస్తూ, పథకాలు అమలు కావడంలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఎన్ని డ్రామాలు చేసినా బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మరని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కుర్ర పోచయ్య, మామిడి సత్యనారాయణ రెడ్డి, లక్కీరెడ్డి కిరణ్ రెడ్డి, ముక్క భాస్కర్, భారీ, తోట అంజయ్య, షబానా, గుడిపాటి రమణ రెడ్డి, ఫజల్, ఖలీల్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళకు విజయవంతంగా మైక్రోస్కోపి న్యూరో సర్జరీ



- అత్యవసరంగా స్పందించి క్లిష్టమైన శస్త్రచికిత్స
- కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం కృషి

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** మెదడులో రక్తస్రావంతో పాటు అన్యురిజం కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన 60 ఏళ్ల మహిళకు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అత్యంత క్లిష్టమైన మైక్రోస్కోపిక్ న్యూరో సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉండటమే కాకుండా తన పనులను తానే చేసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం రోజు కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యబృంద శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం బాదంపల్లికి చెందిన 60 ఏళ్ల కూరగాయల వ్యాపారి కౌసల్య రోజువారీ పనుల్లో భాగంగా ఉదయం లేచి పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయిందని, కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం వెంటనే కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. స్పృహ కోల్పోయిన స్థితిలో మెడికవర్ ఆస్పత్రికి చేరుకున్న కౌసల్యకు వైద్యులు అత్యవసరంగా సీటీ స్కాన్ నిర్వహిం చగా మెదడులో రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. తదుపరి పరీక్షల్లో మెదడులోని రక్తనాళంలో అన్యురిజం ఉన్నట్లు నిర్ధారిం చారు. రక్తనాళం గోడ బలహీన పడటంతో ఒక ప్రాంతంలో బెలూన్‌లా ఉబ్బిపోయే పరిస్థితినే అన్యురిజం అంటారని, అది చిట్లినప్పుడు మెదడులో రక్తస్రావం జరిగి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని వైద్యులు వివరించారు. కౌసల్యకు అన్యురిజం రప్చర్ అయ్యే పరిస్థితిలో అత్యంత క్లిష్టంగా మారిందని, ఆలస్యం జరిగితే ప్రాణాలకు ముప్పుతో పాటు తీవ్రమైన న్యూరోలాజికల్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో ఎమర్జెన్సీగా శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కుటుంబ సభ్యులకు పరిస్థితి, శస్త్రచికిత్సలో ఉన్న హెవీ రిస్క్ గురించి వివరించి వారి సమ్మతితో అత్యంత క్లిష్టమైన మైక్రోస్కోపిక్ న్యూరో సర్జరీ నిర్వహించినట్లు వెల్లడించారు. పేషెంట్ కౌసల్య కుమారుడు మహేష్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో న్యూరో సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్



- మరొకరి కోసం గాలింపు

**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 02(జనం సాక్షి ) :** కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల గ్రామ శివారు, సమ్మక్క గద్దెల సమీపంలో అక్రమంగా గంజాయిని విక్రయించేందుకు యత్నిస్తున్న ఒక వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 1 కిలో 11 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై ఏ. లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి ఇరుకుల్ల గ్రామ శివారులోని సమ్మక్క గద్దెల ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అక్కడ బైక్‌పై అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. సిబ్బంది వెంటనే వారిని వెంబడించి బెజ్జంకి ప్రేమ్ కుమార్ ( వయస్సు 28, బైపాస్ రోడ్, కరీంనగర్) అనే ఆటోమొబైల్ వర్కర్‌ను పట్టుకోగా, మరొక వ్యక్తి చెట్ల పొదల్లోకి తప్పించుకుని పారిపోయాడు. అదుపులోకి తీసుకున్న ప్రేమ్ కుమార్‌ను విచారించగా.. ఇరుకుల్ల గ్రామానికి చెందిన కాశిపాక నవీన్ (23) అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయంతో తనకు గంజాయి అలవాటైందని, నవీన్ ఇతర ప్రాంతాల నుండి గంజాయి తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తుంటాడని తెలిపాడు. ఇద్దరూ కలిసి గంజాయి ప్యాకెట్లు తయారు చేసి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు దాడి చేశారు. పంచుల సమక్షంలో బ్యాగును తనిఖీ చేయగా, అందులో ఉన్న 1 కిలో 11 గ్రాముల గంజాయితో పాటు ఒక బైక్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం ప్రక్రియ మొత్తాన్ని వీడియో, ఫోటోగ్రఫీ ద్వారా రికార్డు చేసి, ప్రేమ్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పారిపోయిన కాశిపాక నవీన్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నామని, అతనిని త్వరలోనే పట్టుకుని గంజాయి నెట్‌వర్క్ గుట్టు రట్టు చేస్తామని సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించిన రూరల్ పోలీస్ సిబ్బందిని సీపీ గౌష్ ఆలం, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు.

# వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లిన బస్సు

- సుందరగిరి శివారులో త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం
- హుస్నాబాద్ నుండి కరీంనగర్ వెళ్తుండగా ఘటన..
- బస్సులో 50మంది ప్రయాణికులు..
- స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు...
- ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ఫోన్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్





**చిగురుమామిడి సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ శివారులో బుధవారం భారీ బస్సు ప్రమాదం త్రుటిలో తప్పింది. హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దాదాపు 53మంది ప్రయాణికులతో హుస్నాబాద్ నుండి కరీంనగర్ వైపు వెళు ‌ఉండగా,సుందరగిరి శివారుకు చేరుకోగానే స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిపైకి దూసుకెళ్లింది.బావి పై భాగంలో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులంతా భయాందోళనలకు గురయ్యారు.తృటిలో ఘోర ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.బస్సులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా,ప్రాణనష్టం ఏమీ జరగకపోవడంతో అధికారులు,పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపులోకి తీసుకురావడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.ప్రమాదం జరిగిన విషయం తెలియగానే చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్,ఆర్టీసీ అధికారులు తమ సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.బస్సులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చి,గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించేలా సహాయక చర్యలు చేపట్టారు.ప్రమాద సమాచారం అందుకున్న హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,తహసిల్దార్ కనకయ్య,సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు.అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్,జిల్లా కార్యదర్శి బడుకోల దేవేందర్ రెడ్డి,నాయకులు చిట్టుమల్ల రవీందర్,పోటు మల్లారెడ్డి తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రయాణికులను పరామర్శించారు.బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డికి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్‌లకు ఫోన్ చేసి ప్రమాదం జరిగిన తీరును,ప్రయాణికుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.బాధితులకు తగిన సహాయం అందేలా చూడాలని,క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

- హామీలను అమలు చేయాలి..
- కలెక్టరేట్ వద్ద బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన




**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద బీఆర్‌టీయూ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం అందిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని ఆరోపించారు. ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లపై విధిస్తున్న ఏఎన్‌సీ టార్గెట్లను వెంటనే ఎత్తివేయాలని, బీఎల్‌ఓ విధుల నుంచి ఆశా వర్కర్లను తక్షణమే మినహాయించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు కూడా తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు నెలకు రూ.10 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నప్పటికీ ఆ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించి వంట బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని, దీనివల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కార్మికుల నుంచి దూరం చేయకుండా ప్రభుత్వమే కొనసాగించాలని, వంట కార్మికులకు ప్రభుత్వపరంగా గుర్తింపు కల్పిస్తూ ఐడీ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన బీఆర్‌టీయూ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమురె రాఘవులు, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు ఎం.డి. రబియా బేగం, నాంపల్లి సుమలత, మాచర్ల విజయ, జేరిపోతుల లలిత, శనిగరపు సులోచన, దూడపాక వేస్తారా, మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బుర్ర మంజుల, రాష్ట్ర కార్యదర్శి దాసరి బాబాయమ్మ, ప్రధాన కార్యదర్శి ఈ. స్వరూప, ఏ. లక్ష్మి, సరోజన, ఘట్టవా, నజియా తదితరులు పాల్గొన్నారు. సుమారు 100 మంది ఆశా వర్కర్లు, 50 మంది మధ్యాహ్న భోజన వంట కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు.




# శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో మృతి చెందిన 21 ఏళ్ల ఆదివాసీ యువతి వి.కె. శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా బాలికల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌరస్తా వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు దేశంలో మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంజన, జిల్లా బాలికల కన్వీనర్ మానస మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యాచారం, హత్యకు గురైన శిరీష మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో శృతి, పూజ, రమ్య, శివాని, వసంత, కీర్తన, శ్రీజ, సాత్విక, స్వాతి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా పాటించాలి

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి
- రెవెన్యూ అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** నిషేధిత 22(ఏ) భూములకు సంబంధించిన అంశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమగ్ర ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే సహేతుక నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ తదితర అంశాలపై ఒక్కో మండలం వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చే సమయంలో అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ విధిగా పాటించాలని తెలిపారు. తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, నిర్దిష్ట రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించాలని హితవు పలికారు. నిషేధిత భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని, సమగ్ర వివరాలతో నిర్ణీత ఫార్మాట్ లో నివేదికను రూపొందించి వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# గన్నేరువరం రైతులకు యూరియా యాప్ తిప్పలు

- ఐదు నిమిషాల్లోనే ఖాళీ అయిన స్టాక్
- నిరాశతో వెనుదిరుగుతున్న రైతన్నలు





**గన్నేరువరం, సెప్టెంబర్ 02 (జనంసాక్షి):** రైతులకు ఎరువుల బుకింగ్‌ను సులభతరం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేంవర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) విధానం గన్నేరువరం మండల రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఎరువుల యాప్‌లో ఎదురైన సమస్యలే ఇప్పుడు మళ్లీ పునరావృతం కావడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గన్నేరువరం, నుస్తులపూర్ ప్రాథమిక సహకార సంఘాలకు బుధవారం రెండు లారీలలో 900 బస్తాల యూరియా వచ్చింది. అయితే ఆన్‌లైన్ యాప్‌లో కేవలం ఐదు నిమిషాల్లోనే బుకింగ్ ప్రక్రియ ముగియడంతో, చాలా మంది రైతులు ఎరువులు దక్కక నిరాశతో వెనుదిరిగారు.

స్థానికంగా స్టాక్ కొరత కారణంగా యూరియా, డీఏపీ, 20:20 తదితర ఎరువుల కోసం రైతులు గుండ్లపల్లి వంటి దూర ప్రాంతాలకు ఆటోల్లో పరుగులు తీయాల్సి వస్తోంది.



గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన రైతు రంగనవేణి మల్లయ్య మాట్లాడుతూ.. యాప్‌లో బుక్ చేసుకుని స్థానిక సొసైటీలతో పాటు గుండ్లపల్లి డిసిఎంఎస్ నుంచి ఆటో అద్దెలు భరించి యూరియా బస్తాలు తెచ్చుకోవాల్సి వచ్చిందని, దీంతో తమపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉండాల్సిన ఎరువుల కోసం ఆన్‌లైన్ యాప్‌ల పేరుతో తమను ఇబ్బంది పెట్టకుండా, స్థానిక ప్రాథమిక సహకార సంఘాల్లోనే సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## చెస్‌లో అల్ఫోర్స్ విద్యార్థికి అంతర్జాతీయ ఫిడే రేటింగ్

**అండర్-13 జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థి స్నితిక్‌రెడ్డి ప్రతిభ**



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** చెస్ ర్యాపిడ్ ఫార్మాట్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించడం అభినందనీయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని పాఠశాలలో విద్యార్థి విజయాన్ని పురస్కరించుకుని నిర్వహిం చిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిం చడంతో పాటు రోజువారీ కార్యకలాపాలను ఉత్సాహంగా నిర్వహించేందుకు దోహదపడతాయని తెలిపారు. చెస్ ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, తార్కిక ఆలోచనా విధానం మెరుగుపడతాయని పేర్కొన్నారు. క్రీడల ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులతో వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచే విద్యార్థులను వివిధ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థి కె.స్నితిక్‌రెడ్డి హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్-13 జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని తొలిసారి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. క్రీడల్లో రాణించడం ద్వారా గుర్తింపుతోపాటు భవిష్యత్తులో పలు అవకాశాలు లభిస్తాయ ని డా.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎంసీ స్టాండింగ్ కమిటీ కీలక ప్రతిపాదనలకు ఆమోదం

- అమీన్‌పూర్‌లో రోజుకు 50 టన్నుల బయోమెథనైజేషన్ ప్లాంట్
- రహదారుల విస్తరణ, మీడియన్, సెంట్రల్ లైటింగ్‌కు గ్రీన్‌సిగ్నల్
- బీఎంఎక్స్ సూపర్‌క్రాస్ ట్రాక్ ఏర్పాటుకు అంగీకారం




**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) 7వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పట్టణ మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, బాలల సంక్షేమం, క్రీడా సదుపాయాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జైసీ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన, జోనల్ కమిషనర్లు, శాఖాధిపతులు పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా అమీన్‌పూర్‌లో రోజుకు 50 టన్నుల సామర్థ్యంతో బయోమెథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు మెకనైజ్డ్ రోడ్ స్వీపింగ్ వాహనాలు, ట్రక్ మౌంటెడ్ స్కిప్ లోడర్ల కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపింది. బర్లకుంట, శ్రీరామ్‌నగర్, శేరిలింగంపల్లిలో పర్యావరణహిత కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలకూ సమ్మతి తెలిపింది. యూనిసెఫ్ సహకారంతో సీఎంసీని బాలల అనుకూల, సురక్షిత ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. బాచుపల్లి నుంచి మల్లన్న టెంపుల్, నిజాంపేట్ రోడ్డు వరకు 30 మీటర్ల వెడల్పు రహదారికి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్, మహదేవపురం ఎక్స్ రోడ్డు నుంచి గాజులరామారం జంక్షన్ వరకు రహదారి విస్తరణ, సెంట్రల్ మీడియన్, లైటింగ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. మహదేవపురం యానిమల్ కేర్ సెంటర్‌లో డాగ్ షెల్టర్ల విస్తరణతో పాటు మేడ్చల్ చెక్‌పోస్ట్ సమీపంలో యూసీఐ ఒలింపిక్ ప్రమాణాలతో 5, 8 మీటర్ల డ్యూయల్ హిల్ బీఎంఎక్స్ సూపర్‌క్రాస్ ట్రాక్ అభివృద్ధికి అంగీకారం తెలిపారు. సీఎంసీ కార్యాలయాలు, పార్కులు, ఆస్తులు, సైనేజీలపై కొత్త అధికారిక లోగోను అమలు చేయడం, నల్లగండ్ల ఎక్స్ రోడ్డు నుంచి తెల్లాపూర్ రోడ్డు వరకు సెంట్రల్ గ్రీనరీని సీఎస్ఆర్ సహకారంతో అభివృద్ధి చేయడం, చికెన్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, గ్రీన్ వేస్ట్-టు-బయో బ్రికెట్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకూ ఆమోదం లభించింది. ఈ నిర్ణయాలతో రహదారులు, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, బాలల భద్రత, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.



## ఎస్ఐఆర్ ఫేజ్-2పై 283 మంది బీఎల్ఏలకు శిక్షణ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ఎస్ఐఆర్ ఫేజ్-2 ప్రక్రియలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 283 మంది బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరై బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా పరిశీలన, అర్హులైన వారి నమోదు, వివరాల సవరణ, బూత్ స్థాయిలో బీఎల్ఏల బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ మాణిక్యం మల్లేష్ యాదవ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ నందిమాల యాదయ్య శిక్షణ ఇచ్చారు. 'ప్రతి అర్హుడైన ఓటు-మన బాధ్యత' లక్ష్యంతో ప్రక్రియను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## సైబర్ భద్రతలో అప్రమత్తతే రక్షణ

- విద్యార్థుల భాగస్వామ్యంతో సైబర్ నేరాల నివారణ
- ఫేక్ లింకులు, ఉద్యోగాలు, గిఫ్ట్ ఆఫర్లతో మోసాలపై హెచ్చరిక
- ఓటీపీ, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దు
- మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా సైబర్ టీమ్ ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ సాంకేతికత అభివృద్ధితో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నందున ముందస్తు అప్రమత్తతే రక్షణ అని తెలిపారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, గిఫ్ట్ ఆఫర్లు, లక్కీ డ్రాల పేరుతో మోసాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. తెలియని వ్యక్తుల ఫోన్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ, ఆధార్, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా భద్రతా జాగ్రత్తలు తెలియజేయాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే భయపడకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. లోన్ యాప్స్, షేర్ మార్కెట్, ఏపీకే ఫైల్స్, కొరియర్, క్రెడిట్ కార్డు, మ్యాట్రిమోని, లాటరీ, గిఫ్ట్, మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా తదితర మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్ఐ జునైద్, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సైబర్ సెల్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్-2026పై రాజకీయ పార్టీలతో సమీక్ష

**అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో నోటీసుల జారీ, విచారణల పురోగతిని సమీక్షించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అనర్హులు, మరణించిన వారి పేర్లను నిబంధనల మేరకు పరిశీలిస్తున్నామని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరిస్తామన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, పేర్ల తొలగింపునకు ఫారం-7, వివరాల సవరణకు ఫారం-8 వినియోగించాలని సూచించారు. సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎన్.వై. గిరి, రవితేజ, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- వెయ్యి రోజులైనా నెరవేరని హామీలు
- 420 మీటర్ల ఫ్లెక్సీతో బీఆర్ఎస్ నిరసన
- 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్



**సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. కాంగ్రెస్ పాలనకు వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలు అమలు కాలేదంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి కొండూరి రవీందర్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జి తుల ఉమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 420 మీటర్ల పొడవైన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడమే కార్యక్రమం ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరఫున మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని రవీందర్‌రావు హెచ్చరించారు. తోట ఆగయ్య మాట్లాడుతూ 420 హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవిగౌడ్, సుంకపాక మనోజ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్‌పై ఎఫ్ఐఆర్.. కాంగ్రెస్ భగ్గు

**సికింద్రాబాద్‌లో డీసీసీ నిరసన.. పాల్గొన్న డాక్టర్ కోట నీలిమ**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ ఘటనకు సంబంధించి నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను నిరసిస్తూ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎం.జి.రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమతో పాటు కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, ఫ్రంటల్స్, సెల్స్, విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.అ ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి బాధ్యత అని అన్నారు. హల్ద్వానీ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తే, ఆయనపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతును అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించబోదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని, కేసులు, బెదిరింపులతో నాయకులు, కార్యకర్తలను వెనక్కి తగ్గించలేరని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ మాట్లాడుతూ.. హల్ద్వానీ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఘటనను ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం అన్యాయమని అన్నారు. ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్ 12న హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ శిబిరం

- ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించనున్న కోదండరామ్
- 12 ఏళ్లుగా కొనసాగుతున్న రక్తదాన కార్యక్రమం



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న భారీ రక్తదాన శిబిరానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు వందలాది మంది ప్రాణాలు కాపాడేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. ఈసారి యువత, ఆరోగ్యవంతులు పెద్దఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం చేసి రోగులు, క్షతగాత్రులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సేకరించిన రక్తాన్ని అవసరమైన వారికి అందించేలా స్వచ్ఛంద సంస్థలకు అందజేస్తామని తెలిపారు. రక్తం సకాలంలో అందక ఎన్నో ప్రాణాలు ప్రమాదంలో పడుతున్న నేపథ్యంలో రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుకోవాలని విజయ్‌కుమార్ కోరారు.

## తాండూరు సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

- శాశ్వత తాగునీటి కోసం రూ.110 కోట్ల నిధులు మంజూరు
- కౌన్సిల్ సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉండాలి
- విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



**తాండూరు, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** పట్టణ సమగ్ర అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. 18 అంశాలతో కూడిన ఎజెండాపై కౌన్సిలర్లు చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తాండూరుకు శాశ్వతంగా తాగునీరు అందించేందుకు రూ.110 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కాగ్నా తాగునీటి పథకాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ తాండూరులోనే నిర్మిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రుల్లో ఐసీయూ ఏర్పాటు చేయలేదని, కాంట్రాక్టు సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించలేదని విమర్శించారు. కౌన్సిల్ సమావేశాలు విమర్శలు, ప్రతివిమర్శలకు పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని అన్నారు. విద్యారంగంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఏటీసీ సెంటర్లతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. గతంలో ఎన్నికల సమయంలో శిలాఫలకాలకు ప్రాధాన్యం ఇచ్చారని, తమ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి పనులకే పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్ల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రజల భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఆదర్శ తాండూరును నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రాకేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలన్నీ బకాయిలేనా..?

- కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ 'బాకీ కార్డు' అస్త్రం
- వెయ్యి రోజుల పాలనపై బోడుప్పల్, పీర్జాదిగూడలో నిరసన
- 420 మీటర్ల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ
- ఏడు రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం



**బోడుప్పల్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ 'బాకీ కార్డు' పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకుంటున్న నేపథ్యంలో బోడుప్పల్, పీర్జాదిగూడలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను గుర్తుచేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించి, హామీల అమలుపై వివరాలతో కూడిన 'బాకీ కార్డులు', కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సమస్యలపైనా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏవి అమలయ్యాయి.. ఏవి బకాయిగా మిగిలాయనే విషయాన్ని ప్రజలకు వివరించడమే కార్యక్రమం ఉద్దేశమని జక్క వెంకట్‌రెడ్డి, మంద సంజీవరెడ్డి తెలిపారు. రాబోయే ఏడు రోజుల పాటు వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మహిళా, యువజన విభాగాల ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు వేగం

- లెండి, నాగమడుగు పనులపై కీలక సమీక్ష
- జాప్యానికి కారణాలు గుర్తించి అడ్డంకులు తొలగించాలి
- మహారాష్ట్ర-తెలంగాణ అధికారుల సమన్వయంతో పనులు
- నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశం



**నిజాంసాగర్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** జుక్కల్ నియోజకవర్గ రైతుల సాగు నీటి అవసరాలను తీర్చేందుకు పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులను ఆదేశించారు. లెండి, నాగమడుగు ప్రాజెక్టుల పురోగతితో పాటు నియోజకవర్గంలోని నీటి వనరుల అభివృద్ధి పనులపై మహారాష్ట్ర, తెలంగాణ సాగునీటి శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యానికి సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర కారణాలు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మహారాష్ట్ర-తెలంగాణ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పెంచి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## భగాయత్‌కు ఫుట్‌పాత్ మహర్దశ

- రూ.36.20 కోట్లతో 41.16 కిలోమీటర్ల మేర నిర్మాణం
- ఫేజ్-1, ఫేజ్-2లో ప్రధాన, అంతర్గత రహదారులకు కొత్త రూపు
- పాదచారుల భద్రతకు ప్రత్యేక నడక మార్గాలు
- పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి

**ఉప్పల్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** ఉప్పల్ భగాయత్‌లో పాదచారుల కష్టాలు తీరనున్నాయి. ఫేజ్-1, ఫేజ్-2 లేఅవుట్లలో మొత్తం రూ.36.20 కోట్ల అంచనా వ్యయంతో 41.16 కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రధాన రహదారులతో పాటు కాలనీ, అంతర్గత, అనుసంధాన రహదారులను పనుల్లోకి తీసుకున్నారు. ప్రస్తుతం పలు చోట్ల ఫుట్‌పాత్‌లు లేక పాదచారులు రోడ్డుపైనే నడవాల్సి వస్తుండటంతో ప్రమాదాల ముప్పు నెలకొంది. ప్రతిపాదిత పనులు పూర్తయితే పాదచారులకు ప్రత్యేక నడక మార్గాలు అందుబాటులోకి రానున్నాయి. ఫేజ్-1లో రూ.25.60 కోట్లతో 29.20 కిలోమీటర్లు, ఫేజ్-2లో రూ.10.60 కోట్లతో 11.96 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. ఫేజ్-1లో రోడ్ నంబర్ 11, మెయిన్ రోడ్‌తోపాటు 6, 48, 55, 22, 35, 36, 44, 45, 46, 47 తదితర రహదారులు, నివాస ప్రాంతాల రోడ్లు, అంతర్గత మార్గాలు ఉన్నాయి. ఫేజ్-2లో 2, 4, 5, 6, 7, 8, 9, 12, 13, 14 రోడ్లతో పాటు 1, 3 కనెక్టివిటీ రోడ్లలో ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నారు. భగాయత్‌లో నివాస, వాణిజ్య కార్యకలాపాలు పెరగడంతో వాహనాల రద్దీ కూడా అధికమవుతున్న నేపథ్యంలో ఈ పనులకు ప్రాధాన్యం లభించింది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులకు ఈ సదుపాయం మరింత భద్రత కల్పించనుంది. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా, వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకుండా, డ్రైనేజీకి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పనులు పూర్తయితే భగాయత్ ప్రధాన, అంతర్గత రహదారులకు కొత్త రూపు రావడంతోపాటు పాదచారుల రాకపోకలు మరింత సురక్షితం కానున్నాయి.

## హైదరాబాద్‌లో బాలల అభివృద్ధికి సమగ్ర సేవలు

- అంకురా-న్యూ హొరైజన్స్ భాగస్వామ్యంతో కొత్త కేంద్రాలు
- గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలో సేవలు ప్రారంభం
- వివిధ విభాగాల నిపుణులతో ఒకేచోట చికిత్స
- ఆటిజం, ఏడీహెచ్‌డీ, సెరెబ్రల్ పాల్సీ తదితర సమస్యలకు సేవలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** బాలల అభివృద్ధి, సంరక్షణకు సంబంధించి సమగ్ర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అంకురా హాస్పిటల్స్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్, న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా గచ్చిబౌలి, కేపీహెచ్‌బీలో న్యూ హొరైజన్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించారు. ఈ కేంద్రాలను అల్లు స్నేహారెడ్డి ప్రారంభించగా, అంకురా హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం, న్యూ హొరైజన్స్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ సమీర్ హెచ్. దల్వాయి తదితరులు పాల్గొన్నారు. బాలల అభివృద్ధి అవసరాలను గుర్తించి ఒకే చోట వివిధ వైద్య, థెరపీ సేవలు అందించడమే ఈ కేంద్రాల లక్ష్యం. డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్లు, ఆక్యుపేషనల్ థెరపిస్టులు, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్టులు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, స్పీచ్, లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ థెరపిస్టులు సేవలు అందించనున్నారు. ఆటిజం, ఏడీహెచ్‌డీ, లెర్నింగ్ డిజెబిలిటీ, సెరెబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్‌తో పాటు భావోద్వేగ, ప్రవర్తనా సమస్యలున్న చిన్నారులు, కౌమార దశ పిల్లలకు అవసరమైన సేవలను అందిస్తారు. 2003లో ముంబైలో ప్రారంభమైన న్యూ హొరైజన్స్ ప్రస్తుతం పలు కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోంది. భారతీయ కుటుంబాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన న్యూ హొరైజన్స్ డెవలప్‌మెంటల్ ప్రోగ్రామ్ ద్వారా సేవలను విస్తరిస్తున్నట్లు డాక్టర్ సమీర్ దల్వాయి తెలిపారు. సరైన సమయంలో సరైన వైద్యం అందించడంతోపాటు పిల్లల శారీరక, అభివృద్ధి, భావోద్వేగ అవసరాలను సమగ్రంగా పరిష్కరించడమే లక్ష్యమని డాక్టర్ కృష్ణ ప్రసాద్ రావు వున్నం పేర్కొన్నారు. గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ కేంద్రాలు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనున్నాయి. కుటుంబాలు వేర్వేరు ప్రాంతాల్లోని నిపుణులను సంప్రదించాల్సిన అవసరం తగ్గడంతోపాటు సమన్వయంతో కూడిన బాలల అభివృద్ధి సేవలు అందుబాటులోకి రానున్నాయి.






# చేసేదంతా చేసి..
# బీసీ కార్డు బయటకు తీసిన కొండా సురేఖ

తెలియజేశాను. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఇవాళ ఖర్గేను కలిసిన సందర్భంగా కోరాను" అని కొండా సురేఖ అన్నారు.

**నాపై ఎవరు ఆరోపణలు చేయించారో తెలుసు: మంత్రి కొండా సురేఖ**

తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కాంగ్రెస్ పెద్దలను కోరినట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చినట్లు చెప్పారు. నా వ్యవహారంపై పార్టీలో చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదన్నారు. దిల్లీలో విడియాతో కొండా సురేఖ మాట్లాడారు. "కాంగ్రెస్ అధిష్ఠానానికి నేను చెప్పుకోవాల్సిందంతా చెప్పాను. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారు. నా బిడ్డ స్వతంత్రంగా ఉంది. పెళ్లి చేసుకుని ఆ ఇంటి కోడలిగా మాట్లాడిందని అనుకుంటున్నాను. ఆమె జీవితం ఆమె ఇష్టం. నాతో పాటు నా భర్త రాజకీయ జీవితం మా ఇష్టం. నేను మంత్రిగా మంచి




పనితీరు కనబరుస్తున్నాను. అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నా. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నాను. పదవిలో కొనసాగించాలని అధిష్ఠానాన్ని కోరాను.

**నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు..**

నా బిడ్డ వ్యాఖ్యలపై నేను స్పందించను. సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. రోజూ ఎంతో మంది మాట్లాడతారు.. అందులో సుస్మిత కూడా ఒకరు. నా బిడ్డ కాబట్టి నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. ఆమె వ్యాఖ్యలను ఖండించడం, సమర్థించడం చేయను. నా వివరణను వినాక్షి నటరాజన్‌కు చెప్పాను. అధిష్ఠానానికి ఆమె చెప్తానన్నారు. పార్టీలో కొందరితో నాపై ఆరోపణలు చేయించారు. ఎవరు అలా చేయించారో తెలుసు. పేర్లు చెబితే వివాదం అవుతుంది. నాపై ఆరోపణలు చేసిన వారికీ షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. పార్టీ ఆ దిశగానూ ఆలోచించాలి. నాకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు. ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నా.. అందుకే ఇక్కడికి వచ్చి నా బాధ చెప్పుకొన్నా. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చా. పార్టీ తీసుకునే నిర్ణయం బట్టి నా ఆలోచన ఉంటుంది" అని కొండా సురేఖ అన్నారు.







## నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు.. ముగ్గురు అరెస్ట్

**శంషాబాద్,సెప్టెంబర్2(జనంసాక్షి) :** హైదరాబాద్‌లో నకిలీ నోట్లను ముద్రించి మార్కెట్లో చెలామణి చేస్తున్న ముఠాను కమీషనర్స్ టాస్క్‌ఫోర్స్ శంషాబాద్ జోన్, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 2,91,100 విలువైన నకిలీ కరెన్సీతో పాటు నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించిన ప్రింటర్, స్కానర్, లామినేటర్, పేపర్ కట్టర్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చింతల్ తండా, వడ్డిపట్లకు చెందిన రామావత్ రాము అలియాస్ మహమ్మద్ (36), రామావత్ మోతీలాల్ (35), రామావత్ గాంధీ (19)లను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు సుధీర్ జాన్ చేలా అలియాస్ వంశీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీలో 500 రూపాయల నోట్లు 437, 100 రూపాయల నోట్లు 648, 200 రూపాయల నోట్లు 39 ఉన్నాయి.కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సులభంగా డబ్బు సంపాదించేందుకు ప్రధాన నిందితుడు రాము తన బంధువు మోతీలాల్‌తో కలిసి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నకిలీ నోట్ల తయారీపై సమాచారం సేకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కలర్ ప్రింటర్, స్కానర్, ఇతర పరికరాలు కొనుగోలు చేసి అసలు నోట్లను పోలిన నకిలీ నోట్లను తయారు చేశారు. రాత్రి వేళల్లో వైన్‌షాపులు, కూరగాయల మార్కెట్లలో స్వల్ప మొత్తాల్లో వాటిని చెలామణి చేసినట్లు వెల్లడించారు.

పక్కా సమాచారం మేరకు శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, బాలాపూర్ పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణమోహన్, బాలాపూర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐ కె. మన్సూర్ అలీతో పాటు టాస్క్‌ఫోర్స్, బాలాపూర్ పోలీస్ సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న సొత్తు, నిందితులను తదుపరి విచారణ కోసం బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.

























Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370